జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

రంగారెడ్డి | సోమవారం 25 ఆగస్టు 2025 | సంపుటి : 15 | సంచిక : 263 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్

- ఏపీ మంత్రి కందుల దుర్గేష్
- ప్రతిపక్షాలకు ప్రజల మద్దతు లేకపోయినా అవాకులు చవాకులు పేలడం ఎంతవరకు సమంజసం
- కుల, మత, పార్టీ, ప్రాంత, వర్గాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శక విధానంలో సంతృప్త స్థాయిలో పెన్షన్లు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం
- ఒకవేళ పొరపాటున అర్హులెవరికైనా పెన్షన్ తొలగిస్తే మళ్లీ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం

నిడదవోలు

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని.. సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ అయిందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలులోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై ప్రతిపక్షం చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. - మిగతా3లో

## ఎరువుల ధరలు పెంచి అమ్మితే
# కఠిన చర్యలు

- ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కేసులు నమోదు చేయాలి
- జిల్లాల వారీగా ఎరువుల లభ్యత, సరఫరా వివరాలపై ఆరా
- యూరియా, ఎరువుల స్టాక్ చెకింగ్ చేపట్టాలని స్పష్టం
- ఎరువుల ధరలు పెంచి అమ్మిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలి
- ఎరువుల లభ్యత, సరఫరాపై సీఎం టెలికాన్ఫరెన్స్



అమరావతి

వ్యవసాయేతర అవసరాలకు యూరియా తరలిపోకుండా కట్టడి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఎరువుల లభ్యత, సరఫరాపై సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్, డీజీపీ, వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులతో సమీక్షించారు. జిల్లాల వారీగా ఎరువుల లభ్యత, సరఫరా వివరాలపై ఆరా తీశారు. విజిలెన్స్ తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. యూరియా, ఎరువుల స్టాక్ చెకింగ్ చేపట్టాలని స్పష్టం చేశారు. ఎరువుల ధరలు పెంచి అమ్మిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎంతమేర ఎరువులు సరఫరా జరుగుతుందో అధికారులు - మిగతా3లో



## రాహుల్ ఓటర్ అధికార్
# యాత్రలో జోష్

- హాజరుకానున్న ప్రియాంక
- కాంగ్రెస్ కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతూ రాహుల్ సోదరి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఈ యాత్రలో పాల్గోనున్నారు.
- రాహుల్ యాత్రలో ప్రియాంక పాల్గొనడం ద్వారా ఓట్ల చోరీకి వ్యతిరేకంగా జరుగుతున్న యాత్రలో మహిళల మద్దతు
- ాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్‌పై రెండు కిలోమీటర్లు యాత్ర

## ఆ ఓటర్లలో 98శాతం మంది పత్రాలు అందాయి

- ఎన్నికల కమిషన్
- పబ్లిష్ చేసిన ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, క్లెయిమ్‌లు తెలియజేసేందుకు మరో ఎనిమిది రోజుల గడువు
- ముసాయిదా జాబితాలో తప్పుగా నమోదైన వివరాలను సరిచేయించుకోవడానికి ఓటర్లకు ఇదే చివరి అవకాశం వెల్లడి




## ప్రజాస్వామ్య పరిరక్షణకు
# సురవరం పోరాడారు



- ఏపీముఖ్యమంత్రి చంద్రబాబు
- సుధాకర్ రెడ్డి భౌతిక ఖాయానికి ఏపీ సీఎం నివాళులు
- 'సురవరంతో నాకు సుధీర్ఘ రాజకీయ అనుబంధం ఉంది
- సుధాకర్ రెడ్డి, నేను కలిసి ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాం

హైదరాబాద్

ప్రజాస్వామ్య పరిరక్షణకోసం సీపీఐ నేత సురవరం సుధాకర్ రెడ్డి పోరాడారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం, దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. హిమాయత్ నగర్‌లోని సీపీఐ ప్రధాన కార్యాలయం మఖ్దూం భవన్‌లో సుధాకర్ రెడ్డి భౌతిక ఖాయానికి చంద్రబాబు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డితో ఉన్న రాజకీయ సంబంధాలను గురించి నేతలతో పంచుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.... 'సురవరంతో నాకు సుధీర్ఘ రాజకీయ అనుబంధం ఉంది. సుధాకర్ రెడ్డి, నేను కలిసి ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాం. నిత్యం ప్రజాహితం కోసం ఆయనతో కలిసి పోరాడాము. ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రజలకు సేవలందించారు. సుధాకర్ రెడ్డి నేన్ను ప్రత్యేకంగా అభిమానించేవారు. నేను చేసే పనుల్ని, కార్యక్రమాల్ని అభినందించి ప్రోత్సహించేవారు. ఆయన సేవల్నీ, పోరాటాలను నా జీవితంలో ఎప్పుడూ మర్చిపోలేను. సుధాకర్ రెడ్డి చనిపోయినా పోరాట వారసత్వాన్ని మనకు ఇచ్చిపోయారు. సుధాకర్ రెడ్డి మరణం సీపీఐతో పాటు, తెలుగు వారికి తీరని లోటు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా' అని సీఎం చంద్రబాబు అన్నారు.



## బీజేపీ-రాహుల్‌గాంధీ
# నాటకాన్ని నమ్మొద్దు

- బీహార్ ఓటర్లకు ప్రశాంత్ కిషోర్ హెచ్చరిక
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆర్జేడీ సూచనల ప్రకారమే నడుచుకుంటున్నారు
- బీహారీల సమస్యలపై మాత్రం ఆయన దృష్టి పెట్టడంలేదు
- అదంతా ఆ రెండు పార్టీలు ఆడుతున్న నాటకం
- ఆ నాటకం ఉచ్చులో మీరు పడొద్దని ప్రజలకు పిలుపు

## ఈ అవకాశాన్ని
# ఛాలెంజ్‌గా తీసుకోండి

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి
- పార్టీ ఇచ్చిన అవకాశాన్ని ఛాలెంజ్‌గా తీసుకుని నిలబడాలి
- వైఎస్సార్‌సీపీది ప్రజాపక్షం అని ప్రజల్లోకి తీసుకెళ్లాలి'
- 'మనమంతా బలమైన వ్యవస్థగా రూపొందాం
- మీరంతా మీ శక్తి సామర్థ్యాలు నిరూపించుకునే అవకాశం మీకు పార్టీలో కల్పించబడింది

తాడేపల్లి

వైఎస్సార్‌సీపీ పునాదులను బలంగా నిర్మించడంలో క్రియాశీలక పాత్ర పోషించాలని.. ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శులతో అవగాహనా సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు లేళ్ళ అప్పిరెడ్డి, పూడి శ్రీహరి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ - మిగతా3లో



## ఓట్ల చోరీ జరగనీయం..
# ఈసీని వదలం

- విపక్ష పార్టీలకు వ్యతిరేకంగా ఈసీఐ, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయి
- బీహార్‌లో ఓట్ల చోరీ జరగనీయమం
- సరైన ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ఇవ్వాలని డిమాండ్
- 'ఎన్నికల కమిషన్ ప్రవర్తనను మార్చడం కోసమే మేము ఒత్తిడి చేస్తున్నాం
- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ



## చట్టసభలు.. ప్రజా సమస్యలపై
# చర్చించడానికే గానీ.. రాజకీయ లబ్ధికి కాదు

- పార్లమెంట్‌లో జరిగే చర్చలు దేశాభివృద్ధిని ప్రభావితం చేస్తాయి
- చర్చలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి
- ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాలు విపక్షాల కారణంగా సజావుగా జరగలేదు
- ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు.
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా



# అంతరిక్షం వెళ్లిన తొలి వ్యక్తి హనుమాన్ అన్న బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్.. ట్రోల్స్ చేస్తున్న నెటిజన్లు

అంతరిక్షంలోకి వెళ్లిన తొలి వ్యక్తి హనుమాన్ అని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదానికి దారి తీశాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనా జిల్లాలో ఓ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అనురాగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. అంతరిక్షంలోకి వెళ్ళిన మొదటి వ్యక్తి ఎవరు? అని ప్రశ్నించాడు. దీనికి విద్యార్థులందరూ "నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్" అని సమాధానం ఇస్తారు. అయితే పిల్లలిచ్చిన సమాధానాన్ని ఠాకూర్ ఖండిస్తూ.. నాకు తెలిసి అంతరిక్ష యాత్ర చేసిన తొలి వ్యక్తి హనుమాన్ జీ అంటూ చెప్పుకొచ్చాడు. దీంతో విద్యార్థులందరూ ఒక్కసారిగా షాక్ తిన్నారు. అంతేగాకుండా ఠాకుర్ మాట్లాడుతూ.. మనకు వేల సంవత్సరాల నాటి మన సంప్రదాయం, జ్ఞానం, సంస్కృతి తెలియకపోతే, ఆంగ్లేయులు మనకు చూపించినదే మనం చూస్తాం అందుకే పురాణల



గురించి కూడా తెలుసుకోండి అంటూ ఠాకుర్ తెలిపాడు. అనంతరం, ఉపాధ్యాయులను ఉద్దేశించి.. పాఠ్యపుస్తకాలకు మాత్రమే పరిమితం కాకుండా, మన వేదాలు, సంప్రదాయాలు, జ్ఞానం వైపు దృష్టి సారిస్తే మనకు చాలా విషయాలు తెలుస్తాయి అని సూచించారు. అయితే ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో, అనురాగ్ ఠాకూర్ పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక నెటిజన్ రాసుకోస్తూ.. ఇలాంటి నాయకులు భారతదేశాన్ని వేల సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారా? కనీసం పాఠశాల పిల్లలకు తప్పుడు జ్ఞానం చెప్పకూడదని అనే విషయం తెలియదా అని కామెంట్ చేశారు. మరో నెటిజన్ కామెంట్ చేస్తూ.. పదవీలో ఉన్న మంత్రులు చదువు, శాస్త్రాలను పక్కనపెట్టి కథలను సైన్స్ గా చెబితే పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. చరిత్ర, పౌరాణిక కథలను గౌరవించడం సరైనదే, కానీ విద్యలో నిజం, విజ్ఞానం మాత్రమే ఉండాలి అంటూ రాసుకోచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన వీడియోను మీరు చూసేయండి.

# పని ఒత్తిడి.. పట్టరాని ఆవేశం తీవ్రస్థాయి నిర్ణయాలకు జైకొడుతున్న యువత

**క్రీట్ (గ్రీస్):** తొమ్మిది నెలల క్రితం అమెరికాలో జరిగిన ఒక హత్య మిగతా అన్ని నేరాల మాదిరిగా ఒకటి, రెండు రోజులు మీడియాలో పతాకశీర్షికలకెక్కి కనుమరుగుకాలేదు. హత్య చేసిన హంతకుడిని శిక్షించాలనే డిమాండ్లకు బదులు అతడిని కీర్తిస్తూ లక్షలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు పలకడం యావత్ ప్రపంచాన్ని విస్మయపరిచింది. హత్యను ఖండించాల్సిందిపోయి అతడికి బెయిల్ ఇవ్వాల్సిందేనని ఆన్‌లైన్‌లో ఒక ఉద్యమమే మొదలైంది. 2024 డిసెంబర్‌లో అమెరికాలో అత్యంత సంపన్న ఆరోగ్యబీమా సంస్థ అయిన 'యునైటెడ్ హెల్త్‌కేర్'సీఈఓ బ్రియాన్ థాంప్సన్‌ను షూట్‌చేసి చంపేసిన లిగి మాంజియోన్ అనే యువకుడి గురించే ఇదంతా. హత్య వంటి తీవ్రస్థాయి హింసను ఒక సగటు మనిషి తప్పుబట్టాల్సిందిపోయి వెనకేసుకురావడం వెనకున్న అంతరార్థం ఏమిటనే దానిపై ఇప్పుడు మానసిక వైద్యరంగంలో చర్చమొదలైంది. పనిచేసే చోట నెలకొన్న తీవ్రస్థాయి ఒత్తిడి వాతావరణమే యువత మానసిక అలసటకు గురై, పట్టరాని కోపం, అసహనం, ఉద్రేకం దిశగా పయనింపజేస్తోందని పలువురు మనోవిజ్ఞాన శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. థాంప్సన్‌ను హత్యచేయడం సబబేనని ఆన్‌లైన్‌లో నిర్వహించిన సర్వేలో 41 శాతం యువత వ్యాఖ్యానించడం మారుతున్న యువత ఆలోచన ధోరణులకు అద్దంపడుతోందని మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

**అవినీతి, దురాశపై పట్టరాని కోపం**

తాము పనిచేసే సంస్థలో జరిగే అవినీతి, సంస్థ ఉన్నతాధికారులు, యాజమాన్యం దురాశను నేటి యువత ఏమాత్రం సహించట్లేదు. తీవ్రస్థాయి పని ఒత్తిడి, అనుక్షణం మారుతున్న సంస్థలో పని విధానాలు, ఆధునిక పని వాతావరణం సైతం యువతలో అసంతృప్తి జ్వాలలను రాజేస్తూ చివరకు వారిలో పట్టరాని ఆవేశాన్ని మరింత ఎగదోస్తోంది. అన్ని రంగాలకు సంబంధించి యువ ఉద్యోగులు, కార్మికుల మనసులో గూడు కట్టుకుంటున్న అసంతృప్తి తాలూకు వివరాలతో ఏపీఏ 'సైకాలజీ ఆఫ్ వయలెన్స్'జర్నల్ 'హింస్మాతక పిడివాదం 'పేరిట ప్రత్యేక సంచికను వెలువర్చింది. గ్రీస్‌లోని క్రెటే విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ అలెక్సియోస్ అర్వాంటిస్ సారథ్యంలో ఈ పరిశోధన జరిగింది.

**ఎన్నింటికో దారి తీస్తున్న మానసిక అలసట**

పనిప్రదేశంలో విపరీతమైన ఒత్తిడి కారణంగా మానసిక అలసట పెరిగిపోయి చివరకు భ యం, బాధ, అసంతృప్తి, అసహనం కట్టలు తెంచుకుంటున్నాయి. తమకు అన్యాయం జరి గిపోతోందనే భావన యువతలో పెరిగిపోతోంది. దీంతో అన్యాయానికి హింసతోనే ముగింపు పలకాలనే ధోరణి ఎక్కువవుతోంది. అధ్యయనంలో భాగంగా పరిశోధకులు వందలాది మంది యువ ఉద్యోగుల రోజువారీ మానసిక స్థితిని అంచనావేశారు. మానసిక అలసట, మానసిక స్థితి, హింసాత్మక ఆలోచన స్థాయిలను క్రోడీకరించారు. అతిగా మానసికంగా అలసిపోయినప్పుడు తీవ్రస్థాయి ఆలోచనలు మంచివేనన్న భావన వారిలో పెరిగిపోతోంది. అన్యాయాన్ని అంతమొందించాలంటే హింసే అత్యుత్తమ మార్గమని వాళ్లు



భావిస్తున్నారు. ప్రతిరోజూ ఇలాగే మానసిక అలసటకు గురైతే ఆ స్థాయిలో వారిలో బాధ ఎక్కువవుతోంది. వీటిని మూడురకాల సిద్ధాంతాలతో వర్గీకరించవచ్చని మానసిక నిపుణులు చెబుతున్నారు.

**సాధారణ బాధ సైతం...**

సాధారణ బడలిక సిద్ధాంతం ప్రకారం ప్రతిరోజూ అతిపనితో విసిగిపోయిన సందర్భాల్లో ప్రతికూల ఆలోచనలు వెల్లువెత్తుతాయి. ఇక రెండోసిద్ధాంతం ప్రకారం.. చేస్తున్న పనిలో సంతృప్తిలోపించినప్పుడు సైతం మానసిక అలసట, విసుగు పెరుగుతాయి. ఇక మూడో సిద్ధాంతం ప్రకారం తాము ఎంతగా కష్టపడుతున్నా సరైన ప్రాధాన్యత, ఉన్నతాధికారుల నుంచి ప్రశంస దక్కని సందర్భాల్లోనూ మానసి అలసట ఎక్కువై చివరకు హింసాత్మక ఆలోచనలు ఆ యువ ఉద్యోగులను చుట్టుముడుతున్నాయి. ఈ మూడు రకాల సందర్భాల్లోనూ మెజారిటీ యువత తమ వృత్తిలో తమకు సరైన గౌరవం దక్కనప్పుడు, తమ శ్రమకు తగ్గ ఫలితం లభించనప్పుడు తమకు నచ్చిన మార్గంలో సంతృప్తి సాధించేందుకు హింసాత్మక ఆలోచనలకు జై కొడుతున్నారని సర్వేలో తేలింది.

**వ్యవస్థీకృత మార్పుతో..**

ఈ పెడపోకడలపై బహుళజాతి అంతర్జాతీయ సంస్థలు తక్షణం మేల్కొనాలి. సంస్థ అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కష్టపడుతున్న ఉద్యోగులకు తగు ప్రాధాన్యతనిస్తే తోటి ఉద్యోగుల్లో సైతం సంస్థ పట్ల గౌరవం, వారిలో అంకితభావం అనూహ్యంగా పెరుగుతాయి. అప్పుడు ఇలాంటి హింసాత్మక ఆలోచనల వైపు యువత అస్సలు మళ్లదు. అప్పుడు మానసిక అలసట అనే ఊసే ఉండదు. పనిచేసే చోట పారదర్శకత కనిపించేలా చేయడం సంస్థల విద్యుక్తధర్మం. తాము ఎంతగా సంస్థ కోసం కష్టపడినా గౌరవం దక్కట్లేదని భావించే వారిని మేనేజర్లు వీలైనంత త్వరగా గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపడితే మొత్తం సంస్థలోనే ప్రతికూలవాతావరణం అనేది మటుమాయం అవుతుంది. ఆ మేరకు ఉన్నతాధికారులు, మేనేజర్లకు సైతం శిక్షణనివ్వాలి. కేవలం సంస్థలో ఉన్నప్పుడు ఉద్యోగి పడే ఆవేదనగా దీనిని తేలిగ్గా తీసుకుంటే మొత్తం సమాజంపైనే ఇది చాన్నాళ్ల తర్వాత ప్రతికూల ప్రభావం చూపుతుంది. సంస్థల దురాశపై ధ్వజమెత్తాలనే పెడపోకడలు ఎక్కువై విప్లవవాదం మరింతగా సమాజంలో వేళ్లూనుకుంటుంది. మానసిక అలసటకు గురైన ఉద్యోగి తమ సంస్థ నుంచే సాంత్వన కోరుకుంటాడు. అక్కడి అది దక్కని నాడు సంస్థ మాత్రమే కాదు సమాజం సైతం దాని దుష్ప్రభావాలను ఎదుర్కోక తప్పదని మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు.

**హింసాత్మకం.. సాధారణం**

తమ పరిశోధనపై వైద్యనిపుణులు మరో స్పష్టతనిచ్చారు. "యువతలో మానసిక అలసటకు గురైన ప్రతి ఒక్కరూ ఇలా హింసాత్మక మార్గంలో పయనిస్తున్నారని మేం చెప్పట్లేదు. కానీ ఆ దిశగా అడుగులేసే అవకాశాలు బాగా పెరుగుతున్నాయనేది సుస్పష్టం. ఇది చివరకు హింసాత్మకంగా వ్యవహరించం తప్పు కాదు అనే స్థాయికి యువత ఆలోచన ధోరణి నెమ్మది నెమ్మదిగా మారుతోంది. ఇది అత్యంత ఆందోళనకరం"అని నిపుణులు ఆవేదన వ్యక్తంచేశారు. "నేడు ప్రతి నలుగురిలో ముగ్గురు అతి పనిఒత్తిడి బారిన పడుతున్నారు. దీంతో శ్రామికలోకంలో మెజారిటీ యువత తమకు తెలీకుండానే అతివాదానికి మద్దతుపలుకుతోంది. అధిక పనిఒత్తిడి కారణంగా మానసికఅలసటకు గురైన వారిలో చాలా మందిలో అసహనం పెరిగిపోతోంది. దీంతో విధ్వంసకర ఆలోచనలు మొగ్గ తొడుగుతున్నాయి. ఇవి ప్రజాస్వామ్యయువత విలువలు, చక్కటి, సుహృద్భావ పనివాతావరణానికి గొడ్డలిపెట్టుగా మారుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చూస్తే పనిఒత్తిడి కారణంగా హింసాత్మక ఘటనలు చాలా అత్యల్పస్థాయిలో ఉన్నప్పటికీ వాటి దుష్ప్రభావాలు మాత్రం స్థిరంగా పెరుగుతూ పోతున్నాయి"అని మనోవిజ్ఞాన శాస్త్ర నిపుణులు అభిప్రాయపడ్డారు.

## ఆ ఓటర్లలో 98శాతం మంది పత్రాలు అందాయి

ఇంటర్నెట్‌డెస్క్: బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) సందర్భంగా కొత్తగా నమోదు చేసుకున్నవారిలో 98.2 శాతం మంది నుంచి ధ్రువీకరణ పత్రాలు ఇప్పటికే అందాయని ఎన్నికల కమిషన్ ఆదివారం వెల్లడించింది. తాజాగా పబ్లిష్ చేసిన ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, క్లెయిమ్‌లు తెలియజేసేందుకు మరో ఎనిమిది రోజుల గడువు ఉంది. ముసాయిదా జాబితాలో తప్పుగా నమోదైన వివరాలను సరిచేయించుకోవడానికి ఓటర్లకు ఇదే చివరి అవకాశమని ఈసీ వెల్లడించింది. ఓటర్లు ఎన్యుమరేషన్ ఫామ్స్ ఇచ్చిన సమయంలో సమర్పించని పత్రాలను ఇప్పుడు సబ్మిట్ చేయవచ్చని వెల్లడించింది. "బిహార్ సీఈవో ఇచ్చిన సమాచారం ప్రకారం ఇప్పటి వరకు 98.2 మంది పత్రాలు అందాయి" అని ఈసీ పేర్కొంది. జూన్ 24 నుంచి ఆగస్టు 24లోపు ఇవి ఈసీకి చేరాయి. సగటున రోజుకు 1.64శాతం మంది సమర్పించినట్లైంది. సెప్టెంబర్ 1వ తేదీ వరకు సమయం ఉందని వెల్లడించింది.

## ఓట్ల చోరీ జరగనీయం.. ఈసీని వదలం

అరారియా: బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు సంబంధించి భారత ఎన్నికల కమిషన్ భారతీయ జనతా పార్టీ పై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అదివారంనాడు విమర్శల దాడి కొనసాగించారు. విపక్ష పార్టీలకు వ్యతిరేకంగా ఈసీఐ, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. బిహార్‌లోని ఆరారియాలో రాష్ట్రీయ జనతా దళ్ నేత తేజస్వి యాదవ్‌తో కలిసి మీడియా సంయుక్త సమావేశంలో రాహుల్ మాట్లాడారు. బీహార్‌లో ఓట్ల చోరీ జరగనీయమని అన్నారు. సరైన ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'ఎన్నికల కమిషన్ ప్రవర్తనను మార్చడం కోసమే మేము ఒత్తిడి చేస్తున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. బిహార్ ఎన్నికల్లో ఓట్ల చోరీని జరగనీయం. మీరు మహారాష్ట్రలో దొంగిలించారు. హర్యానాలో ఓట్ల చోరీ చేశారు. కర్ణాటకలో ఓట్ల చోరీ జరిగినట్టు చాలా స్పష్టంగా చూపించాం. ఇక్కడ ఎంతమాత్రం ఓట్ల చోరీ జరగనీయం' అని రాహుల్ స్పష్టం చేశారు. ఓట్ల చోరీ ఆరోపణలపై తామడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంలో ఈసీ విఫలమైందని రాహుల్ అన్నారు. ఎన్నికల సంఘం తటస్థంగా లేదని, ఈసీఐ, ఎన్నికల కమిషనర్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ అఫిడిట్ సమర్పించకుంటే ఆరోపణలు నిరాధారమని భావించాల్సి వచ్చిందని ఈసీ చెబుతోందని, అనురాగ్ ఠాకూర్ ఇదే తరహా ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహించినప్పటికీ ఆయనను అఫిడవిట్ సమర్పించమని అడగలేదని ఆయన పేర్కొన్నారు. మహాఘట్‌బంధన్ పోల్ మేనిఫెస్టోపై అడిగినప్పుడు, రైతులకు సంబంధించి చాలా ఐడియాలు ఉన్నాయని, రైతు ప్రయోజనాల పరిరక్షణకు మేనిఫెస్టో కమిటీ కసరత్తు చేస్తోందని చెప్పారు.

## చట్టసభలు.. ప్రజా సమస్యలపై చర్చించడానికే గానీ.. రాజకీయ లబ్ధికి కాదు

**ఢిల్లీ:** చట్ట సభలు.. ప్రజాసమస్యలపై చర్చలు జరపడానికే గానీ.. రాజకీయ లబ్ధి పొందేలా వ్యవహరించడానికి కాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న 'ఆల్ ఇండియా స్పీకర్స్ సమావేశం'లో కేంద్రమంత్రి పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్‌లో జరిగే చర్చలు దేశాభివృద్ధిని ప్రభావితం చేస్తాయని చెప్పారు. "చర్చలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాలు విపక్షాల కారణంగా సజావుగా జరగలేదు. ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. దీని గురించి ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆలోచించాలి. అర్థవంతమైన చర్చలు జరగాలి. సభా గౌరవాన్ని, స్పీకర్ పదవి గౌరవాన్ని పెంపొందించడానికి కృషి చేయాలి. ప్రజాసమస్యలపై నిష్పాక్షపాతమైన చర్చలు జరపడానికి చట్ట సభలను వేదికగా మార్చుకోవాలి. వాటి నిబంధనల మేరకు సమావేశాలు జరిగేలా చూడాలి"అని అన్నారు. సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి తొలి భారతీయ స్పీకర్‌గా పనిచేసిన విఠల్‌భాయ్ పటేల్‌కు కేంద్రమంత్రి అమిత్ షా నివాళులర్పించారు. వందేళ్ల క్రితం స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికతోనే దేశంలో పార్లమెంటరీ చరిత్ర మొదలైందన్నారు. అప్పటి బ్రిటిష్ పాలనలో 1919 డిసెంబర్ 24న దేశంలో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఏర్పాటైంది. 1925లో విఠల్‌భాయ్ పటేల్ ఈ సభకు స్పీకర్‌గా ఎన్నికయ్యారు.

## ఓటర్ లిస్టులో ఇద్దరు పాక్ మహిళలు.. దర్యాప్తు షురూ



**పట్నా:** బీహార్ ఓటర్ల లిస్టులో వింత వైనాలు వెలుగు చూస్తున్నాయి. 1950లలో భారత్‌లోకి ప్రవేశించిన ఇద్దరు పాకిస్తానీ మహిళలు బీహార్‌లో ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు వెల్లడయ్యింది. దీనిపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దర్యాప్తు ప్రారంభించింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం హోం మంత్రిత్వ శాఖ ఇటీవల వీసా గడువు ముగిసిన తర్వాత కూడా దేశంలోనే ఉండిపోయిన విదేశీయుల రికార్డులను తనిఖీ చేస్తున్నప్పుడు ఈ ఉదంతం వెలుగు చూసింది. భాగల్పూర్‌కు చెందిన ఇద్దరు మహిళలు విదేశీ పౌరులుగా ఓటర్ల సవరణలో తేలారని అధికారులు నిర్ధారించారు. ఓటర్ల ధృవీకరణ నిర్వహించిన బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ)మాట్లాడుతూ ఆ మహిళలకు సరిపోయే పాస్‌పోర్ట్ వివరాలతో కూడిన అధికారిక సమాచారం అందిందన్నారు. వారిలో ఒకరి పేరు ఇమ్రానా ఖానం. ఆమె వృద్ధురాలు. అనారోగ్యంతో ఉన్నందున మాట్లాడే స్థితిలో లేదు. ఆమె పాస్‌పోర్ట్ 1956 నాటిది. ఇంకొక మహిళ కూడా ఇలానే భారత్‌లో ఉంటున్నారు. శాఖాపరమైన సూచనలను అనుసరించి వారి పేర్లను తొలగించే ప్రక్రియను ప్రారంభించామని సంబంధిత అధికారులు తెలిపారు. కాగా ఈ పాక్ మహిళల ఉదంతం అధికారిక విచారణలో ఉంది. ఉన్నతాధికారులు వీరిపై తదుపరి చర్యలు తీసుకోవాల్సివుంది. దీనిపై ఆగస్టు 11న హోం మంత్రిత్వ శాఖ నుండి నోటీసు స్థానిక ఎన్నికల కార్యాలయానికి చేరుకుంది. తక్షణం వారిపై చర్యలు చేపట్టాలని దానిలో కోరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిర్వహించిన ఓటరు కార్డుల సవరణ వివాదానికి దారితీసింది. ప్రతిపక్ష పార్టీలు ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని, ఇవి జరగుతున్నాయని ఆరోపించాయి. అయితే నిస్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా చూడాల్సిన బాధ్యతతోన ఈ సవరణ చేపట్టామని సంబంధిత అధికారులు తెలిపారు.

## రాహుల్ ఓటర్ అధికార్ యాత్రలో జోష్



**పూర్ణియా:** బిహార్‌లో రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర' కొనసాగుతోంది. కాంగ్రెస్ కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతూ రాహుల్ సోదరి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఈ యాత్రలో పాల్గోనున్నారు. సుపౌల్ సీతమర్హి లో ఈనెల 26, 27 తేదీల్లో రాహుల్‌తో ప్రియాంక కలిసి పాల్గొంటారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్ తెలిపారు. బిహార్‌లో హిందువులు ముఖ్యమైన పండుగగా భావించే హర్తాలికా తీజ్ కూడా ఈనెల 26న జరుగనుంది. వివాహిత స్త్రీలు ఈ పండుగలో భర్త దీర్ఘాయుష్షు, సౌభాగ్యం కోసం రోజంతా ఉపవాస వ్రతం పాటిస్తారు. ప్రియంక గాంధీ తన పర్యటనలో భాగంగా సీతామర్హిలోని జానకిమాత ఆలయంలో పూజల్లో పాల్గొంటారు. రాహుల్ యాత్రలో ప్రియాంక పాల్గొనడం ద్వారా ఓట్ల చోరీకి వ్యతిరేకంగా జరుగుతున్న యాత్రలో మహిళల మద్దతు కూడా కూడగడతారని కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు తెలిపారు. కాగా, రాహుల్ గాంధీ ఆదివారంనాడు పూర్ణియా జిల్లాలో యాత్ర సాగించారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్‌పై రెండు కిలోమీటర్లు యాత్ర సాగించారు. మార్గమధ్యలో జాలాగఢ్ సమీపంలోని రోడ్డుపక్కనే ఉన్న ధాబా వద్ద రాహల్ ఆగి టీ తాగుతూ స్థానికులతో ముచ్చటించారు. బిహార్‌లో అక్టోబర్-నవంబర్ మాసాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల కమిషన్ బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టడం, సవరించిన ఓటర్ల జాబితాను ప్రకటించడంపై విపక్షాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. లక్షలాది ఓటర్లను జాబితా నుంచి తొలగించారని, పెద్ద సంఖ్యలో నకిలీ ఓటర్లను చేర్చారని, తద్వారా బీజేపీతో కలిసి ఓట్ల చోరీకి ఈసీ పాల్పడుతోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు ఆధారాలుంటే రాహుల్ అఫిడవిట్ సమర్పించాలని, అలా చేయకుంటే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఈసీ డిమాండ్ చేసింది. అయితే రాహుల్ తన వాదనకే కట్టుబడుతూ బిహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' కొనసాగిస్తున్నారు.

## బీజేపీ-రాహుల్‌గాంధీ నాటకాన్ని నమ్మొద్దు



బీహార్ ఓటర్లను ప్రతిపక్ష కాంగ్రెస్, అధికార బీజేపీ పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఎన్నికల వ్యూహకర్త, జన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ విమర్శించారు. ఆ రెండు పార్టీలు ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలను వదిలేసి 'ఓట్ చోరీ' పైనే పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆర్జేడీ సూచనల ప్రకారమే నడుచుకుంటున్నారని, బీహారీల సమస్యలపై మాత్రం ఆయన దృష్టి పెట్టడంలేదని ప్రశాంత్ కిషోర్ ఆరోపించారు. ఎన్నికల వేళ రాహుల్ గాంధీని ప్రధాని నరేంద్ర మోదీ, ప్రధాని నరేంద్ర మోదీని రాహుల్ గాంధీ పరస్పరం విమర్శించుకుంటున్నారని ప్రశాంత్ కిషోర్ చెప్పారు. అదంతా ఆ రెండు పార్టీలు ఆడుతున్న నాటకమని, ఆ నాటకం ఉచ్చులో మీరు పడొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. పేదరికం, నిరుద్యోగం, వలసలు, సరైన విద్యా సౌకర్యాలు లేకపోవడం లాంటివి బీహార్‌లో అసలైన సమస్యలని, ప్రధాన పార్టీలు ఈ సమస్యలను గాలికి వదిలేశాయని ప్రశాంత్ కిశోర్ విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా తాను 'జన్ సూరజ్ పార్టీ' ని స్థాపించానని చెప్పారు.

# కోటరీ నుంచి బయటకు ఎప్పుడు

**విజయవాడ :** అధికారం పోయిన తర్వాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా వివిధ కేసుల్లో జైలుకు వెళ్తున్నారు. వల్లభనేని వంశీ నుంచి కాకాణి గోవర్ధన్ రెడ్డి వరకూ చాలా మంది నేతలు జైళ్లకు వెళ్లారు. వారందర్నీ జగన్ ఆయా జైళ్లకు వెళ్లి పరామర్శించారు. పోసాని వంటి కొంత మందిని పరామర్శించలేదు. అదే సమయంలో లిక్కర్ స్కామ్ లో అరెస్టయిన వారెవర్నీ పరామర్శించలేదు. ఈ కేసులో అరెస్టు అయిన వారందరూ జగన్‌కు అత్యంత సన్నిహితులే. మిథున్ రెడ్డి .. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు. ఆయనకు లిక్కర్ కేసుతో ఏం సంబంధం లేదని జగన్ పలుమార్లు ప్రెస్మీట్లలో చెప్పారు. అయితే సుప్రీంకోర్టులోనూ ఊరట లభించకపోవడంతో చివరికి రాజంపేట ఎంపీ అరెస్టు కావాల్సి వచ్చింది. కానీ జగన్మోహన్ రెడ్డి ఇప్పటి వరకూ ఆయనను పరామర్శించలేదు. ఇరవై ఐదో తేదీన జగన్ .. మిథున్ రెడ్డిని పరామర్శించేందుకు రాజమండ్రి వస్తారని బొత్స సత్యనారాయణ ప్రకటించారు. కానీ ఒక్క రోజులోనే ఆ ప్రోగ్రాం క్యాన్సిల్ అయినట్లుగా బొత్స ప్రకటించారు. ఇక జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా పని చేసిన రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డిలను కూడా జగన్ పరామర్శించలేదు. వారిద్దరూ జగన్ కు అత్యంత సన్నిహితులు. ధనుంజయ్ రెడ్డి.. జగన్ సీఎంగా ఉన్న ఐదు సంవత్సరాల పాటు సీఎంవోలో చక్రం తిప్పారని అంటారు. అన్ని పనులు ఆయన చేతుల మీదుగానే జరిగేవని చెబుతారు. అలాంటి ధనుంజయ్ రెడ్డి అరెస్టు అయినా జగన్.. జైలుకు వెళ్లి పరామర్శించలేదు. కృష్ణమోహన్ రెడ్డి కూడా జగన్‌కు సన్నిహితులే. వీరిని కూడా ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు వస్తున్నాయి. లిక్కర్ కేసులో జగన్మోహన్ రెడ్డి పేరు కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. సిట్ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌లో జగన్ ప్రస్తావన ఉంది. అసలు ఈ లిక్కర్ స్కామ్‌లో అంతిమ లబ్దిదారుడు జగన్మోహన్ రెడ్డేనని సిట్ చెబుతోంది. ఇలాంటి సమయంలో లిక్కర్ కేసు నిందితుల్ని పరామర్శించకపోవడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉందంటున్నారు. వారిని పరామర్శిస్తే అందరూ కలిసి ప్లాన్ చేశారని.. అందుకే వారి కోసం జైలుకు వచ్చారని ప్రచారం జరిగే అవకాశం ఉందని వైసీపీ వర్గాలు అనుమానిస్తున్నాయి. లాయర్లు, న్యాయనిపుణుల సూచనల మేరకే జగన్.. తనకు అత్యంత ఆత్మీయులు అయినప్పటికీ లిక్కర్ కేసు నిందితుల్ని జైలుకు వెళ్లి పరామర్శించడం లేదని చెబుతున్నారు. అయితే టీడీపీ నేతలు మాత్రం జగన్మోహన్ రెడ్డి అందర్నీ బలి చేసి తాను తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శిస్తున్నారు.



కోటరీ నుంచి బయటకు ఎప్పుడు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయి పదమూడు నెలలు కావస్తుంది. ఈ పదమూడు నెలల్లో పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు ఏమైనా తీసుకున్నారంటే ఏమీ లేదనే చెప్పాలి. ప్రభుత్వ నిర్ణయాలు, హామీలు అమలు చేయకపోవడంపై నిరసనలు వ్యక్తం చేయడం మినహా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి తీసుకున్న చర్యలు ఏమైనా ఉన్నాయా? అంటే శూన్యమే అని చెప్పాలి. వైసీపీ అధినేత వైఎస్ జగన్ బెంగళూరు నుంచి తాడేపల్లికి నెలలో రెండు సార్లు రావడం అందుబాటులో ఉన్న నేతలతో సమావేశం కావడం మినహా మరే రకమైన కార్యక్రమాలను చేపట్టలేదు. ఇక రైతుల సమస్యలపై జిల్లాలకు వెళ్లి వారి బాగోగులను తెలుసుకోవడం, అక్రమ కేసుల్లో ఇరుక్కున్న పార్టీ నేతలను పరామర్శించడం వంటి వాటితో సరిపెట్టేశారు. ఇక ఓటమిచెందిన తొలి నాళ్లలో ముఖ్య కార్యకర్తలతో జగన్ ముఖాముఖి అని హడావిడి చేసినా ఒకటి రెండు జిల్లాలతోనే సరిపెట్టేశారు. అందులోనూ స్థానికసంస్థల ప్రతినిధులు అధికార పార్టీకి వెళ్లకుండా ఉండేందుకు తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశాలు పెట్టి పార్టీలో కొనసాగితే రాజకీయ భవిష్యత్ ఉంటుందని భరోసా ఇచ్చారు. నిజానికి 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలయిన తర్వాత చంద్రబాబు ఊరికే కూర్చోలేదు. జిల్లాలను పర్యటించారు. నేరుగా జిల్లాలకే వెళ్లిన చంద్రబాబు నేతలు,కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఇప్పుడు ఓటమి భవిష్యత్ విజయానికి నాంది అని చెప్పి క్యాడర్ లో ధైర్యం నింపడంలో నాడు చంద్రబాబునాయుడు సక్సెస్ అయ్యారు. కానీ అధికారంలో ఉన్నప్పుడు జగన్ ఎలా ఉన్నారో.. కోల్పోయినప్పుడు కూడా అదే స్థాయిలో తాడేపల్లి పార్టీ కార్యాలయాన్ని వీడటం లేదు. పాదయాత్ర చేస్తారనని అంటున్నాఅందుకు చాలా సమయం ఉంది. కానీ అంతకంటే ముందుగా జిల్లాల్లో సమావేశాలు నిర్వహించాలి. జిల్లా కేంద్రాల్లో అన్ని నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తలు,నేతలను పిలిచి మాట్లాడాలి. వారి అభిప్రాయాలను తెలుసుకోవాలి. అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వం చేసిన తప్పులను వారి నుంచి తెలుసుకోవాలి. ఓపిగ్గా వినాలి. మరొకసారి అధికారంలోకి వస్తే అలాంటి తప్పులు దొర్లవన్నహామీ వారికి అక్కడే ఇవ్వగలిగాలి. అంతేకాని అధికారంలో ఉన్నప్పటి లాగానే కోటరీ మధ్య చిక్కుకుంటే పరిస్థితుల్లో మార్పు రాదన్న విషయం జగన్ గుర్తించాలన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. మరి నేను ఉన్నాను.. నేను విన్నానంటూ జనం మధ్య నాడు వెళ్లినట్లే ఇప్పుడు క్యాడర్ మధ్యకు వైసీపీ చీఫ్ వెళ్లాల్సి ఉంది.

## ఎరువుల ధరలు పెంచి అమ్మితే కఠిన చర్యలు

-మొదటిపేజీ తరువాయి

వివరించారు. ప్రైవేటు డీలర్లకు ఎరువుల కేటాయింపు తగ్గించి మార్క్‌ఫెడ్ ద్వారానే ఎక్కువగా సరఫరా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. యూరియా సరఫరా విషయంలో రైతులు ఇబ్బంది పడకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఎరువులు పక్కదారి పట్టకుండా చూడాలన్నారు.

## ఈ అవకాశాన్ని ఛాలెంజ్‌గా తీసుకోండి

-మొదటిపేజీ తరువాయి

బాబు, లీగల్ సెల్ అధ్యక్షుడు ఎం.మనోహర్ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులంటే జిల్లాలో పార్టీకి కమాండర్ లాంటి వారన్నారు. పార్టీ ఇచ్చిన అవకాశాన్ని ఛాలెంజ్‌గా తీసుకుని నిలబడాలి.. వైఎస్సార్‌సీపీది ప్రజాపక్షం అని ప్రజల్లోకి తీసుకెళ్లాలి” అని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

‘మనమంతా బలమైన వ్యవస్థగా రూపొందాం. మీరంతా మీ శక్తి సామర్థ్యాలు నిరూపించుకునే అవకాశం మీకు పార్టీలో కల్పించబడింది. దానిని ఛాలెంజ్‌గా తీసుకుని మీరు నిలబడాలి. మండల స్థాయి నుంచి బలమైన నాయకత్వం ఉన్నప్పుడే మనం అనుకున్న ఫలితాలు సాధించగలుగుతాం. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజలపక్షాన నిలబడాలి. ప్రభుత్వాన్ని నిలదీయడం, ప్రజల గొంతుకగా మనం నిలబడాలి” అని సజ్జల రామకృష్ణారెడ్డి దిశానిర్దేశం చేశారు.

## సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్

-మొదటిపేజీ తరువాయి

ప్రతిపక్షాలకు ప్రజల మద్దతు లేకపోయినా అవాకులు చవాకులు పేలడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పెద్ద ఎత్తున దివ్యాంగుల పెన్షన్లు తొలగిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని మంత్రి ఖండించారు. కుల, మత, పార్టీ, ప్రాంత, వర్గాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శక విధానంలో సంతృప్త స్థాయిలో పెన్షన్లు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఒకవేళ పొరపాటున అర్హులెవరికైనా పెన్షన్ తొలగిస్తే మళ్లీ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో అర్హులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. కొందరు ఎలాంటి వైకల్యం లేకుండా పెన్షన్ పొందుతున్నట్లు పరిశీలనలో తేలిందన్నారు. అటువంటి వారికి చెక్ పెడతామన్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా స్పష్టం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, జడ్పీటీసీ సూరిబాబు, జనసేన పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 59 మందికి రూ.29.72 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్వోసీ పత్రాల పంపిణీ చేశారు. సీఎం సహాయనిధి ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు మంత్రి దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# హెచ్చరికలతో సరా

**విజయవాడ :** మధ్యకాలంలో టీడీపీ అధినేత ఏపీ సీఎం చంద్రబాబు చాలా ఎక్కువగా వాడుతున్న పదం నేను “95 నాటి చంద్రబాబుని.. ఎవరి అలసత్వాన్ని ఉపేక్షించను “అని. కానీ జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అప్పటి స్ట్రిక్ట్ చంద్రబాబు మళ్లీ కనబడడం కష్టమేనా అని అనుమానాలు వస్తున్నాయి. వరుస పెట్టి పార్టీ నాయకులు వివాదాల్లో చిక్కుకుంటున్నా కొంతమంది హద్దు దాటి ప్రవర్తిస్తున్నా చంద్రబాబు హెచ్చరికలు వరకు మాత్రమే పరిమితం అయిపోతున్నారా అన్న చర్చ పార్టీ వర్గాల్లో సైతం మొదలైంది. ఈ ఒక్క నెలలోనే టిడిపి నాయకులు నాలుగు పెద్ద వివాదాల్లో చిక్కుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్ సినిమా రిలీజ్ అవుతుంటే ఆ సినిమాను ఆడనివ్వం అంటూ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్ ప్రసాద్ హెచ్చరిస్తున్నట్టుగా ఉన్న ఆడియో రిలీజ్ అయింది. అందులో వాడిన దుర్భాషలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల్ని తీవ్రంగా బాధపెట్టాయి. దానితో వాళ్ళు నిరసనలకి దిగారు. ఆడియో తనది కాదని ఎమ్మెల్యే ఎంత చెప్పినా చాలామంది అది ఆయనదే అని నమ్ముతున్నారు. చంద్రబాబు సైతం ఎమ్మెల్యేని పిలిపించి మందలించారు. కానీ ఇప్పటికీ ఆ వివాదం చల్లబడలేదు. నెల్లూరు అరుణ విషయం పార్టీ ఇమేజ్‌ను బాగా దెబ్బతీసింది. ఆమె సన్నిహితుడు యావజ్జీవ ఖైదీ శ్రీకాంత్‌కి పెరోల్ లభించేలా ఇద్దరు టిడిపి ఎమ్మెల్యేలు సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి. అది అటు ఇటు తిరిగి ఏకంగా హోంశాఖకు అంటుకుంది. ప్రస్తుతం శ్రీకాంత్ తిరిగి జైలుకు వెళ్లిపోగా అరుణ కూడా అరెస్టు అయింది. దీనిపై హోంమంత్రి స్వయంగా మీడియాకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తమను వేధిస్తున్నాడు అంటూ ఒక మహిళ మీడియా ముందుకు వచ్చారు. అసభ్యకరమైన వేధింపులు ఎదుర్కొన్నామని ఆరోపణలు చేశారు. దీని ఎమ్మెల్యే స్పందిస్తూ తనపై జరిగిన కుట్రగా ఖండించారు. ఇవన్నీ కూడా ఇండైరెక్టుగానో లేక ఆడియోలపరం గానో నేతలు వివాదాల్లో చిక్కుకున్నవి. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్ని పరిధిలూ దాటేశారు. విధుల్లో ఉన్న అటవీ సిబ్బందిపై తన అనుచరులతోపాటు దాడి చేసినట్టున్న విజువల్స్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిలో అటవీశాఖ డైరెక్ట్ గా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతిలో ఉంది. దీనితో ఆయన సీరియస్ అయ్యారు. మరోవైపు సీఎం చంద్రబాబు కూడా ఎవరిని వదిలిపెట్టొద్దంటూ పోలీసులను ఆదేశించడంతో ఎమ్మెల్యేపై కేసు నమోదైంది. ఈ నాలుగు వివాదాలు ఒక్క నెలలోనే బయటపడడం అనేది ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు ఉన్న అధికార పార్టీ ఎమ్మెల్యేలలో కొంతమంది ఎంత లెక్క చేయకుండా ప్రవర్తిస్తున్నారో అన్న నిజాన్ని బయటపెట్టింది. ఇలాంటి వివాదాలు వరుస పెట్టి బయటపడుతున్నా “చంద్రబాబు మండిపడ్డారు “ “నేతల్ని హెచ్చరించారు “ ఇలాంటి హెడ్డింగ్స్‌కి వార్తలు పరిమితం అవుతున్నాయి తప్ప ఆయన తనదైన శైలిలో యాక్షన్ తీసుకున్న సూచనలు కనిపించడం లేదు. 2024లో గెలిచి పార్టీ అధికారంలోకి వచ్చిన కొత్తలో అసభ్యకరమైన వీడియోలో కనిపించినందుకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేశారు చంద్రబాబు. అలాంటి ఫైర్‌నే తెలుగు ప్రజలు చంద్రబాబు నుంచి ఎదురుచూసేది.నిజంగానే 1995-99 మధ్య చంద్రబాబు అంటే స్ట్రిక్ట్ పొలిటీషియన్, క్రమశిక్షణ కలిగిన అడ్మినిస్ట్రేటర్‌గా దేశవ్యాప్తంగా పేరు ఉండేది. ఆయన కూడా అది గమనించి “తాను 95మోడల్ చంద్రబాబు “గానే పని చేస్తానని పదేపదే చెబుతున్నారు. కానీ గ్రౌండ్ రియాల్టీ అలా కనిపించడం లేదన్న వాదన ఉంది. ఆయన మనసులో ఏముందో తెలియదు గానీ పార్టీ క్రమశిక్షణపరంగా సామాన్య తెలుగు ప్రజలు ఎదురుచూస్తున్న చంద్రబాబు పనితీరు ఇదైతే మాత్రం కాదు అనే విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయి.

# బదిలీల్లో కులం రంగులు

**శ్రీకాకుళం :** శ్రీకాకుళం జిల్లాలో వివాదాస్పదమైన ఓ కేజీబీవీ ప్రిన్సిపాల్ బదిలీ కొత్త మలుపు తిరిగింది. జిల్లాలో ఎప్పటి నుంచి నలుగుతున్న కళింగ వర్సెస్ వెలమ మరోసారి తెరపైకి వచ్చింది. ఈ బదిలీ వ్యవహారంపై స్పందించిన దువ్వాడ శ్రీనివాస్‌సంచలన వ్యాఖ్యలు చేశారు. కళింగ నాయకులను తొక్కేస్తున్నారని ఆరోపించారు. ఇది జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది. శ్రీకాకుళం ప్రశాంతతకు మారు పేరు. అక్కడ రాజకీయం కూడా అంతే కూల్‌గా ఉంటుంది. వివాదాలు పెద్దగా ఉండవు. కానీ ఈ మధ్య కాలంలో అమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. లోలుగు కేజీబీవీలో పని చేస్తున్న ప్రిన్సిపాల్ బదిలీ ఆయన మెడకు చుట్టుకుంది. ఆమెను కంచిలి కేజీబీవీకి బదిలీ చేయడంతో వివాదం రాజుకుంది. తనపై కక్ష పూరితంగా ఎమ్మెల్యే సిఫార్సుతోనే తనను బదిలీ చేశారని ప్రిన్సిపాల్ సౌమ్య ఆరోపించారు. అంతే కాకుండా ఆమె ఆత్మహత్యాయత్నం కూడా చేశారు. సౌమ్య ఆత్మహత్యాయత్నంతో వివాదం రాజకీయ రంగు పులుముకుంది. వైసీపీ దీన్ని తమకు అనుకూలంగా మార్చుకొని కూన రవికుమార్‌ను టార్గెట్ చేసింది. అధికారంలో ఉన్నామనే అహంకారంతో విచ్చలవిడిగా ఉద్యోగులపై కక్షసాధింపులకు దిగుతున్నారని వైసీపీ అనుకూల మీడియా స్టోరీలు ప్రచురించింది. ఇప్పటి వరకు రాజకీయాల్లో యాక్టివ్‌గా లేని ధర్మాన కృష్ణదాసు సౌమ్యను పరామర్శించారు.కట్ చేస్తే సీన్‌లోకి వైసీపీ బహిష్కృత నేత ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వచ్చారు. కూన రవికుమార్‌కు ఆయన మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని అలాంటి బదిలీల్లో వెళ్లేందుకు సిద్ధంగా ఉండే ఎవరైనా ఉద్యోగాల్లో చేరుతారని చెప్పుకొచ్చారు. కానీ సౌమ్య విషయంలో రాద్ధాంతం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని చెప్పుకొచ్చారు.అటు కింజరాపు, ఇటు ధర్మాన ఫ్యామిలీపై దువ్వాడ శ్రీనివాస్ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు.”జిల్లాలో వారం రోజులుగా ఒక ట్రాన్స్‌ఫర్ చర్చనీయాంశంగా మారింది. ఒక ట్రాన్స్‌ఫర్ కోసం ఇంత రచ్చ జరగడం ఎప్పుడూ చూడలేదు. కలెక్టర్ చేసిన ట్రాన్స్‌ఫర్‌పై ఎందుకు రచ్చ జరుగుతోంది. ట్రాన్స్‌ఫర్ సహజమే కదా. మరి ఇది ఎందుకు పొలిటికల్ వార్‌లా మారింది. కులాల ప్రస్తావన ఎందుకు వచ్చింది. దాడులు ఎందుకు జరుగుతున్నాయి? తటస్థ ఎమ్మెల్సీగా పరిశీలిస్తే చాలా విషయాలు వెలుగు చూశాయి. జిల్లావ్యాప్తంగా ఒక కులంపై దాడులు జరుగుతున్నాయి. టెక్కలి నియోజకవర్గంలో మరింత ఎక్కువగా ఉంది. అటెండర్ నుంచి ఆర్టీవో వరకు ఒక కులం వాళ్లే ఉన్నారు. అది మంత్రి కులానికి చెందిన వారు. మిగతా కులాలపై వేధింపులు సర్వసాధారణమైపోయాయి. నియంతృత్వపాలన సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. “ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళింగ కులానికి చెందిన నాయకులు ఎదుగుదల చూడలేక కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు దువ్వాడ శ్రీనివాస్. మంత్రి అచ్చెన్న చెప్పిన వెంటనే కృష్ణదాసు సౌమ్యను పరామర్శించారని ఆరోపించారు. అచెన్న బాధితుడైన అధికారిని మాత్రం ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. ఆయన ఏమన్నారంటే” మంత్రి అచ్చెన్న నిర్వాకం అందరికీ తెలిసిందే. వ్యవసాయ పనిముట్లు ఇచ్చే కంపెనీలతో డైరెక్ట్ మీటింగ్ పెట్టమని పేషీలో ఉన్న రాజమోహన్‌పై ఒత్తిడి తెచ్చారు. అది ఆయన చేయలేక ఒత్తిడి భరించలేక లెటర్ సెలవుపై వెళ్లిపోయారు. దీనిపై కృష్ణదాస్ ఏం చేస్తున్నారు. ఆయన్ని ఎందుకు పరామర్శించలేదు. అచ్చెన్న చెప్పాడని సౌమ్యను పరామర్శించారు. రాజమోహన్ అనుభవించింది మానసిక ఒత్తిడి కాదా... మంత్రి అచ్చెన్నపై విమర్శలు చేయరా. ఎందుకు ఒకే కులాన్ని టార్గెట్ చేస్తున్నారు.” కులాన్ని టార్గెట్ చేస్తున్నారని తమ బుర్రల్లోకి వెళ్తే మాత్రం గేమ్ స్టార్ట్ చేస్తామని ధర్మాన, అచ్చెన్నకు వార్నింగ్ ఇచ్చారు దువ్వాడ. “ఎవడిపై రౌడీయిజం చేయాలని అనుకుంటున్నారు. ఇదే జరిగితే అది మా బుర్రల్లోకి ఎక్కింది అంటే మాత్రం కచ్చితంగా ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, అచ్చెన్నకు వార్నింగ్ ఇస్తున్నాను. మేం గేమ్ స్టార్ట్ చేస్తాం. మరో ఉద్యమం ప్రారంభమవుతుంది. జాతికి నష్టం జరుగుతుంటే కచ్చితంగా నేను నిలబడతాను. ఆ జాతితోపాటు మిగతా కులాలను అన్నింటినీ ఏకం చేస్తాం. ప్రాణత్యాగాలు చేయడానికైనా సిద్ధం. కొందరు చీడపురుగులను వాడుకొని కులంలో చిచ్చు రేపాలని చూస్తారు. వారిని కూడా టార్గెట్ చేస్తాం. కళింగ జాగృతి కోసం ముందడుగు వేస్తాం. కళింగ కులస్తుడిని కాబట్టే వైసీపీ నుంచి తనను సస్పెండ్ చేశారని ఆరోపించారు దువ్వాడ. తాను ఉన్నన్ని రోజులు వారికి మునుగడ ఉండదనే ఈ చర్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. అయినా తాను వెనక్కి తగ్గబోనని అన్నారు. “నేను కళింగ కులానికి చెందిన వాడినని సస్పెండ్ చేశారు. స్పీడ్‌గా ఉంటానని సస్పెండ్ చేశారు. నేను ఉంటే వారి ఉనికి ఉండదని సస్పెండ్ చేశారు. నన్ను ఎదుర్కొని దమ్ము లేక సస్పెండ్ చేశారు. సస్పెండ్ చేస్తే హైదరాబాద్ వెళ్లి బట్టలు మడత పెట్టుకుంటానని అనుకున్నారు. కానీ రాజకీయాలలో మడతేయడానికి వచ్చాను. కులాన్ని వాడుకోవాలనుకుంటే ఎప్పుడో వాడుకునే వాడిని. ఇప్పుడు మాత్రం అన్ని కులాలను వాడుకుంటాను. అన్ని కులాలకు నాయకత్వం వహిస్తాను. కళింగ కులానికి అన్యాయం జరగడంతో ఇతర కులాలు కూడా నష్టపోతున్నాయి. అన్ని కులాలకు బాసటా ఉంటూ ముందు ఉండి నడిపిస్తాం. “ అని అన్నారు.

# విశాఖ చుట్టూ టౌన్ షిప్స్

**విశాఖపట్టణం :** ప్రభుత్వం సరికొత్త ఆలోచనలు చేస్తోంది. ముఖ్యంగా నగరీకరణ పై దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాలు మరింతగా విస్తరించాలని భావిస్తోంది. నగరాల చుట్టూ కొత్తగా థీమ్ బేస్డ్ పట్టణాలు, టౌన్ షిప్ లు, సిటీస్ నిర్మించాలన్న ఆలోచన చేస్తోంది. నగర జనాభా పెరుగుతున్న దృష్ట్యా.. వారి అవసరాలకు అనుగుణంగా ముందే సౌకర్యాలు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే నీతి ఆయోగ్ విశాఖను ప్రత్యేక గ్రోత్ సిటీగా గుర్తించింది. నగరానికి అనుసంధానంగా పట్టణాలు నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దాదాపు 1000 ఎకరాల్లో భూమిని సేకరించనుంది. ఈ విధానాన్ని ఇతర నగరాల్లో కూడా అమలు చేయనున్నారు.విశాఖ నగరం చుట్టూ కొత్త తరహా పట్టణాలు రాబోతున్నాయి. అనకాపల్లి తో పాటు విజయనగరం ప్రాంతాల్లో థీం బేస్డ్ పట్టణాలను, సిటీలను, టౌన్ షిప్ లను అభివృద్ధి చేయనున్నారు. ఐటి, వైద్యం, పర్యాటక రంగం వంటి వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ప్రైవేట్ సంస్థలను ఆశ్రయిస్తారు. ప్రస్తుతం విశాఖ జనాభా 21 లక్షలకు దాటింది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకే చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త పట్టణాలు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది.విశాఖ పరిసర ప్రాంతాల్లో.. విజయనగరం తోపాటు అనకాపల్లి జిల్లాలు ఉన్నాయి. అక్కడ దాదాపు 1000 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములను గుర్తించారు. భూ సమీకరణ పథకం ద్వారా ప్రైవేటు భూములను సమీకరిస్తారు. భూమి యజమానులకు నష్టపరిహారం అందిస్తారు. అయితే ఇలా గుర్తించిన భూముల్లో ఐటి, పర్యాటకం, వైద్యం, వినోదం, వాణిజ్యం, పరిశ్రమలు వంటి విభిన్న రంగాల్లో అభివృద్ధి చేస్తారు. ప్రైవేటు సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వం ఆహ్వానం పలుకుతోంది. తద్వారా స్థానికులకు సైతం ఉద్యోగాలు లభిస్తాయి. ఎప్పటికీ నీతి ఆయోగ్ సిఫార్సులలో విశాఖకు చోటు దక్కింది. గ్రోత్ సిటీగా గుర్తింపు సాధించింది. అయితే ఇటువంటి నగరాలలో అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో లక్ష కోట్లు కేటాయించింది. దీని ద్వారా థీమ్ ఆధారిత నగర నిర్మాణాలు సులువు అవుతాయని అధికారులు భావిస్తున్నారు. మొత్తానికి అయితే విశాఖకు ఈ నిర్ణయంతో మహర్దశ పట్టినట్టే.

## ఏపీలో జాలీ ట్రావెలింగ్

**తిరుపతి :** ఏపీ ప్రభుత్వం పర్యాటక రంగంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పరచాలని భావిస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలో కొత్తగా మూడు మినీ ఎయిర్పోర్టులను తీసుకురావాలని నిర్ణయించింది. హెలికాప్టర్ పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి హెలికాప్టర్ సేవలు అందించడానికి ఏజెన్సీలను ఆహ్వానిస్తోంది. హైదరాబాద్, విజయవాడ, అరకు ప్రాంతాల మధ్య ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. త్వరలో హెలికాప్టర్ పర్యాటకం నిరంతరం అందుబాటులో ఉండేలా ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. నిరంతరం హెలికాప్టర్లు అందుబాటులో ఉంటాయి. పర్యాటక ప్రాంతాలను ఆకాశమార్గంలో చూసే అరుదైన అవకాశం కల్పించనున్నారు.రాష్ట్రంలో హెలిక్యాప్టర్ టూరిజం అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం మూడు ప్రాంతాల నుంచి హెలికాప్టర్లను నడపడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆసక్తి కలిగిన ప్రైవేట్ ఏజెన్సీ ల నుంచి దరఖాస్తులను స్వీకరించనుంది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. ఎక్కడ హెలిప్యాడ్లను ఏర్పాటు చెయ్యాలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోనుంది. ప్రస్తుతం హెలికాప్టర్ ద్వారా పర్యాటకులకు జాలి రైట్ కొన్ని సందర్భాల్లో మాత్రమే అందుబాటులో ఉంటోంది. ఇకనుంచి అలా కాకుండా నిరంతరాయంగా సేవలందిలా చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నం, మచిలీపట్నం, అరకు ఉత్సవాల్లో ప్రైవేట్ వీటిని నిర్వహించాయి. అక్కడ సక్సెస్ ఫుల్ గా కనిపించడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చేస్తోంది.ప్రధానంగా పర్యాటక ప్రాంతాలను కలుపుతూ హెలిక్యాప్టర్లను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం చూస్తోంది. విజయవాడ నుంచి శ్రీశైలం, హైదరాబాద్ నుంచి శ్రీశైలం, అరకు నుంచి విశాఖ మధ్య హెలికాప్టర్ సేవలను నడపాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ప్రతిరోజు విజయవాడ, హైదరాబాదు నుంచి భక్తులు శ్రీశైలం వెళుతుంటారు. వారికోసం రెండు వైపులా హెలిక్యాప్టర్ సేవలు తీసుకొస్తే గిరాకీ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రూట్లో హెలికాప్టర్ సేవలు మొదలుపెడితే మంచి స్పందన వస్తుందని భావిస్తున్నారు.మరోవైపు విశాఖ జిల్లాలో మన్య ప్రాంతంలో మినీ ఎయిర్ పోర్టులు ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తోంది ఏపీ ప్రభుత్వం. చిన్న చిన్న విమానాలతో పాటు హెలికాప్టర్లు ల్యాండ్ అయ్యే విధంగా వీటిని నిర్మించాలన్నది ప్రభుత్వ ప్రణాళిక.

## సంపాదకీయం

# అరెస్ట్ అయితే ఔట్

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు రభస చేశాయి. నేరారోపణలు ఎదుర్కొంటూ రిమాండ్‌లో ఉండేవారు.. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో కొనసాగరాదంటూ ప్రభుత్వం కొత్త బిల్లును పార్లమెంట్ ముందుకు తెచ్చింది. పోలీసు కస్టడీలోకి వెళ్లిన 30రోజుల్లో రాజీనామా చేయాలి.. లేకపోతే పదవి దానంతట అదే పోతుందన్నది కొత్త బిల్లు ముఖ్యాంశముఖ్య ఉద్దేశ్యం ఏంటంటే.. తీవ్రమైన అవినీతి, ఇతర నేరారోపణలు ఎదుర్కొంటున్న వారు.. 30 రోజుల కంటే ఎక్కువగా పోలీసు కస్టడీలో ఉంటే ఆ మరుసటి రోజు నుంచి వారి పదవి ఉండదు. ప్రధాని, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులందరికీ ఈ నిబంధన వర్తింపచేయనున్నారు. 5 ఏళ్ల కంటే ఎక్కువ శిక్ష పడే నేరారోణలు కలిగిన వారందరికీ ఈ నిబంధన వర్తింప చేయాలని కొత్త బిల్లులో ప్రతిపాదించారు. దీనిపైనే ఇండియా అలయెన్స్ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది.నేరం నిరూపణ అయ్యే వరకూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతివ్యక్తి అనుమానితుడు మాత్రమే.. నేరారోణపులు ఎదుర్కొంటున్న వ్యక్తికి నిష్పాక్షికమైన విచారణ కోరుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది. ఆర్టికల్ 21లో ఇది ఓ భాగం. కానీ ఈ కొత్త బిల్లు నేరు నిరూపణ, శిక్ష లేకండానే... కేవలం ఆరోపణల మీద అరెస్ట్ అయినా సరే... పదవి వదులు కోవాలని కొత్త బిల్లులో ప్రతిపాదించారు. ఆర్టికల్ 21 ప్రతివ్యక్తికీ జీవించే హక్కును, వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని కల్పించింది. నేరారోపణలు ఉంటే ఫెయిర్ ట్రయల్ పొందే హక్కు కల్పించింది. అలాగే ఆర్టికల్ 14 చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానులే అని చెబుతోంది. ఇప్పుడు తీసుకొచ్చే రాజ్యాంగ సవరణతో ఈ ప్రాథమిక హక్కులకే భంగం కలుగుతుందని ప్రతిపక్షాలు చెబుతున్నాయి.ప్రస్తుతం ఉన్న వెసులుబాటు.. అనేక సమస్యలకు కారణం అవుతోందని కేంద్రం చెబుతోంది.ఓ ముఖ్యమంత్రి జైలుకు వెళితే.. పరిపాలన అంతా కుంటుపడుతుంది. సీఎం జైలులో ఉంటే కేబినెట్ సమావేశాలు జరగవు. ఫైళ్లు ముందుకెళ్లవు. శాసన వ్యవహారాల్లో పాల్గొనలేరు.ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు మంత్రివర్గం సమిష్టిగా బాధ్యత వహిస్తుందని రాజ్యాంగం చెబుతోంది. కానీ ఇలా నిర్బంధంలో ఉన్న వారు చేసే పనులు రాజ్యాంగ పరంగా నైతికమేనా అన్న ప్రశ్న తలెత్తుతుంది.తీవ్రమైన నేరాలు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొనే వారు అత్యున్నత పదవుల్లో కొనసాగితే.. అవన్నీ సాధారణం అనే భావన పెరిగిపోతుంది. ఇంతటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు వ్యవస్థలను నడిపిస్తుంటే ప్రజల్లో ఆ సంస్థల పట్ల విశ్వాసం దెబ్బతింటుంది.ఇప్పుడు ప్రతిపాదించిన బిల్లు చట్టరూపంలోకి వస్తే..నెలరోజులకు మించి కళంకితులు పదవుల్లో ఉండే అవకాశం లేదు. దీనిని రాష్ట్ర, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులతో పాటు.. ప్రధానిని కూడా దీని పరిధిలోకి తీసుకొచ్చామని కేంద్రం చెబుతోంది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 75 ప్రధాని నియామకం, మంత్రిమండలి గురించి చెబుతుంది. మంత్రిమండలిలో అనర్హతపై చర్చించే ఆర్టికల్ 75, క్లాజ్ 5కు ఇప్పుడు సవరణ ప్రతిపాదించారు. దీని ప్రకారం క్లాజ్ 5ం చేరుస్తారు. ప్రతిపాదిత బిల్లులో కేంద్రమంత్రి వర్గంలోని సభ్యుడు నేరారోపణల కారణంగా ఐదు సంవత్సరాలకు పైబడి శిక్ష పడే నేరంలో నెలరోజుల పాటు కస్టడీలో ఉంటే... ప్రధాని సిఫారసుతో అతన్ని 31 వరోజు రాష్ట్రపతి తొలగించాలి.ఇదే పరిణామాలతో ప్రధానమంత్రి ఐదేళ్ల పైబడి శిక్ష పడే నేరారోణపణలు ఎదుర్కొంటూ.. 30 రోజులకు పైబడి కస్టడీలో ఉన్నట్లైతే.. ఆయన స్వయంగా రాజీనామా చేయాలి. లేనిపక్షంలో 31వరోజు నుంచే ప్రధాని పదవి ఉండదు.ఆర్టికల్ 164 లోని ముఖ్యమంత్రి నియామకానికి సంబంధించి 4వ క్లాజ్‌కు అదనంగా 4ం జతపరుస్తారు. దీని ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర మంత్రులను ముఖ్యమంత్రి సిఫారసుతో గవర్నర్ 31వ రోజు తొలగిస్తారు. అలాగే ఈ విధమైన ఆరోపణలు ఎదుర్కొనే ముఖ్యమంత్రి నెలరోజులలోపు రాజీనామా చేయకపోతే.. 31వ రోజు నుంచి సీఎంగా పరిగణించరు.ఇదే పద్ధతిలో ఆర్టికల్ 239ంంలో 5వ క్లాజ్ ను సవరించి ఢిల్లీ ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులకు ఇదే వర్తింపచేస్తారుచూడటానికి నైతిక స్ఫూర్తితో .. పాలనా వ్యవస్థలను సంస్కరించేందుకు తెచ్చిన గొప్ప సంస్కరణగా ఇది కనబడుతున్నా.. దీనిపై పెద్ద రాజకీయం ఉందని ప్రతిపక్షాలు అంటున్నాయి. అందుకే వాళ్లు ఆ స్థాయిలో దీనిని వ్యతిరేకించారు. ప్రతిపక్షాల గొడవకు పార్లమెంట్‌లోకి మార్షల్స్ రావలసి వచ్చింది. బిల్లును చించి... హోంమంత్రిపైకి కూడా విసిరారు. ఇంత తీవ్రంగా వాళ్లు వ్యతిరేకించడానికి కారణం కూడా ఉంది.ఇది ప్రతిపక్షాలను అణగదొక్కే ఉద్దేశ్యంతో తెచ్చిన బిల్లు అని ఆ పార్టీలు అంటున్నాయి. అధికార పక్షం ఏదైనా రాష్ట్రంలో అధికారంలోకి రావడం సాధ్యం కాకపోతే.. ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకుని సీఎంలను మార్చేస్తారు.అరెస్టు అయిన వారు నేరస్తులు కాదు. నేరం నిరూపితం అయ్యే వరకూ నిందితులు అంతా నిర్దోషులే. 30రోజుల్లో ఆటోమేటిక్‌గా పదవి నుంచి తొలగించడం అంటే నేరం చేయకుండానే శిక్ష విధించడంకేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ పేట్రేగిపోతాయి. ఇప్పటికే.. వాటిని రాజకీయాల కోసం వాడుతున్నారన్న విమర్శలున్నాయి. ఈ చట్టం వస్తే.. అది మరో రాజకీయ అస్త్రం అవుతుంది.ప్రభుత్వాలను అస్థిర పరచడం కోసం.. ఈ ఏజన్సీల ద్వారా అరెస్టులు చేసి రిమాండ్‌కు పంపుతారు. ఈలోగా ప్రభుత్వాలను మార్చేస్తారు.

# కొత్త పొద్దులో తపాలాభారతి




ఘన చరిత్ర కలిగిన తపాలా శాఖ ఎట్టకేలకు నిద్రావస్థను వీడి ప్రైవేట్ కొరియర్ సంస్థలతో పోటీకి దీటుగా డిజిటలైజేషన్ వైపు అడుగులు వేస్తోంది. దశలవారీగా దేశమంతటా పోస్టాఫీసుల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ ప్రక్రియ చేపట్టారు. నగదు రహిత ఆన్‌లైన్ చెల్లింపులకు మార్గం సుగమమైంది. మరోపక్క లాభసాటి కాదనుకుంటున్న రిజిస్టర్డ్ పోస్టు విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ సర్వీసు ఈ నెలాఖరు నుంచి రద్దు చేస్తున్నారు. గతంలో రద్దు చేసిన రిజిస్టర్డ్ బుక్‌పోస్ట్ స్థానంలో ఈ ఏడాది మే 1 నుంచి జ్ఞాన్ పోస్ట్ సర్వీసును ప్రవేశపెట్టారు. వ్యాపార విస్తరణలో భాగంగా ఇ%-%కామర్స్ తరహాలో ఆదివారాలు, సెలవు రోజుల్లోనూ బట్వాడాకు పథకాలు రచిస్తున్నారు. లాభాలే లక్ష్యం చేసుకోకుండా, సామాన్యుడిపై భారం మోపకుండా సేవల నాణ్యతను పెంచడం ఇప్పుడు తపాలాశాఖ ముందున్న సవాలు. భారతదేశ తపాలా శాఖకు సుదీర్ఘ చరిత్ర ఉంది. బ్రిటిష్ ఇండియా గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ 1774 మార్చిలో, ఈస్టిండియా కంపెనీ వాణిజ్య ప్రయోజనాల పరిరక్షణ కోసం మొదటిసారి తపాలా సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. లార్డ్ డల్‌హౌసి 1850లో ఏర్పాటు చేసిన పోస్టాఫీస్ కమిషన్ సిఫారసుల మేరకు 1854లో పోస్టాఫీస్ చట్టాన్ని తెచ్చారు. బెంగాల్ ప్రధాన కేంద్రంగా 700 పోస్టాఫీసులు హోంమంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో పనిచేసేవి. సంస్థాన ప్రాంతాలు సహా దేశమంతటా ఒకే టారిఫ్, పోస్టల్ స్టాంపులతో ఏకీకృత సేవలకు ఈ చట్టం వీలు కల్పించి ఆధునిక తపాలా వ్యవస్థకు పునాది వేసింది. నాటి నుంచి అంచెలంచెలుగా విస్తరిస్తూ దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోంది. తపాల సేవలకే పరిమితం కాకుండా, స్మాల్ సేవింగ్స్ డిపాజిట్లు, లైఫ్ ఇన్సూరెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకూ తపాలా శాఖ ద్వారా సేవలు అందుతున్నాయి. మారిన అవసరాలు, టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని 2023లో ఇండియన్ పోస్టాఫీస్ చట్టాన్ని కొత్తగా తెచ్చారు. 2024 జూన్ 18 నుంచి అమలులోకి వచ్చిన ఈ చట్టం ద్వారా డిజిటల్ ఎలక్ట్రానిక్ సాంకేతికతకు అనుగుణంగా ప్రభుత్వ ఆమోదంతో తగిన నిర్ణయాలు తీసుకోవడానికి పోస్టల్ డైరెక్టర్ జనరల్‌కు అధికారాలు కట్టబెట్టింది. పాత చట్టంలో ప్రతి నిర్ణయానికీ పార్లమెంటరీ ఆమోదం పొందాల్సి వచ్చేది. సిబ్బంది జవాబుదారీకి సంబంధించి కొత్త చట్టంలో వెసులుబాటు కల్పించడంపై ఆక్షేపణలు వచ్చాయి. తపాలా ద్వారా పంపే వస్తువుల నష్టం, ఆలస్యం, సరైన చిరునామాదారుకు చేర్చకపోవడం వంటి పొరపాట్లకు సిబ్బందిని జవాబుదారీతనం నుంచి తప్పించారు. దురుద్దేశపూర్వకంగా తప్పు చేసే వారికి మాత్రం ఇది వర్తించదు. లయబిలిటీ క్లాజును తొలగించడం సిబ్బందిలో ఉపేక్షకు, నిర్లక్ష్యానికీ దారితీయవచ్చనే విమర్శలు వచ్చాయి. సర్వీసుల నాణ్యతపై కూడా ప్రతికూల ప్రభావం పడవచ్చు. డిజిటల్ చెల్లింపులకు ఇంతకాలానికి పోస్టాఫీసుల్లో వెసులుబాటు కలిగింది. అయితే కొత్త టెక్నాలజీకి పూర్తిగా సిబ్బంది సన్నద్ధం కాకపోవడం, అన్ని పోస్టాఫీసుల్లో అప్‌డేషన్ పూర్తికాకపోవడంతో సర్వీసులు నత్తనడకన సాగుతున్నాయి. మరో పక్క యాభై ఏళ్లుగా అందుబాటులో ఉన్న రిజిస్టర్డ్ పోస్ట్ విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ సర్వీసును 2025 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఉపసంహరించుకుంటున్నారు. ఈ సర్వీసును స్పీడ్ పోస్ట్‌లో విలీనం చేస్తున్నట్లు తపాలాశాఖ ప్రకటించింది. ప్రైవేట్ కొరియర్ సంస్థ పోటీ కారణంగా రిజిస్టర్డ్ పోస్టుల సంఖ్య 25 శాతం తగ్గింది. దీనికి తోడు డిజిటల్ ఎడాప్షన్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారట. ఇప్పటివరకూ లీగల్ నోటీసులను, ఉద్యోగ నియామక పత్రాల వంటి డాక్యుమెంట్లను రిజిస్టర్డ్ పోస్టు ద్వారానే పంపేవారు. ఈ సర్వీసు ద్వారా పొందే ఎక్‌నాలెడ్జిమెంట్‌కు చట్టబద్ధత ఉంది. కోర్టులు కూడా నోటీసు అందినదనడానికి దీన్ని రుజువుగా పరిగణించేవి. స్పీడ్ పోస్ట్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్‌కు ఈ విధమైన చట్టబద్ధత ఉంటుందా అనేది తేలాల్సి ఉంది. స్పీడ్ పోస్ట్ టారిఫ్, దూరాన్ని బట్టి మారుతుంది. కనుక కస్టమర్లపై అదనపు భారం పడుతుంది. గతంలో రద్దు చేసిన రిజిస్టర్డ్ ప్రింటెడ్ బుక్ పోస్ట్ స్థానే 2025 మే 1వ తేదీ నుంచి జ్ఞాన్ పోస్ట్ పేరుతో కొత్త పోస్టల్ సర్వీసును అందుబాటులోకి తెచ్చారు. అయితే జ్ఞాన్ పోస్ట్‌కు తగినంత ప్రచారం కల్పిం చకుండా గుట్టుగా ఉంచడంతో రచయితలు, పబ్లిషర్ల వినియో గానికి పూర్తిగా రాలేదు. యూనివర్శిటీలు, గుర్తింపు పొందిన బోర్డుల స్టడీ మెటీరియల్‌ను పోటీ పరీక్షలు రాసేవారు చదివే పాఠ్యపుస్తకాలను జ్ఞాన్ పోస్ట్ ద్వారా పంపవచ్చు. సామాజిక, సాంస్కృతిక, మత అంశాలతో ప్రచురించిన పుస్తకాలను ఈ జ్ఞాన్ పోస్ట్ ద్వారా చేరవేయవచ్చు. 300 గ్రాముల వరకు రూ.20తో మొదలయ్యే టారిఫ్ 5 కిలోలకు గరిష్ఠంగా రూ.100 వసూలు చేస్తారు. జీఎస్టీ అదనం. పీరియాడికల్స్‌ను మాత్రం అనుమతించరు. రచయితలు, ప్రచురణకర్తలకు కాస్తంత ఊరట కలిగించే జ్ఞాన్ పోస్ట్ సర్వీసులకు పలుచోట్ల తపాలా సిబ్బంది మోకాలడ్డుతున్నారు. ఒక పుస్తకం మాత్రమే పంపాలనీ, నాలుగువైపులా బుక్ పాకెట్ తెరచి ఉంచాలనీ, ఇలా ఎవరికి తోచిన రూల్స్ వారు చెప్తూ వేధిస్తున్నారు. ఐదు కిలోల వరకు పంపే వెసులుబాటును నీరుగారుస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఇ%-%కామర్స్ సంస్థలతో పోటీపడేందుకు తపాలాశాఖ సన్నద్ధమవుతోంది. ఇప్పుడు ఒక షిఫ్ట్‌లోనే పోస్ట్‌మెన్ బట్వాడా విధులు నిర్వరిస్తున్నారు. దీన్ని మూడు షిఫ్ట్‌లకు పెంచి, ఆదివారాలు, సెలవు రోజుల్లో కూడా బట్వాడా చేసి ఆదాయం పెంచుకోవాలని తపాలాశాఖ యోచిస్తోంది. దీంతో పాటు ఇతర ఆదాయం పెంపు మార్గాలపైనా తపాలా శాఖ దృష్టి పెట్టనుంది. లాభసాటిగా లేని గ్రామీణ పోస్టాఫీసులను మూసివేయడమో, సమీప పోస్టాఫీసుల్లో విలీనం చేయడమో జరగవచ్చు. అంతగా వినియోగంలో లేని మనియార్డర్, పోస్ట్‌కార్డ్, ఇన్‌ల్యాండ్ లెటర్ మునుముందు రోజుల్లో కనుమరుగు కావచ్చు. శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది నియామకాలను చేపట్టి, భవనాల వంటి మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినప్పుడే తపాలా శాఖ ఆశించిన లక్ష్యాలు సాధించగలదు.

# ముంబై చేస్తున్న హెచ్చరిక!



ప్రణాళికాబద్ధంగా లేని పట్టణీకరణను పరిహసిస్తూ తరచు ప్రకృతి వైపరీత్యాలు విరుచుకు పడుతున్నా పాలకులు మేల్కొనటం లేదనటానికి మళ్లీ నీట మునిగిన ముంబై మహానగరమే సాక్ష్యం. ముంబై దక్షిణ ప్రాంతంలో గురువారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో ఏకధాటిగా 300 మి.మీ., పశ్చిమ శివారు ప్రాంతంలో 200 మి.మీ. వర్షం కురిసిందంటే కుంభవృష్టి ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. నిన్నంతా దాదాపు ప్రశాంతంగానే ఉన్నట్టు కనబడిన ఆ మహానగరం, మళ్లీ భారీ వర్షాలుంటాయన్న హెచ్చ రికలతో బెంబేలెత్తుతోంది. ఏటా వర్షాకాలంలో కనీసం ఒక్కసారైనా వరదలు ముంబైని పలకరించటం ఆనవాయితీ. ఈసారి మే నెలలోనే ఒక రోజు నడుంలోతు వరదల్లో నగరం నానా యాతనలూ పడింది. ఆ నెలలో కొత్తగా ప్రారంభమైన వొర్లి మెట్రో స్టేషన్ భారీ వరదతో వణికిపోయింది. రెండు నెలలు గడిచాయో లేదో మళ్లీ నగరానికి కుంభవృష్టి తప్పలేదు. నిరుడు 21 దఫాలు 100 మి.మీ. వర్షం పడిందని గణాంకాలు చెబుతు న్నాయి. వాతావరణంలో పెనుమార్పులు విపత్తుల తీవ్రతను పెం చాయి. అస్తవ్యస్థ పట్టణీకరణ ఈ సమస్యను వందల రెట్లు పెంచింది. ఈసారి వర్షాలవల్ల సంపన్నులు, సినీతారలు నివ సించే ప్రాంతాలు సైతం వరద నీటన మునిగాయి. ఇటీవలే ఆర్భాటంగా ప్రారంభించిన మోనోరైల్ సైతం భారీ వర్షాలతో విద్యుత్ సరఫరా అందక గంటసేపు నిలిచిపోయింది. చివరకు అద్దాలు బద్దలుకొట్టి వందమంది ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురావాల్సి వచ్చింది. ముంబై తూర్పు శివారులోని మీథి నది ఆ మహానగరంపై విరుచుకుపడింది. అయిదు రోజులపాటు వరసగా కురిసిన వర్షాలతో ఆ నది కట్టు తెంచుకుని అటువైపుగల రైల్వే ట్రాక్‌లన్నిటినీ ముంచెత్తింది. అరేబియా సముద్రం భారీ కెరటాలతో అల్లకల్లోలంగా ఉండటంతో దానిలో కలవాల్సిన మీథి వరద నీరు కాస్తా వెనక్కొచ్చి నగరంలోని అనేక ప్రాంతాలను జలమయం చేసింది. హైదరాబాద్ నగరంలో మూసీ మాదిరిగా ముంబైలో మీథి నదిని కూడా మురికిమయం చేశారు. అందులో 70 శాతం మురికినీరు కాగా, 30 శాతం చెత్తాచెదారం, 10 శాతం పారిశ్రామిక వ్యర్థాలు కలుస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యా లుగా కనబడు తున్నవన్నీ సారాంశంలో మానవ తప్పిదాల పర్యవసానం. గత యేభైయ్యే ళ్లుగా నగరాన్ని విస్తరించుకుంటూ పోవటమే తప్ప అందుకు తగిన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టినవారు లేరు. అలాగని మీథి నది ప్రక్షాళనకు ప్రయత్నాలు జరగ లేదని కాదు. 2013%-%23 మధ్య బృహన్ ముంబై కార్పొరేషన్ (బీఎంసీ) రూ. 2,000 కోట్లు వ్యయం చేసింది. కానీ చివరకు తాజా వర్షాల ధాటికి మురికి నీటితో, ప్లాస్టిక్ వ్యర్థాలతో నివాస ప్రాంతాలన్నీ నిండిపోయాయి. 70వ దశకం వరకూ పరిశుభ్రంగా ఉండే ఆ నది మురికి కూపంగా మారిందంటే పాలకులు, అధికార యంత్రాంగం నిర్లక్ష్యమే కారణం. భౌగోళికంగా ముంబై తీరం పశ్చిమ కనుమలకు దగ్గరలో ఉంది. వాటివల్ల నైరుతి రుతుపవనాల్లో గాలుల తీవ్రత హెచ్చుగా ఉంటుంది. అందుకే ఏటా భారీవర్షాలు, వరదలు తప్పవు. దేశ ఆర్థిక రాజధానిగా, ఢిల్లీ తర్వాత అత్యధిక జనసాంద్రత గల నగరంగా ముంబై మన దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రాణప్రదమైనది. దేశ జీడీపీలో ఆ నగరం వాటా దాదాపు 7 శాతం. కానీ వరదలు ముంచుకొచ్చిన ప్రతిసారీ మౌలిక సదుపాయాలు దెబ్బతినటం, ఉత్పాదకత పడకేయటం రివాజైంది. పునర్నిర్మాణానికి ఏటా రూ. 550 కోట్ల వ్యయమవుతోంది. నిజానికి ఈ సంక్షోభం అక్కడే కాదు... దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పాలకులనూ పునరాలోచనకు పురిగొల్పాలి. నగర నిర్మాణాల్లో ఎలాంటి మెలకువలు తీసుకోవాలో, పెద్ద నగరాల నిర్మాణంపై మోజువల్ల చివరకు జరిగేదేమిటో గ్రహించేలా చేయాలి. కానీ అదెక్కడా కనబడదు. ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని అమరావతి తాజా వర్షాలకు ఎంత దయనీయ స్థితిలో పడిందో కనబడుతూనే ఉంది. పెద్ద నగరాల నిర్మాణంవల్ల జనసాంద్రత పెరిగి మౌలిక సదుపాయాల కల్పన అసాధ్యమవుతుందనీ, పైగా అభివృద్ధి మొత్తం ఒకే చోట కేంద్రీకరించటం వల్ల ఇతర ప్రాంతాలు ఎప్పటికీ ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోతాయనీ నిపుణులు హెచ్చరిస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు తలకెక్కటం లేదు. మన కోసం ప్రకృతి మారదు. మనమే దానికి అనుగుణంగా మారాలన్న స్పృహ పాలకులకు కలగాలి. మళ్లీ మళ్లీ మునుగుతున్న ముంబై మహానగరాన్ని చూసైనా గుణపాఠం నేర్వకపోతే భవిష్యత్తు క్షమించదు.

# జిన్నూరు శివాలయం పాలకవర్గం ప్రమాణస్వీకారం.


చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన ఆచంట సత్యనారాయణమూర్తి.



**పాలకొల్లు ప్రజా జ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. ఆగస్టు 24** జిన్నూరులో వేంచేసియున్న శ్రీ చెన్నమల్లేశ్వర స్వామి ఆలయమునకు నియమితులైన నూతన పాలకవర్గం ఆదివారం ఆలయం ఆవరణలో ప్రమాణ స్వీకారం చేశారు. పాలకవర్గం చైర్మన్ గా ఆచంట సత్యనారాయణమూర్తి ప్రమాణస్వీకారం చెయ్యగా ట్రస్టీలుగా దొమ్మేటి శ్రీదేవి బూర్ల శ్రీ పద్మ చెల్లబోయిన సత్యవతి చొప్పల రాజమణి చీపురుపల్లి లలిత నడివింటి రమాదేవి కుక్కల వరహా లక్ష్మీ నరసింహారావు ఇంటి శరన్ బాబు ప్రమాణస్వీకారం చేయగా అర్చకులు యోగానందం సాయి శివ సుబ్రహ్మణ్యం కో ఆప్షన్ గా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యనిర్వాహణాధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ సత్యనారాయణ మూర్తిని ట్రస్టీలను జిన్నూరు సొసైటీ చైర్మన్ దేవళ్ల ప్రసాద్, మట్టపర్రు నీటి సంఘం అధ్యక్షులు దేవళ్ల రామకోటి ఏఎంసి వైస్ చైర్మన్ దాసరి రత్నరాజు జిన్నూరు నీటి సంఘం అధ్యక్షులు కుక్కల సత్యనారాయణ తదితరులు పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులుదేవళ్ళ ప్రసాద్ మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి నూతనంగా నియమితులైన పాలకవర్గం కృషి చేయాలన్నారు. ఆలయంలో పండుగలు, ఉత్సవాల సమయాలలో లలో ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఆచంట సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గా తనను నియమించినందుకు మంత్రివర్యులు నిమ్మల రామానాయుడు కు కూటమి నాయకులకు స్థానిక పెద్దలకు తమ కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి నాయకులు పెన్మత్స కాశీ విశ్వనాథరాజు గిరిగి గోపాలకృష్ణ గుబ్బల శ్రీరామ్ యలకల శ్రీనివాస్ చింతపల్లి శ్రీను ఆచంట సాయిరాం జనసేన నాయకులు మానేపల్లి శ్రీధర్ పీతాని వెంకట్ రియా మైగాపుల పద్మజ దాసరి సూర్యనారాయణ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే కొట్రే.మధుసూదన్. చేతుల మీదుగా లెనిన్ హౌస్ ప్రారంభం





**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** పామిడి పట్టణంలో చైతన్య స్కూల్ దగ్గర నూతనంగా అల్లేని హౌస్ ప్రారంభించడానికి రావాలని జమీర్ మాజీ ఎమ్మెల్యే కోట్లకే బాలసుందర్ గుప్తా తెలుగుదేశం పార్టీ నాయకులను ఆహ్వానించారు అందులో భాగంగానే ఆదివారం మాజీ ఎమ్మెల్యే కోట్లకే మధుసూదన్ గుప్తా తెలుగుదేశం పార్టీ నాయకులు సొసైటీ చైర్మన్ బి శ్రీనివాస్ రెడ్డి జింకల సంజీవ చేతుల మీదుగా ప్రారంభించారు అనంతరం మాజీ ఎమ్మెల్యే కోట్లకే మనుషులతో ముందుగా బట్టలు కొనుక్కున్న తర్వాత తెలుగుదేశం పార్టీ నాయకులతో కూడా తన షాపు వచ్చినందుకు మనమందరం వ్యాపారం చేస్తే ఇలాంటి షాపులు జమీర్ జిల్లాలో ప్రతికూ మండలంలో పంపించాలన్నారు ఉన్నటువంటి తెలుగుదేశం పార్టీ నాయకులతో గుంతకల్ నియోజకవర్గ పరిస్థితులు చాలా బాగున్నాయి ఈ మధ్యకాలంలో అందరూ కలిసికట్టుగా పనిచేస్తున్నారని తెలిసినది అందరూ సంతోషంగా ఉంటే గుంతకల్ నియోజకవర్గంలో కూడా అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు లెనిన్ హౌస్ యజమాని జమీర్ మాట్లాడుతూ పిలిచిన వెంటనే వచ్చినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గుత్తి వైట్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొట్టం మాలిక్ కలందర్ కొండాపురం రఫీ జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు షేక్షా, కరూర్ జగదీష్ వడ్డే రాము, పాల్యం శర్మష్, కత్రిమల సుబ్బు లాయర్ సతీష్,మన్సూర్, కాజా, అబ్దుల్, సుబ్బ రాయుడు జుబేర్, అంజి, వేణు,బిజెపి నాయకులు అంజి నాయక్, కుమార్, ఆచారి,డాక్టర్ నాగమల్లారెడ్డి, విష్ణు, పంచాయతీ సిబ్బంది కాజా, బిల్ కలెక్టర్ శీనా, రమణ, బాబు, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా గిరిజన సలహా మండలి సభ్యుడు వెంకటపతి సన్మాన సభ



**(ప్రజా జ్యోతి న్యూస్) కర్నూలు ఆగస్టు 24** ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ టి. ఎస్. ఎఫ్, రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప అధ్యక్షతన జరిగిన గిరిజన సలహా మండలి సభ్యుడి సన్మాన సభ విజయవంతం. ఈ సందర్భంగా ముఖ్య అతిథి గా విచ్చేసిన పత్తికొండ ఎమ్మెల్యే కె ఇ శ్యాం బాబు, మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు గిరిజనుల అభివృద్ధికి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం దళిత గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేయడం జరుగుతుంది అని అన్నారు. గిరిజన సలహా మండలి సభ్యుడు వెంకటపతి మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్యాం బాబు ఆశీస్సులతో నాకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాపై నమ్మకం ఉంచి నాకు పదవి ఇచ్చినందుకు తెలుగు దేశం ప్రభుత్వంనకు గిరిజనులు అండగా ఉంటారని అన్నారు.ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు అక్కులప్ప నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో గిరిజనులకు తగిన ప్రాధాన్యత కల్పించి సామాజిక న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సంబశివరెడ్డి, రామానాయుడు,బి జె వై ఎం రాష్ట్ర అధ్యక్షులు సునిల్ రెడ్డి,తెలుగు యువత రాష్ట్ర నాయకుడు బత్తిని లోకునాథ్,టి ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామరాజు, జిల్లా కార్యదర్శి వెంకటేష్, గిరిజన ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు రవీంద్రనాయక్ బద్దునాయక్, మద్దిలేటి, రాము నాయక్, శీను నాయక్, శివయ్య,కరివేపాకు రామకృష్ణ, యోగేష్ నాయక్, కుశ లన్న, నాగరాజు నాయక్,తదితరులు పాల్గొన్నారు

# బాపట్ల జిల్లా ప్రజల ఆందోళనలను పరిష్కరించాలన్న కోన రఘుపతి

**బాపట్ల ఆగస్టు 24 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల పట్టణం రథం బజార్లో ఉన్న వైసిపి కార్యాలయంలో,మాజీ శాసనసభ్యుడు, రాష్ట్ర శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆదివారం విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ,బాపట్ల జిల్లా స్థానం, మెడికల్ కాలేజీ వంటి అంశాలపై ప్రజల్లో ఉన్న ఆందోళనలకు సమాధానం ఇవ్వడం అధికార పక్షం మరియు స్థానిక ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు.జిల్లా కేంద్రం తరలింపు గురించి రకరకాల వదంతులు వస్తుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని ఆయన తెలిపారు. చీరాలబాపట్ల మధ్య ఏర్పడిన చర్చలపై రాజకీయ పక్షాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం కంటే ప్రజలకు స్పష్టత ఇవ్వడం అవసరమని అభిప్రాయపడ్డారు .బాపట్ల ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా అధికార పార్టీ నేతలు ముందుకు రావాలని కోరుతూ, ప్రతిపక్షం కూడా బాధ్యతాయుతంగా నిలబడి ప్రజల సమస్యలను ప్రస్తావిస్తోందని స్పష్టం చేశారు.అదే విధంగా, వికలాంగుల సమస్యల పరిష్కారానికి శ్రద్ధ చూపకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఇటువంటి సున్నితమైన అంశాలను రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో చూడాలని కోన రఘుపతి సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పార్టీ స్టేట్ కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, జిల్లా వైసిపి వైస్ ప్రెసిడెంట్ కోకి రాఘవరెడ్డి, వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, మండలాధ్యక్షుడు మరుప్రోలు ఏడు కొండల్ రెడ్డి, వైసిపి సోషల్ మీడియా విభాగం జోగి రాజా, మార్పు బెనర్జీ వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు




## లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

దాతల సహకారంతో లయన్స్ సేవలు విస్తృతం చేస్తాంఅధ్యక్షుడు లయన్ పసుపులేటి శ్యామ్

లయన్స్ సేవలు ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి రీజనల్ చైర్మన్ లయన్ షేక్.మహమ్మద్



**రాయచోటి ఆగస్టు 24 ప్రజా జ్యోతి** లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా,యువజన క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి,మండిపల్లి హరితమ్మ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా షేక్.శేషి జాబీర్ ఆర్థిక సహాయంతొ పట్టణంలోని గుడిసెలలో నివసించే పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అధ్యక్షులు పసుపులేటి శ్యామ్ తెలిపారు.అనంతరం దాత షేక్.శేషి జాబీర్ మాట్లాడుతు ఈరోజు రాష్ట్ర మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి,మండిపల్లి హరితమ్మ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా ప్రజలకు నా వంతు సేవ చేయాలనె ఉద్దేశంతోనే ఈరోజు రాయచోటి పట్టణంలో గుడిసెలలో నివసించే పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ లయన్ షేక్.మహమ్మద్,మాజీ అధ్యక్షులు లయన్ పి.శివారెడ్డి, లయన్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

## ఫిట్ ఇండియా 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం ప్రారంభం:

ప్రజలు, పోలీసులు కలిసికట్టుగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి – రాయచోటి డీఎస్పీ యం.ఆర్. కృష్ణమోహన్




**రాయచోటి, ఆగస్టు 24 ప్రజా జ్యోతి** జిల్లా ఎస్పీ శ్రీ వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్,. గారి ఆదేశాల మేరకు, ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలతో ఈరోజు రాయచోటిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని రాయచోటి డీఎస్పీ. శ్రీ యం.ఆర్. కృష్ణమోహన్ గారు జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ. కృష్ణమోహన్ మాట్లాడుతూ, "ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రజలు, పోలీసులు కలిసి ప్రతి ఆదివారం సైక్లింగ్ అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం.సైక్లింగ్ కేవలం ఒక వ్యాయామం మాత్రమే కాదు, అది మన మనసుకు ఉత్సాహాన్ని, తాజాదనాన్ని ఇస్తుంది. అలాగే, యోగా సాధన మనలోని ఏకాగ్రతను పెంచి, మానసిక ప్రశాంతతకు తోడ్పడుతుంది."""ఆరోగ్యమే మహాభాగ్యం. మన ఆరోగ్యం బాగుంటేనే మనం ఏ పనైనా సమర్థవంతంగా చేయగలం.

## అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభించిన...

క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి,శాప్ చైర్మన్ రవి నాయుడు




**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ ఆగస్టు 24** శాప్ ఆధ్వర్యంలో తిరుపతిలో అమరావతి ఛాంపియన్ షిప్ రాష్ట్రస్థాయి పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 3 రోజుల పాటు జరగనున్న పోటీలను క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి , శాప్ చైర్మన్ రవి నాయుడు ప్రారంభించారు. తారకరామ, ఎస్వీ స్పోర్ట్స్ కాంపెక్స్, ఎస్వీ స్కూల్ మైదానంలో పోటీలు నిర్వహించనున్నారు. క్రీడల్లో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి 1700 మందికిపైగా క్రీడాకారులు తిరుపతి చేరుకున్నారని ఆయన అన్నారు. రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు ఈనెల 29వ తేదీన విశాఖపట్నంలో జరిగే జాతీయ క్రీడా దినోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలు, పథకాలు అందజేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి, డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## అమెరికాలో తానా మహాసభలలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన... గుత్తా వెల్లి లిఖిత




**బూర్జ: ఆగస్టు 24,( ప్రజా జ్యోతి)** బూర్జమండలంలో డొంకలపర్త గ్రామానికి చెంది గుత్తావెల్లి లిఖిత అమెరికాలో తానా మహాసభలకు కూచిపూడిలో నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచింది. ఆమెకు కూచిపూడి లో అనేక అవార్డు రావడం కూడా జరిగిందని తండ్రి వెంకటరమణ తెలిపారు. అతను మాట్లాడుతూ.."నా కూతురు శాస్త్రీయ నృత్యం నేర్చుకోవాలని ప్రేరేపించిన క్షణాన్ని ఈ ఫోటో నాకు గుర్తు చేస్తుంది అన్నారు.ఒకవైపు చదువు వృత్తిని అభ్యసిస్తూ, నాట్యంపై అభిలాష పెంపొందించుకోవడం అభినంద నీయమని తెలిపారు. విద్యలో రాణిస్తూ, కూచిపూడిలో ప్రతిభ చూపడం గొప్ప విషయమని కొనియాడారు.శ్రీకాకుళం జిల్లాలో నెలకొనిఉన్న 'సంప్రదాయం కూచిపూడి గురుకులం' డైరెక్టర్ స్వాతి సోమనాథ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆలోచనలమేరకు శ్రీకాకుళం జిల్లాలో 11 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నెలకొల్పబడిన 'సంప్రదాయం కూచిపూడి గురుకులం' ప్రపంచంలోనే తొలి కూచిపూడి గురుకులం అని, వివిధ ప్రాంతాల నుంచి అనేకమంది విద్యార్థినీ, విద్యార్థులు శ్రద్ధాసక్తులతో నాట్యం నేర్చుకుంటూ కూచిపూడి నాట్యంలో డిగ్రీలు సంపాదించుకుని, దేశ విదేశాలలో తమ ప్రతిభా పాటవాలను చూపుతున్నారని, ఇటీవల డిట్రాయిట్ లో జరిగిన తానా మహా సభలకు ఆహ్వానం అందుకుని తొలిసారి అమెరికాలో అడుగుపెట్టిన పిల్లలకు డాలస్ నగరంలో డా. ప్రసాద్ తోటకూర, వారి బృందం చూపిన ఆదరణ ఎన్నటికీ మరువలేనిది అంటూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# స్మశాన వాటికలో ఇక్కట్లు





- దహన కార్యక్రమ సమయంలో కరువైన వసతులు
- స్మశాన వాటిక వద్ద నీళ్ల కోసం ఎరుకల కాలనీ వాసుల ఆరాటం
- ప్రజాప్రతినిధులకు ఎరుకుల కాలనీ వాసులకు గోడు పట్టడం లేదా అంటూ ఆవేదన

**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్:** జనులు జన్మించే జన్మభూమిపై కర్మ గాలక పరలోక ప్రాప్తి అయిన మృతులను స్వర్గ ధామంలో దహనం చేసే సమయంలో పొందూరు మేజర్ పంచాయతీ పరిధిలో గల ఎరుకల కాలనీ వాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. దహన సంస్కారాలు చేసే సమయంలో సరైన మౌలిక వసతులు లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండాకాలంలో నీటి కొరత తో తలకొరివి పెట్టేందుకు కూడా నీటి కొరకు వెతకవల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆదివారం నాడు ఓ గిరిజన వృద్ధుడు కాలం చెల్లించిన కారణంబున స్మదానం లో చితికి అగ్గి పెట్టే ముందు తలకొరివి పెట్టడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎస్టీ వారికి ఈ సమాజంలో అందరికీ ఉన్న హక్కులు లేవా అని అవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి నిండు 78 వసంతాలు పూర్తి అయిన అగ్ర వర్ణాలకున్న లేదా రాజకీయ బ్యాక్ గ్రౌండ్ ఉన్న లేదా కుల వర్గం బలంగా ఉంటే వారికే అన్ని సంక్షేమాలు ఉండటం అమానుషం అన్నారు. మా మీద ఎందుకీ చిన్న చూపి ఆవేదన వ్యక్తం లేదు. ప్రజాస్వామ్యంలో మా ఓటు కి విలువ లేదా కార్యాలయాల్లో ఎన్నో దరఖాస్తులు పెట్టిన కనీసం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నేడు దహన సంస్కారాలకు కూడా నీళ్లు లేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. వర్షాకాలం వస్తే చాలు దహన సంస్కారాలకు చేయడం ఇబ్బందిగా ఉండేదన్నారు. ప్రభుత్వాలు మా ఆవేదనను గుర్తించి స్మశాన వాటికలో ఒక బోర్వెల్ గ్రాంట్ చేయించడానికి సహకరించి ఎరుకల ప్రజలకు సహకరించాలని కోరారు.

# ఫర్టిలైజర్స్ డీలర్లు అక్రమాలు పాల్పడితే లైసెన్స్ రద్దు







వ్యవసాయ అధికారిని రాజకుమారి

**లక్కిరెడ్డిపల్లి ఆగస్టు 24 ( ప్రజా జ్యోతి)** లక్కిరెడ్డిపల్లి మండల కేంద్రంలో గణేష్ రైతు మిత్ర ఆగ్రోస్ జనతా ఫర్టిలైజర్స్ షాపులను ఆకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించిన వ్యవసాయ అధికారిని రాజకుమారి విజిలెన్స్ సిఐ నారాయణ మండలంలో ఉండే ఫర్టిలైజర్ డీలర్ యొక్క లైసెన్స్ వివరాలు , స్టాక్ ,రిజిస్టర్ నమోదు వివరాలు ఎరువులు సంబంధించిన వివరాలు, రోజు వ్యతిరేకంగా లేక బిల్లులు ఇవ్వకుండా రైతులకు ఎరువులను అమ్మటం గానీ సరైన రికార్డులో నిర్వహించకపోతే ఆ యొక్క డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. యూరియా ఎరువులకు సంబంధించిన ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సిక్స్ ఏ చట్టం ద్వారా వీలైతే లైసెన్స్ కూడా రద్దు అవుతుందని వ్యవసాయ అధికారిని రాజకుమారి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ యుగంధర్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మహాగణపతి వేడుకలు చేసుకోవడంపై యువత శ్రద్ధ చూపాలి

భక్తిశ్రద్ధలతో మహాగణపతి వేడుకలు చేసుకోవడంపై యువత శ్రద్ధ చూపాలి

పాండురంగ స్వామి పరివార్ మరియూ హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో



**(ప్రజా జ్యోతి న్యూస్) వెల్దుర్తి ఆగస్టు 24** పురాణ ఇతిహాసాల ప్రకారం మహాగణపతి అంటేనే ఎంతో క్రమశిక్షణకు నియమనిష్టలకు తల్లిదండ్రుల మీద ప్రేమా ఆప్యాయతలకు మహాగణపతి ప్రతిక అని, మంచి కోసం పోరాడడం, మరియు దైవ గ్రంథాల రచన ఒక మహెూన్నతమైన జ్ఞానానికి ప్రతీక అటువంటి మహాగణపతిని పూజించడం ఆయనకు మండపాలు కట్టి విగ్రహాలు పెట్టి ఆరాధించడం హిందూ సాంప్రదాయం ప్రకారం చాలా గొప్ప విషయం ఆ విధంగా చేసి గణనాథుని ప్రసన్నం చేసుకోనే సదవకాశాన్ని యువతరం అంది పుచ్చుకోవచ్చు అని ఎంతో భక్తిశ్రద్ధలతో మహాగణపతిని ఉపాసిస్తే అనేకమైనటువంటి శుభమైన విషయాలు వారి జీవితాల్లో జరుగుతాయని హెల్పింగ్ అండ్ సేవా సంస్థ అధ్యక్షులు హరి సింహనాయుడు అన్నారు . కానీ నేటి యువతరం మహాగణపతిని పూజించే విషయంలో కొన్ని వింత పోకడలకు పోవడం దురదృష్టకరమని చేసిన కష్టం బూడిద పాలు చేసుకుంటున్నారని పాండురంగ పరివార్ మరియు హెల్పింగ్ హాండ్ సేవా సంస్థ అధ్యక్షులు హరిసింహనాయుడు తెలిపారు. వినాయక మండపాల దగ్గర భక్తిశ్రద్ధలతో చాలామంది పూజలు చేసి గణేషుని ప్రసన్నం చేసుకుంటున్నారని, అదే సమయంలో కొందరు ఆకతాయిలు చేస్తున్న వికృత చేష్టల వలన మొత్తం హిందూ సమాజానికే తలవొంపులుగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వినాయక చవితి పండుగ రోజు ఏ విధంగా అయితే మహాగణపతిని భక్తిశ్రద్ధలతో పూజించి ఆరాధించి శ్రద్ధతో కొలుస్తారో అదేవిధంగా నిమజ్జనం రోజు కూడా భక్తిశ్రద్ధలతో గణేష్ ని పూజించి నిమజ్జనం చేసుకోవాలని, మద్యం మత్తులో వికృత చేష్టలు, వింత నృత్యాలు చేస్తూ పలువురికి అసహ్యం కలిగించే లాగా కోడిగుడ్లతో వింత రంగులతో దాడి చేసుకోవడం భయంకరమైన శబ్దాలతో బాణసంచా పేలుస్తూ అసభ్యకరమైన పాటలకు అసభ్యకరమైన వికృత నృత్యాలు చేయడం సమంజసం కాదని ఎంతోమంది పెద్దలు చెబుతున్న మాటలను యువతరం మనసుల్లోకి తీసుకోవాలని, ఇటువంటి వికృత చేష్టలు మానుకొని భక్తిశ్రద్ధలతో గణనాథుని పూజించి మహాగణపతి ఆశీస్సులు అందుకొని తమకు, తమ కుటుంబాలకు మేలు జరిగే విధంగా యువతరం పాటుపడాలని కోరారు. ఎంతో ఖర్చు చేసి ఎంతో కష్టపడి మహాగణపతిని స్థాపించుకొని ఆయన ఆశీర్వాదం అందుకోకుండానే మద్యం మత్తులో వికృత చేష్టలు చేసి మహా గణనాథుని కోపానికి గురి అవుతున్నారని గణేష్ నిమజ్జనానికి వెళుతున్న యువతరాన్ని తలుచుకొని తల్లిదండ్రులు ప్రమాదకరమైన కార్యక్రమానికి వెళుతున్నట్లు బాధపడుతున్నారని, తల్లిదండ్రుల, మీద గురువు దైవాలు మీద శ్రద్ధ ఉంచి గణపతి వేడుకలను అందరూ మెచ్చుకునేలా యువతరం నడిపించి చూపించాలని స్వామి ఆశీస్సులు అందుకోవాలని ఈ సందర్భంగా పాండురంగ పరివార్ మరియు హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హరిసింహనాయుడు మరియూ వివిధ భక్తి సమాజాలకు చెందిన హిందూ పెద్దలు కోరారు. మహా గణపతిని అత్యంత శ్రద్ధా భక్తులతో పూజించుకొని మహాగణాధిపతి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని శివజీవైక్య మఠాధిపతి ఎల్లప్ప స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ జివైక్య మఠధిపతి ఎల్లప్ప స్వామి, హరి సింహ నాయుడు, వైద్యం రామనాయుడు, బలిజ శ్రీరాములు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో ఆసుపత్రి ప్రాంగణం శుభ్రం



**తాళ్లపూడి,ఆగస్టు24, ప్రజాజ్యోతి న్యూస్** అన్నదేవరపేట గ్రామ ప్రాథమిక ఆసుపత్రి ఆవరణం కలుపు మొక్కలు గడ్డితో నిండ పోవడంతో ఎమ్మెల్యేముప్పిడి.వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి అందరికీ తెలిసిన విష యమే. ఆసుపత్రి ప్రాంగణాన్ని శు భ్రం చేయాల్సిందిగా పంచా యతీ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మె ల్యేఆదేశాలమేరకుపంచాయతీ కార్యదర్శి డిఎస్సి. శ్రీనివాస్ మరియు సొసైటీ అధ్యక్షుడు జీ.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణలో ఉన్న కలుపు మొక్కలను నివారించే భాగంగా ఆదివారం ఆసుపత్రి ఆవరణలో కలుపు మందు పిచికారి చేయించి ట్రాక్టర్ తో శు భ్రపరచడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కి గ్రామ స్తులు ధన్యవాదాలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో జనసేన యువ నాయకుడు చెవ్వూరి.రాము, పీహెచ్సీ డాక్టర్ స్వర్ణలత మరియు సిబ్బంది ఉన్నారు

## మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం

- పర్యావరణాన్ని కాపాడుకుందాం
- మండల కేంద్రంలో 1000 మట్టి విగ్రహాలను పంపిణీ



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** మట్టి వినాయక విగ్రహాలనే పూజిదాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ పొందూరు మండల కేంద్రంలో మార్కెట్ ఆవరణంలో 1000 మట్టి విగ్రహాలను ,వినాయక వ్రతకథా పుస్తకాలను బండార్లమ్మ కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులు ప్రతీ ఇంటా ఆరాధించే దైవం వినాయకుడని, ఆ వినాయక చవితి పండుగ రోజు మట్టి వినాయక విగ్రహాన్ని పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి వాటితో చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై రోగాల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ మట్టి విగ్రహాలను సామాజిక భాధ్యతగా పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంటుకు రాము , గుడ్ల సాయిరాజు , గుడ్ల ప్రభాకరరావు , అనకాపల్లి సూరిబాబు , కింతలి హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సైక్లింగ్‌తో ఆరోగ్యం పర్యావరణ పరిరక్షణ బాపట్ల ఎస్పీ తుషార్ డూడి



**బాపట్ల ఆగస్టు 24 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి ఆదివారం ఉదయం ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారాలు సైకిల్‌పై ర్యాలీ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయం, పాత బస్టాండ్, అంబేద్కర్ విగ్రహం మార్గంలో సాగిన ఈ ర్యాలీలో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.ఎస్పీ మాట్లాడుతూ సైక్లింగ్ వలన శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని తెలిపారు. ప్రజల్లో ఆరోగ్యకర జీవనశైలి అలవర్చేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఆదివారం ఇలాంటి ర్యాలీలు కొనసాగుతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి పి.విజయ సారథి, బాపట్ల డిఎస్పి జి.రామాంజనేయులు, సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నారాయణ, బాపట్ల టౌన్ సిఐ రాంబాబు, రూరల్ సిఐ శ్రీనివాసరావు, రూరల్ సర్కిల్ సిఐ హరికృష్ణ ఆర్ ఐ శ్రీకాంత్,ఏ ఆర్ ఆర్ ఎస్ ఐ సుధాకర్ ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బంగారం మాయలో వ్యాపారి మోసం 4 లక్షల దోపిడీ ముఠా అరెస్ట్



**బాపట్ల ఆగస్టు 24 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల జిల్లా వేటపాలెంలో బంగారం తాకట్టు పేరుతో విజయవాడకు చెందిన వ్యాపారిని మోసపూరితంగా పిలిపించి, కత్తులతో బెదిరించి 4 లక్షల నగదు, మొబైల్ దోచుకున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. చీరాల డీఎస్పీ ఎమ్.డి.మోయిన్ వివరాల ప్రకారం, నిందితులు మల్లి రాజేష్, కావటి నాగరాజు, అన్నారెడ్డి ఇంద్ర, మౌనిక, చిన్నబోతుల చంటి అరెస్టు కాగా, మధు, మహేంద్ర పరారీలో ఉన్నారు. రూ.3 లక్షల నగదు, మొబైల్, ఆటో, కత్తులు స్వాధీనం చేసుకున్నారు.ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు, చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు పర్యవేక్షణలో వేటపాలెం ఎస్సై జనార్ధన్, సిబ్బంది సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకున్నారు. ముద్దాయిల అరెస్టులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారు.

# శిరగారపల్లి సొసైటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా





## చైర్మన్ చిలుకూరి బాలాజీ

### అంగరంగ వైభవంగా శిరగారపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం

### సొసైటీ చైర్మన్ చిలుకూరి బాలాజీ

### ప్రమాణ స్వీకార మహోత్సవానికి ప్రముఖుల రాక.. ఘన సత్కారం

**ప్రజాజ్యోతి (స్టాఫ్ రిపోర్టర్) న్యూస్, యలమంచిలి ఆగస్టు – 24 :** శిరగారపల్లి సొసైటీని జిల్లాలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చిలుకూరి బాలాజీ అన్నారు. యలమంచిలి మండలం శిరగారపల్లిలో ఆదివారం అంగరంగ వైభవంగా త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. పాలకొల్లు నియోజకవర్గం పరిధిలో ప్రజా ప్రతినిధులు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్లు, నీటి సంఘం అధ్యక్షులు, కూటమి నాయకులు కార్యకర్తలు ప్రమాణ స్వీకారం మహోత్సవానికి అధిక సంఖ్యలో విచ్చేసి త్రిసభ్య కమిటీ సభ్యులను పుష్పగుచ్చాలు, పూలమాలలు, సాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ చిలుకూరి బాలాజీ మాట్లాడుతూ శిరగారపల్లి సొసైటీపై ఆధారపడిన రైతులందరికీ సకాలంలో ఎరువులు, రుణాలు మంజూరు చేసి అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. నూతన త్రిసభ్య సభ్యులచే మండల టిడిపి అధ్యక్షులు మామిడిచెట్టి పెద్దిరాజు ప్రమాణ స్వీకారం చేయించారు.టిడిపి, జనసేన, బిజెపి నాయకులు హాజరయ్యారు. ముందుగా త్రిసభ్య కమిటీ అధ్యక్షులు చిలుకూరి బాలాజీ, డైరెక్టర్లు జల్లి వరప్రసాద్, వానపల్లి గణపతిలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం త్రిసభ్యకమిటీ సభ్యులకు కూటమి సభ్యులు అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఉన్నమట్ల కబర్ధి, యలమంచిలి తాసిల్దార్ పవన్ కుమార సొసైటీ కార్యదర్శి సుబ్రహ్మణ్యంటిడిపి మండల కార్యదర్శి ముచ్చర్ల శ్రీనివాస్, బిజెపి మండల అధ్యక్షులు తోలేటి లక్ష్మీనారాయణ (చంటి), మాజీ జడ్పిటిసి బోణం నాని, టిడిపి నాయకులు కడలి గోపి, ముచ్చర్ల శ్రీనివాస్, ఆరుమిల్లి రామ శ్రీనివాస్, రుద్రరాజు సత్యనారాయణరాజు, దేగల సత్తి కొండ, కడలి గోపి, చిలుకూరి శ్రీనివాస్, వల్లభు దుర్గా ప్రసాద్ తదితరులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేసారు.

# ఐక్య పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలి.





**పోడూరు,అత్తిలి ఆగస్టు 24, ప్రజాజ్యోతి న్యూస్ (రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** ఉద్యోగ కార్మికులు ఐక్య పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు పివి ప్రతాప్ పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సిఐటియు అత్తిలి మండల మూడవ మహాసభ కే ధర్మేంద్ర అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రతాప్ మాట్లాడుతూ పాలకులు ఎన్నికల్లో చెప్పిన మాటలకు ఇప్పుడు చేస్తున్న విధానాలకు పొంతన లేకుండా పోయిందని దీనివల్ల ఉద్యోగులు కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీస వేతనాలు లేవు, కార్మిక చట్టాలు సక్రమంగా అమలు లేదు, ఉద్యోగ భద్రత లేదు, ఉపాధి అవకాశాలు రోజురోజుకీ తగ్గిపోతున్నాయన్నారు. సమస్యలన్నీ ఈ తీరుగా ఉంటే పాలకులు మాత్రం 100 రోజులు పరిపాలన పూర్తి చేసాం అంటూ పండుగలు చేసుకుంటున్నారని అన్నారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం ఆంజనేయులు మాట్లాడుతూ ఈ కాలంలో సిఐటియు దేశవ్యాప్తంగా లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆందోళన చేసిందని అన్నారు. ఆశ, అంగన్వాడి వివోఏ, బిల్డింగ్ గ్రామపంచాయతీ, వీఆర్ఏ తదితర రంగాల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించిందన్నారు. వాటన్నిటిలోనూ అత్తిలి కార్మిక వర్గం భాగస్వామ్యం అయ్యారని అన్నారు. మహాసభ ప్రారంభ సూచికగా సిఐటియు పతాకాన్ని ప్రతాప్ ఆవిష్కరించారు. నూతన కన్వినింగ్ కమిటీ ఏర్పడింది. కన్వీనర్ గా కె ధర్మేంద్ర,కో కన్వీనర్ గా మల్లేశ్వరి మరొక 13 మందితో నూతన కమిటీ ఏర్పడిందన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టిద్దాం.

### బద్వేల్ అర్బన్ సి ఐ లింగప్ప..

**బద్వేల్ ఆగస్టు 24 (ప్రజా జ్యోతి న్యూస్)** పర్యావరణం పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరం రాబోవు వినాయక చవితికి మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించాలని పర్యావరణ కాలుష్య నివారణకు అందరం పాటు పడదామని బద్వేల్ అర్బన్ సిఐ లింగప్ప తెలిపారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అనే పోస్టర్ ను ఆదివారం బద్వేల్ అర్బన్ స్టేషన్లో సిఐ లింగప్ప పోస్టర్లను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా బద్వేల్ అర్బన్ సిఐ లింగప్ప గారు మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వామ్యం అవ్వాలన్నారు. వాతావరణ కాలుష్యం కారణంగా వాతావరణం లో మార్పులు సంభవిస్తూ వస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ ఆఫ్ పారిస్ వలన నీటి కాలుష్యం ఎక్కువగా జరిగే ప్రమాదం ఉందని అందరం పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ యువజన సంఘం వారికి అభినందనలు తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని..... మాట్లాడుతూ ప్లాస్టిక్ ఆఫ్ పారిస్ వద్దు మట్టి గణపతి విగ్రహాలు ప్రతిష్టిద్దాం అన్నారు. రాబోవు




వినాయక చవితి పండుగను కుల, మతాలకతీతంగా ఐకమత్యంగా జరుపుకోవాలని అన్నారు.ఇప్పటికే పర్యావరణ కాలుష్యం అనేక రూపాలలో కలుషితం అవుతుందని అన్నారు. ప్లాస్టిక్ ఆఫ్ పారిస్ గణపతి విగ్రహాలు వాడటం చేత నీటిలో కరగడం చాలా రోజులు పడుతుందని కాలుష్యం ద్వారా నీటిలోని జీవరాసులు చేపలు వంటివి చనిపోయే ప్రమాదం ఉందని వైద్యులు నిపుణులు అనేక సందర్భాలలో చెబుతున్నారని అన్నారు. పర్యావరణ పరి రక్షణ కోసం డివైఎఫ్ఐ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్ కే ఆదిల్, పట్టణ నాయకులు సుధాకర్, ప్రసాద్ రెడ్డి, ఎస్ కె ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# సెంచరీ ప్లే వుడ్ కంపెనీ నీ ఆకస్మికంగా తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు

**గోపవరం ఆగస్ట్ 24( ప్రజా జ్యోతి న్యూస్)** గోపవరం మండలం పిపి కుంట దగ్గర ఉన్న సెంచరీ ప్లే వుడ్ కంపెనీ నీ ఆకస్మికంగా విజిలెన్స్ అడిషనల్ ఏ ఎస్ పి శ్రీనివాస రావు, ప్రస్తుత సీజన్ ఖరీఫ్ లో యూరియా కొరత బలంగా విస్తరించ్చిందని విజిలన్స్ అధికారులు ఆకస్మికంగా తనికీలు చేయడం జరుగుతుంది.అందులో భాగంగా గోపవరం మండలం పిపి కుంట దగ్గర ఉన్న సెంచిరీ ప్లే వుడ్ కంపెనీ ని తనిఖీ చేసారు అక్కడ యూరియా డంప్ అవుతుంది.అని సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా అక్కడ ఉన్న యూరియా టెక్నికల్ గ్రేడ్ యూరియా అని నిర్ధారణ అయినది.ఈ యూరియా కేవలం ఇండస్ట్రియల్ పర్పస్ కోసం వాడుతున్నారని.అధికారులు నిర్ణయం తీసుకొన్నారు.ఈ కార్యక్రమం లో బద్వే రూరల్ సిఐ కృష్ణయ్య. మండల వ్యవసాయ అధికారి విజయరావు, గోపవరం ఎస్సై శ్రీకాంత్ వ్యవసాయ విస్తరణ అధికారి ఓబయ్య, కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**బాపట్ల ఆగస్టు 24 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రేపల్లె, చీరాల రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ జె.వేంకట మురళి తెలిపారు.అర్జీదారులు తమ ఫిర్యాదులను వెబ్సైట్లో నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల స్థితి తెలుసుకోవాలనుకుంటే 1100 నంబర్కు సంప్రదించవచ్చునని కలెక్టర్ పేర్కొన్నారు.

## పెద్ది నాగకుమార్ గౌతమి రిసెప్షన్‌లో పాల్గొన్న జనసేన నాయకులు



**బాపట్ల ఆగస్టు 24 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల పట్టణంలోని శ్రీ అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కళ్యాణ మండపం లో పెద్ది నాగకుమార్ గౌతమి వివాహ రిసెప్షన్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించడానికి బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు విన్నకోట సురేష్, తూర్పుసత్రం చైర్మన్, ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి, మాద శ్రీనివాసరావు, నరాలశెట్టి ప్రకాశరావు, పెద్ది హరి, కారుమూరి అంజనేష్, పసుపులేటి మహేశ్, ఉమ్మారెడ్డి వెంకటేష్, భీమా కోటేశ్వరావు, బీసాబాతిని రాజశేఖర్, గడ్డం బద్రీనాథ్, గంటి వాసు తదితరులు హాజరయ్యారు. వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులు, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హాజరైన అతిథులను నిర్వాహకులు ఆత్మీయంగా ఆతిథ్యం ఇచ్చారు.

## రాయచోటిని అన్నమయ్య జిల్లాకేంద్రంగా యథావిధిగా కొనసాగించాలి

**అన్నమయ్య జిల్లా సాధన సమితి**




**అన్నమయ్య జిల్లా ఆగస్టు 24 ప్రజా జ్యోతి** రాయచోటి నుంచే అన్నమయ్య జిల్లా కొనసాగాలని అన్నమయ్య జిల్లా సాధన సమితి డిమాండ్ చేసింది. జిల్లా కేంద్రాన్ని ఇతర ప్రాంతానికి తరలించాలన్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తూ, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను సహించమని స్పష్టం చేసింది. ఆదివారం రాయచోటి సాయి సుభ కళ్యాణ మండపంలో జరిగిన అత్యవసర సమావేశంలో వివిధ సంఘాల నాయకులు, విద్యావేత్తలు, ప్రజా ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.వక్తలుమాట్లాడుతూరాయచోటి అన్నమయ్య జిల్లా హృదయ భాగం. ఇది భౌగోళికంగా జిల్లా మొత్తానికి సెంటర్‌గా ఉండడంతో గత ప్రభుత్వం రాయచోటిని జిల్లా కేంద్రం చేసిందన్నారు. మౌలిక వసతులు కలిగిన పట్టణంగా ఇది వేగంగా అభివృద్ధి చెందుతోంది. జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు, 98 శాఖల కార్యాలయాలు రాయచోటిలో శరవేగంగా ఏర్పాటు చేయబడినవి. జిల్లా కలెక్టరేట్ ,తదితర ప్రభుత్వ కార్యాలయాల పక్కా భవనాల కోసం వేలాది ఎకరాల భూములు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇది అభివృద్ధి మార్గంలో ఉన్న పట్టణం. యాభై ఏళ్లకు తగ్గట్లుగా త్రాగునీటి వసతులు కూడా ఏర్పాటయ్యాయి. ఇలాంటి తరుణంలో జిల్లా కేంద్రాన్ని తరలించాలన్న ఆలోచన రాజకీయం మినహా మరేమీ కాదు అని తీవ్రంగా మండిపడ్డారు.టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రాయచోటినే జిల్లా కేంద్రంగా కొనసాగించాలని వారు కోరారు. ప్రజా విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే హామీలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.రాయచోటి ఎమ్మెల్యే, మంత్రి మండిపల్లె రామ్ ప్రసాద్ రెడ్డిప్రత్యేక శ్రద్ధ పెట్టి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారితో జిల్లా కేంద్రం మార్పును అడ్డుకోవాలని సమితి విజ్ఞప్తి చేసింది. ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, సామాన్యులు రాయచోటిని జిల్లా కేంద్రంగా నిలబెట్టుకోవడానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అవసరమైతే ఉద్యమానికి సిద్ధం కావాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షుడు డా. బయారెడ్డి, సంఘ అధ్యక్షుడు నాగిరెడ్డి, మదనమోహన్ రెడ్డి (అర్చన స్కూల్), శ్రీనివాసులు రెడ్డి (డిగ్రీ కళాశాల), విజయభాస్కర్ (బీసీ సెల్), గంగిరెడ్డి (ప్రతిభ స్కూల్), రామాంజులు (సంగీత స్కూల్), సాయిసుభ కళ్యాణ మండపం అధినేత ప్రకాష్, మైనారిటీ నేత ఇర్షాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమపల్లె రామ్ ప్రసాద్ రెడ్డి, న్యాయవాది రెడ్డెప్ప రెడ్డి, భాస్కర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వరరావు కు ప్రతిష్టాత్మకమైన మదర్ థెరిస్సా జాతీయ పురస్కారం



**పోడూరు, ఆగస్టు 24,ప్రజాజ్యోతి న్యూస్(రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** రాహుల్ సామాజిక సేవా సంస్థ వృద్ధాశ్రమం నిర్వహిస్తూ నిరుపేద వృద్ధులకు సేవలందిస్తున్న జోగాడ ఉమామహేశ్వరరావు కు కోనసీమ జిల్లా రావులపాలెం లో సిఆర్సి ఎసి ఫంక్షన్ హాల్ నందు ఆదివారం జరిగిన ప్రతిష్టాత్మకమైన మధర్ థెరిస్సా జాతీయ పురస్కారం అవార్డు ను కలెక్టర్ మరియు విక్టరీ బజార్ అదినేత మరియు సిఆర్సి అదినేత వెంకట రెడ్డి సి ఐ రమణమ్మ మరియు అతిరధ మహారధులైన ప్రముఖులు చేతులు మీదుగా ఈఅవార్డును అందుకున్నారు.జోగాడ ఉమామహేశ్వరరావు దంపతులు ప్రతిష్టాత్మక మైన మధర్ థెరిస్సా జాతీయ పురస్కారం అందుకోవడానికి కారుకులైన మధర్ థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ వారికి., వృద్ధాశ్రమం నిర్వహణకు సహకరిస్తున్న దాతలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# డా బూసి వెంకటస్వామికి డా సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారం.

**పోడూరు, ఆగస్టు 24,ప్రజాజ్యోతి న్యూస్(రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల తెలుగు శాఖాధిపతి డా బూసి వెంకటస్వామి కి 2025 సంత్సరానికిగాను డా సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్లు యస్ పి యల్ టి ఓ గౌరవ అధ్యక్షులు డా కె యస్ లక్ష్మణరావు,రాష్ట్ర అధ్యక్షులు డా నాగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేసారు. దక్షిణాది రాష్ట్రాలలో అత్యంత ప్రతిభావంతు లైన, వివిధ రంగాలలో నిష్ణాతులైన వారిలో తమను ఎంపిక చేయటం ఆనందంగా ఉందన్నారు.తెలుగు భాష, సాహిత్యాలలో కృషి చేస్తున్నందుకుగాను ఈ సత్కారం అందుకోనున్నట్లు డా వెంకటస్వామి తెలియజేసారు.సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 31 వ తేదీన జరిగే కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకోనున్నట్లు వారు తెలియజేసారు.డా బూసి వెంకటస్వామి ఇప్పటికే దాశరథి స్మారక పురస్కారం, గుర్రం జాషువా స్మారక పురస్కారం, గురజాడ స్మారక పురస్కారం,సిరి మంజిరి జాతీయ పురస్కారం, గురుబ్రహ్మ, ఆచార్య దేవోభవ అవార్డులతో పాటు 2024 సంవత్సరంలో మద్రాస్ విశ్వవిద్యాలయ ఉగాది పురస్కారం, తన్నీరు కోటయ్య స్మారక జాతీయ పురస్కారం,2015 వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంచే స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డులను పొందా రన్నారు.వీరి పర్యవేక్షణలో ఇప్పటికే 12 మంది పిహెచ్ డి అవార్డులు అందుకున్నారన్నారు. వివిధ విశ్వవిద్యాలయాలలో,



కళాశాలలో జరిగే జాతీయ అంతర్జాతీయ సదస్సులో పాల్గొని సప్రమాణికమైన పరిశోధనా పత్రాలు సమర్పించారు. కర్నాటక సార్వత్రక విశ్వవిద్యాలయం- మైసూర్ ,బెంగుళూర్ విశ్వవిద్యాలయం, నార్త్ బెంగుళూర్ విశ్వవిద్యాలయం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఆంధ్ర విశ్వవిద్యాలయం వంటి వివిధ విశ్వవిద్యాల యాలతో పాటు ఆంధ్ర రాష్ట్రంలో




ప్రభుత్వ డిగ్రీ మరియు ఎయిడెడ్ కళాశాలల్లో పాఠ్యాంశ నిర్ణాయక సభ్యులుగా వ్యవహారిస్తున్నారన్నారు.డా బూసి వెంకటస్వామికి డా సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారం ప్రకటించటం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా తిరువీధుల రాజరాజేశ్వరి ,వైస్ ప్రిన్సిపాల్ శ్రీ టి కృష్ణ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తెలుగు సాహితీ, భాషాభిమానులు అభినందనలు తెలిపారు.

# మదనపల్లిలో పోలీసులకు యోగాసనాలు
# లరి ఫిట్ ఇండియాలో భాగంగా కార్యక్రమం

శారీరక మానసిక ఆరోగ్యానికి యోగ ఎంతో ఉపయోగకరం - మదనపల్లి డిఎస్పీ ఎస్.మహేంద్ర గారు.

**మదనపల్లి ఆగస్టు 24 ప్రజా జ్యోతి** ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని పురస్కరించుకుని అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్,. గారి ఆదేశాల మేరకు మదనపల్లి డీఎస్పీ కార్యాలయంలో పోలీసు సిబ్బందికి యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాసనాల ప్రాధాన్యత గురించి డిఎస్పీ ఎస్. మహేంద్ర గారు మాట్లాడుతూ "ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఈరోజు మన పోలీసు సిబ్బంది అందరికీ యోగాసనాలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. మనం నిత్యం విధుల ఒత్తిడిలో ఉంటాం. ఈ ఒత్తిడి శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో, యోగా మనకు ఒక గొప్ప పరిష్కారం.యోగా కేవలం శారీరక వ్యాయామం కాదు. అది మన మనసును ప్రశాంతంగా ఉంచి, ఏకాగ్రతను పెంచుతుంది. యోగాసనాలు మన శరీరానికి బలాన్ని ఇస్తాయి, రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ముఖ్యంగా, మనలోని ఒత్తిడిని తగ్గించి, మానసిక ప్రశాంతతను అందిస్తాయి. ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా మనందరం ఆరోగ్యవంతమైన జీవన శైలిని అలవర్చుకోవాలి.



ఇందుకోసం ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి యోగా లేదా ఇతర వ్యాయామాలు చేయాలి. మన ఆరోగ్యం బాగుంటేనే, మనం ప్రజలకు మెరుగైన సేవలు అందించగలం. యోగాను మన దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకొని ఆరోగ్యంగా ఉందాం అని పేర్కొన్నారు."

ఈ కార్యక్రమం ఉత్సాహంగా, విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో మదనపల్లి 1వ పట్టణ సీఐ శ్రీ రఫీ గారు, తాలూకా సీఐ శ్రీ కె. వెంకటరమణ గారు, మదనపల్లి 1వ పట్టణ, 2వ పట్టణ, తాలూకా, ముదివేడు, పీటీఎం ఎస్ఐలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మణుగూరులో బూడిద బతుకులు
# మసిబారుతున్న పల్లెలు

ఖమ్మం : భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం వెలుగులతో పాటు సమీప గ్రామాలకు వ్య ర్థాలను పంచుతోంది. పొగ ద్వారా వచ్చే వా యు కాలుష్యానికి తోడు బొగ్గుమండించగా మిగిలిన బూడిద ప్రజలను కమ్మేస్తుంది. ప్ర జల తో పాటు పశువులు సైతం అనారోగ్యానికి గుర వుతున్నాయి. పల్లెల నుండి పచ్చని చెట్ల వరకుబూడిద కమ్మేయడంతో ఎండి పోతున్నాయి. పంట లు సైతం వేయలే కపోతున్నా మని రైతులు గగ్గోలు పెడుతు న్నారు. గ్రీన్ బెల్టు ఏర్పాటు, రక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిమ్మ కునీరెత్తినట్లు వ్య వహరిస్తున్నా రనీ, చర్మ, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో పాటు దీర్ఘకాలిక రోగాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంటు (బిటిపిఎస్) పరిసర గ్రామాల ప్రజల ఇబ్బందుల పై విజయ క్రాంతి పరిశీలనాత్మక కథనం... ఎక్కడైనా పరిశ్రమలు వ స్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెంది, స్థానికులకు ఉపాధి అవకాశాలు వస్తాయి.కానీ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న బి టి పి ఎస్ పరిసర పల్లెలకు పరిశ్రమ శాపంలా మారిందని గ్రామాలలో కాలుష్యం భయాం దోళనలు రేకెత్తిస్తోందని, థర్మల్ స్టేషన్ నుంచి వెలువడే పొగ, బూడి ద వల్లవాయు, జల కాలుష్యం ఏర్పడు తోం దని స్థానికులు చెబుతున్నారు. రోజుకు వం దల సంఖ్య లో లారీల ద్వారా బూడిద తరలింపు జరపడం వ ల్ల చుట్టుపక్కల గ్రామా ల్లో వాయు కాలుష్యం ప్రమాదకర స్థితికి చేరిందని వాపోతు న్నారు.ప్లాంట్ చిమ్నీల నుంచి వెలువడే పొగ ఉ క్కిరి బిక్కిరి చేస్తుండ గా బూడిద వ్యర్థాలు గాలిలో కలసి కాలుష్యం పెరిగి పచ్చటి పల్లెలను బూడిద కమ్మే స్తోంది. థర్మల్ ప్లాంట్ నుంచి వెలువడే వాయుకాలుష్యం దెబ్బకు పరి సర గ్రామాలు విలవిల లాడు తుండగా ఆయా కాలుష్య కారకాలను పీల్చుకుని ప్రజ లు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇక పశు పక్ష్యాదుల సంగతి సరే సరి. విష పూరిత కాలుష్య రేణువులు వెలు వడకుండా చర్యలు చేపట్టాల్సి ఉన్నా..బిటిపి ఎస్ అధికారుల పట్టింపులేని



తనంతోనే తమకు ఈ ఇబ్బందులు ఎదురవు తున్నాయని బాధిత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధర్నాలు, ఆం దోళనలు చేసి నప్పుడు ప్రజా ప్రతినిధుల సమక్షంలో హామీలుఇస్తున్నా.. ఆ త ర్వాత వాటిని తుంగలో తొకడం షరామామూలైందని మండి పడుతున్నారు... కళ్లు, ఒళ్లు మండి పోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు.భద్రాద్రి పవర్ ప్లాంట్ నుండి వెలు వడుతున్న బూడిద (యాష్) తరలించే బూడిద ట్యాంకర్లే ప్రధాన రహదారి నిండా దర్శనమిస్తున్నాయి. వాటి మూలంగా అనేక ప్రమా దాలు చోటు చేసుకుంటున్నాయి. ట్యాంకర్ల నుండి వెలువడుతున్న బూడిదతో పీల్చేగా లి... తినే తిండి.. తాగే నీరూ కలుషితమై ప్రజలను అనారోగ్య పాలు చేస్తోంది. శ్వాసకోశ సంబంధించిన వ్యాధులు, చర్మ సంబంధిత వ్యాధు లతో జీవితాలు మసకబారి పోతున్నా యి.చివరకు పరిసర గ్రామాల ప్రజల ఇక్కట్లు బూడిద ముసిరిన బతుకులుగా మా రుతున్నాయి. బూడిద, దుమ్ము, ధూళి కారణంగా ఒంటిపై దద్దుర్లు , చర్మంపై మచ్చలు వస్తున్నాయని, ప్రజలు ఆగ్రహిస్తున్నారు. పరిశ్రమ ప్రభావిత గ్రామాలో యాజ మాన్యం తో పాటు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వారం వారం వైద్య పరీక్షలు చేయా ల్సి ఉన్నా గ్రామాల్లో ఆపరిస్థితి కనిపించడం లేదని. ప్రారంభంలో కొంత కాలం సీఎస్ ఆ ర్ కింద యాజమాన్యం మొక్కుబడి శిబిరా లు నిర్వహిం చినా.. ఇప్పు డు తమ వైపు కన్నెత్తి చూడటం లేదనిబాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్లాంట్ నుండి వెలబడుతున్న యాష్ కా రణంగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అ నేక ఇబ్బందులకు గురవుతున్నారు. త్రాగే మంచి నీటి నుండి పండించే పంటల వరకు ప్రజలుఇబ్బందులను పడుతున్నారు. పరిసర గ్రామాలైన చిక్కుడు గుంట, దమక్క పేట, సాంబాయి గూడెం, రాయిగూడెం, పో తిరెడ్డిపల్లి, ఏడుల్ల బయ్యారం, సీతారాంపు రం, ఉప్పాక, బొమ్మరాజుపల్లి తదితర గ్రా మాల ప్రజలు నిత్యం బూడిదతో సహ జీవ నం చేస్తున్నారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బం దులు కలగకుండా పవర్ ప్లాంట్ ను కొనసాగించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదే శాలు ఉన్నప్పటికీ వాటిని పాటించడం లో బిటిపిఎస్ అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. నిత్యం మంచు దుప్పటిలా గ్రా మాలన్నీ బూడిదతో దర్శనమిస్తున్నాయి. వ చ్చని చెట్లు బూడిదపారి నల్లగా మారిపోతున్నాయి.వరి, ప త్తి, మిరప సాగు చేసే రైతుల కు దిగు బడులు తగ్గి అర్థం కాని పంట తెగుళ్లతో నష్ట పోతున్నామని ఆందోళన చెందు తున్నా రు .ఈ విషయంపై రాజ కీయనాయకులు, పలువురు ప్రకృతి ప్రేమికులు పలు మార్లు చర్యలు తీసుకోవాలని కోరిన కాలు ష్య సమస్యను అరికట్టడంలో ప్లాంట్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటి కైనా పవర్ ప్లాంట్ యాజమాన్యం స్పందించి గ్రామాలలో కా లుష్య నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## 'దేవుడు గొప్ప డిజైనర్.. ప్రకృతి ఉత్తమ గురువు'

మంచి ఉదాహరణ. మానవులు కృత్రిమ మెదడును సృష్టించడానికి సహజ మెదడును ఉపయోగించారు.

మేము తెలంగాణ రైజింగ్ 2047 అనే ప్రయాణాన్ని ప్రారంభించాము. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నాం. దేశం 100 సంవత్సరాల స్వాతంత్ర్యదినోత్సవాన్ని జరుపుకునే 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ గా మారుస్తాం..తెలంగాణ లైఫ్ సైన్సెస్‌కు కేంద్రం గా ఉంది..తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను సాధించడంలో వైద్య పరికరాలు, మెడ్‌టెక్ కీలకమైనవి' అని ఆయన పేర్కొన్నారు.

**లైఫ్ సైన్సెస్, మెడికల్ టెక్నాలజీ హబ్‌గా తెలంగాణ**

బయోడిజైన్స్, లైఫ్ సైన్సెస్, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ఒక ముఖ్యమైన కేంద్రంగా ఎదుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో ఆసియా-పసిఫిక్ బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్-2025 ఘనంగా జరిగింది. ఈ సమ్మిట్‌కు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ బయోడిజైన్స్‌కు ఒక గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు. తెలంగాణను 2047 నాటికి భారతదేశంలో ఒక ముఖ్యమైన ఆర్థిక శక్తిగా మార్చడమే లక్ష్యంగా "తెలంగాణ రైజింగ్ 2047" నినాదంతో ముందుకు వెళు తున్నామని చెప్పారు. 2047 నాటికి భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తవుతుందని, అప్పటికి మన దేశం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లైఫ్ సైన్సెస్, మెడికల్ టెక్నాలజీ విభాగంలో తెలంగాణ హబ్‌గా మారిందని, సుల్తాన్‌పూర్‌లో భారత్‌లోనే అతిపెద్ద మెడికల్ డివైజ్ పార్కును ఏర్పాటు చేశామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుల్తాన్‌పూర్ పార్కులో 60కి పైగా కంపెనీలు ఉన్నాయని, ఇక్కడ ఇంప్లాంటేషన్లు, వైద్య పరికరాలు తయారు చేస్తున్నారని చెప్పారు. మన సామర్థ్యం, తెలివితేటలను ప్రజల కోసం ఉపయోగించుకోవాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. దీనికి తోడు, పరిశోధనల కోసం ప్రభుత్వం మెడికల్ డేటాను కూడా అందిస్తుందని హామీ ఇచ్చారు. ఇప్పుడు టారిఫ్‌లు, వ్యాపార సమస్యలు, యుద్ధాలతో ప్రపంచం సతమతమవుతున్నప్పటికీ, ఇది ఇన్నోవేటర్స్, స్టార్టప్‌లు ఏర్పాటు చేసుకోవడానికి సరైన సమయం అని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఆవిష్కరణలు, కొత్త ఆలోచనలు పుట్టుకొస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కిషన్‌రెడ్డి అసత్యాలు ప్రచారం చేస్తున్నారు

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు. యూరియా సరఫరాలో జియో పాలిటిక్స్, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఎర్ర సముద్రంలో నౌకాయనం నిలవడంతో యూరియా ఇంపోర్ట్ ఆగిపోయిందని చెప్పుకొచ్చారు. కిషన్ రెడ్డి డిమాండ్‌కు తగ్గ స్థాయిలో సరఫరా లేదని చెబుతూనే మరోపక్క యూరియా పక్కదారి పడుతోందని ఆరోపణలు చేయడం వారి ద్వంద వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. యూరియా దిగుమతులు లేక దేశీయంగా ఉత్పత్తి డిమాండ్‌కు తగ్గ స్థాయిలో లేక నెలకొన్న కొరతపై వాస్తవాలు దాచిపెడుతు న్నారని ఫైర్ అయ్యారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో యూరియా కొరత నెలకొంటే రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లడం కిషన్ రెడ్డి స్థాయికి తగదని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రంగంలోకి కేసీఆర్!

మియాపూర్‌లోని నరేన్ గార్డెన్స్‌లో నేతలు, కార్యకర్తలతో కేటీఆర్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి పార్టీ ఇన్ ఛార్జ్‌ను కేటీఆర్ ప్రకటించనున్నారు. అయితే 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం అరికేపూడి గాంధీ.. బీఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న సంగతి తెలిసిందే. అలాగే వివిధ నియోకవర్గాల కేడర్‌తో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి.. ఇన్‌ఛార్జ్‌లను నియమించాలని ఇప్పటికే ఆ పార్టీ అధినేత కేసీఆర్ పార్టీ ముఖ్యనేతల సమావేశంలో ఆదేశించినట్లు ఓ చర్చ అయితే సాగుతోంది.

## వరి బోనస్ ఎప్పుడు

**అదిలాబాద్ :** జిల్లాలో 2024-25 రబీ సీజన్‌లో 345 కొ నుగోలు కేంద్రాల నుంచి 1,97,590.920 (దొడ్డు 1,90,665.120, సన్న రకం 6,925.800) మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 34,004 మంది రైతుల నుంచి పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. వీటికిగాను రైతుల అకౌంట్లలో 54,76,57,616 రూపాయలు జమ చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలు సాగు చేసిన రైతులకు బోనస్ రూ. 500 ప్రకటించింది. కానీ ఈ సీజన్ గడిచినా బోనస్ డబ్బులు రైతుల అకౌంట్లలో జమ కాలేదు. రబీ సీజన్‌లో జిల్లాలోని 34,004 మం ది రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. ఇందులో 1041 మంది రైతులు రబీలో కూడా సన్నా లు సాగు చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు క్వింటాలుకు కామన్ రకానికి రూ. 2,300, 'ఏ' గ్రేడ్ రకానికి రూ. 2,320 మద్దతు ధర ప్రకటించగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ప్రకటించిన విధంగా 'ఏ' గ్రేడ్ రకానికి క్వింటాలుకు ప్రభుత్వ మద్ధతు ధరతో పాటు రూ. 500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించి వానా కాలం సీజన్ లో అందజేసింది. కానీ రబీలో మాత్రం సీజన్ ముగిసి రెండు నెలలు దాటవస్తున్నా ఇంత వరకు దానీ ఊసే లేదు. జిల్లాలో 1041 మంది రైతులు సన్నాలు సాగు చేశారు. కొనుగోలు కేంద్రాలకు 69,258 క్వింటాళ్ల సన్న ధాన్యం విక్రయించి వారికి రావాల్సిన 3,46,29,000 రూపాయల కోసం ఎదురు చూస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లు జిల్లాలోని నాలుగు ఏజన్సీల ద్వారా జరిపారు. రైతులు బోనస్ కోసం ఆయా ఏజెన్సీల కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వడ్లు సొసైటీ సెంటర్‌లో అమ్మి రెండు నెలలు దా టింది. ఇంత వరకు బోనస్ డబ్బులు అకౌంట్‌లో పడటం లేదు. 12 ఎకరా లు కౌలుకు తీసుకొని పంట సాగు చేస్తే మొదట్ల గాలి దుమారం, వర్షాల వల్ల పంట బాగా నష్ట పోయిన. దిగుబడి తగ్గింది. సన్నాలకు ప్రభుత్వం ఇస్తానన్న బోనస్ అయినా వస్తే తొందగానే వస్తే ఎంతో కొంత ఉపయోగపడుతుందనుకుంటే కండ్లు కాయలు కాచేలా ఎదురు చూడాల్సి వస్తోంది. ఇప్పటికైనా మా గోసను చూసి బోనస్ (రూ. 1,28,400) డబ్బులు అకౌంటులో జమ చేయుండ్రి... పెట్టుబడికి కష్టమవుతుంది...

## అంతకంతకు పెరుగుతున్న అప్పులు

"రోడ్లు వేస్తున్నాం. విమానాశ్రయాలు నిర్మిస్తున్నాం. మెడికల్ కాలేజీలు కడుతున్నాం. అందరికీ తాగునీరు అందిస్తున్నాం. దేశ సౌభాగ్యాన్ని సరికొత్త పుంతలు తొక్కిస్తున్నాం.. గడచిన పది సంవత్సరాలలో దేశ అభివృద్ధిని పరుగులు పెట్టించాం. ప్రపంచ వేదికల మీద మన దేశానికి సమున్నత స్థానాన్ని కల్పించాం" ఇలానే ఉంటున్నాయి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యాఖ్యలు. మనదేశంలోనే కాదు, ప్రపంచ వేదికల మీద ఆయన ఇలానే మాట్లాడుతున్నారు.వాస్తవానికి ఆయన మాటల్లో కొంత నిజం ఉండొచ్చు. కానీ భారతదేశ అప్పులు మాత్రం అంతకంతకు పెరుగుతున్నాయి.. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన నాటు నుంచి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అప్పు రెండు వందల లక్షల కోట్లకు చేరుకుంది. ఇది దేశస్తుల జాతీయ ఉత్పత్తిలో 56.1 శాతానికి చేరుకుంది. కేంద్రానికి వివిధ రూపాలలో వస్తున్న ఆదాయంలో 37.32% రుణాలకు సంబంధించి చెల్లించాల్సిన వడ్డీలకే సరిపోతుంది. ఇదేదో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు కాదు.. సాక్షాత్తు పార్లమెంట్ సాక్షిగా కేంద్రం వెల్లడించిన వివరాలు.2015 -16 లో కేంద్రం అప్పులు 70.88 లక్షల కోట్లు ఉండగా.. గడచిన పది సంవత్సరాలలో అది 18,190 శాతం పెరిగింది. స్థూల జాతీయోత్పత్తిలో రుణాలకు సంబంధించిన నిష్పత్తి 51.5 నుంచి 56.1 శాతానికి చేరుకుంది. దశాబ్ద కాలంలో కేంద్రం 100 లక్షల కోట్లకు మించి అప్పు చెల్లించింది. ఇందులో అసలు 32.61 లక్షల కోట్లు కాగా.. వడ్డీ 85.17 లక్షల కోట్లు కావడం విశేషం. కేంద్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో వడ్డీలకు సంబంధించిన చెల్లింపుల కోసం 2015 -16లో 36.96% ఉండగా.. ఇప్పుడు ఏకంగా అది 37.32 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూసుకుంటే అప్పులలో తమిళనాడు 9.55 లక్షల కోట్లతో మొదటి స్థానంలో ఉంది. 8.57 లక్షల కోట్లతో ఉత్తర్ ప్రదేశ్ రెండవ స్థానం, మహారాష్ట్ర 8.12 లక్షల కోట్లతో మూడో స్థానంలో ఉన్నాయి.కేంద్రం అప్పులు 200 లక్షల కోట్లకు చేరిన నేపథ్యంలో ప్రతిపక్షాలు ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తోంది.

# వేములవాడ అభివృద్ధికి తొలి అడుగు!

**ములవాగు బ్రిడ్జి నుండి రాజన్న ఆలయం దాకా రూ.6.5 కోట్లతో 80 ఫీట్ల రోడ్డుకు శంకుస్థాపన**

వేములవాడ పట్టణంలోని ములవాగు బ్రిడ్జి నుండి రాజన్న ఆలయం వరకు రూ.6 కోట్ల 50 లక్షల వ్యయంతో 80 ఫీట్ల వెడల్పుతో రోడ్డుకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అతనితో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా ఎస్పీ మహేష్ బి గితే, ఆలయ ఈవో రాధ భాయి, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలకల తిరుపతి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వేములవాడ రోడ్డు వెడల్పు కోసం ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కోడెను కట్టే ప్రాచీన ఆనవాయితీ ఉన్న రాజన్న ఆలయం అభివృద్ధి తెలంగాణ ప్రభుత్వానికి ప్రాధాన్యత అంశమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రత్యేక ప్రణాళికలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి నెలలోనే వీటిడిఏ సమావేశం నిర్వహించి గతంలో పోయిన రూ.20 కోట్ల నిధులను తిరిగి తెప్పించి బద్ధిపోచమ్మ ఆలయం అభివృద్ధికి ప్రారంభించామని తెలిపారు. గతంలో రాష్ట్రాన్ని నడిపించిన కేసీఆర్ వేములవాడ అభివృద్ధిపై వాగ్దానాలు ఇచ్చినప్పటికీ వాటిని అమలు చేయలేకపోయారని విమర్శించారు. రాజన్న భక్తులు ఎన్నిసార్లు కోరినప్పటికీ ఒక్క ఇటుక మార్చని స్థితిలో వదిలేశారని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.150 కోట్లను కేటాయించి రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. గత సంవత్సరం నవంబర్ 20న సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎనిమిది మంది మంత్రుల చేతుల మీదుగా సుమారు రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్టు గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పనులు వేగంగా కొనసాగుతున్నాయనీ,



జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణలో అధికారులు క్షేత్రస్థాయిలో పనులను అమలు చేస్తున్నారని తెలిపారు. గత 54 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వేములవాడ పట్టణ రోడ్డు వెడల్పు పనులను నేడు మొదలుపెట్టడం మైలురాయిగా పేర్కొన్నారు. 47 కోట్ల రూపాయల ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్రానికి పంపి, నిధులు కలెక్టర్ ఖాతాలో జమ చేయించినట్టు వివరించారు. భూసేకరణలో నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిదని, వారికి 2013 చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించామని అన్నారు. రోడ్డు ఇరువైపులా ఆధునిక డ్రైనేజీ, లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఆలయ అభివృద్ధికి సంబంధించిన 76 కోట్ల రూపాయల పనులకు అగ్రిమెంట్లు పూర్తయ్యాయని, నమూనాలు త్వరలో విడుదల కానున్నాయని తెలిపారు. 35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, పనులు ప్రారంభం కావనున్నాయని చెప్పారు. శృంగేరి పీఠాధిపతుల సూచనలతో వేములవాడ పరిరక్షణ సమితి ఏర్పడి ప్రజల సలహాలు సూచనలు తీసుకున్నట్టు చెప్పారు. రాజన్న ఆలయ అభివృద్ధి ఒక్కరి పనికాదు, ఇది ప్రజల, భక్తుల ఎజెండా అని స్పష్టం చేశారు. వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తామని, భక్తులకు శీఘ్ర దర్శన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఈరోజు అభివృద్ధికి క్షేత్రస్థాయిలో తొలి అడుగు వేసినట్టు పేర్కొంటూ, కార్యక్రమానికి హాజరైన పట్టణ ప్రజలకు, భక్తులకు ధన్యవాదాలు తెలిపారు.

# ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

## పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్

విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ హెచ్చరించారు. త్వరలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ఆదివారం ఆయన ఈ ప్రకటన విడుదల చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడడం తీవ్రమైన నేరమని, ఇది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తుందని ఆయన అన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లపై చేసే వేధింపులు, అసభ్యకర కార్యకలాపాలు చట్ట ప్రకారం శిక్షార్హమని ఆయన స్పష్టం చేశారు. అటువంటి చర్యలకు పాల్పడిన విద్యార్థులను విద్యాసంస్థల నుండి తొలగించడమే కాకుండా, క్రిమినల్ కేసులు నమోదు చేసి వారి ఉజ్వల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

**విద్యాసంస్థల యాజమాన్యానికి సూచనలు:**

ర్యాగింగ్ నియంత్రణ కోసం విద్యాసంస్థల యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ప్రతి కళాశాలలో యాంటీ-ర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని, కొత్తగా వచ్చిన విద్యార్థులకు ప్రత్యేక పర్య



వేక్షణ ఉండాలని తెలిపారు. అంతేకాకుండా, ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు, సెమినార్లను నిరంతరం నిర్వహించాలని, విద్యార్థుల ఫిర్యాదుల కోసం 24 గంటల హెల్ప్ లైన్ నెంబర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**విద్యార్థులకు విజ్ఞప్తి**

సహ విద్యార్థుల పట్ల ఎటువంటి వేధింపులకు, అసభ్య కార్యకలాపాలకు పాల్పడవద్దని పోలీస్ కమిషనర్ విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ర్యాగింగ్‌కు గురైతే తక్షణమే ప్రిన్సిపాల్, యాజమాన్యం లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ర్యాగింగ్ విద్యార్థుల భవిష్యత్తును మాత్రమే కాకుండా సమాజంపైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. ర్యాగింగ్ సమాచారం అందించడానికి డయల్ 100 లేదా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 8712670744, 8712670745కు కాల్ చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని కమిషనర్ తెలిపారు. అందరి సహకారంతో ర్యాగింగ్ రహిత సమాజాన్ని నిర్మించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ర్యాగింగ్‌కు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం

**ర్యాగింగ్ మన సంస్కృతి కాదు, ఇలాంటి విష సంస్కృతికి ఎవరూ పాల్పడవద్దు**

**తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయొద్దు**

**ర్యాగింగ్ చేయడం నేరం, ర్యాగింగ్ లాంటి అసాంఘిక చర్యకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు**

**ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ చట్టం యాక్ట్ 1997 నుండి అమల్లోకి వచ్చింది**

పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, ఐపీఎస్ మేడమ్ గారు విద్యాసంస్థల్లో ఎవరైన విద్యార్థులు ర్యాగింగ్ లాంటి వికృత చేష్టలకు పాల్పడే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ మేడమ్ హెచ్చరించారు. త్వరలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోవుతున్న తరుణంలో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ర్యాగింగ్ నియంత్రణపై సిద్దిపేట పోలీస్ కమిషనర్ మేడమ్ ఆదివారం ఓ ప్రకటన చేస్తూ విద్యా సంస్థలలో ర్యాగింగ్‌కు పాల్పడటం అనేది తీవ్రమైన నేరమంగా పరిగణించబడుతుందని. ఈ చర్యల ద్వారా విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడే విధంగా వుంటుందని. ముఖ్యంగా సీనియర్ల ముసుగులో జూనియర్ విద్యార్థుల పట్ల అసాంఘిక కృత్యాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తూ విద్యాసంస్థల నుండి తొలగించడంతో పాటు ర్యాగింగ్ లాంటి చర్యలకు పాల్పడే విద్యార్థులపై



క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని. దీనితో ర్యాగింగ్ పాల్పడిన విద్యార్థుల విద్యా, ఉద్యోగ, భవిష్యత్తు అవకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. అలాగే విద్యా సంస్థల్లో ర్యాగింగ్ నియంత్రణకై యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి వుంటుందని. ఇందులో భాగంగా ప్రతి ఉన్నత విద్యా సంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని, నూతనంగా వచ్చిన విద్యార్థుల కొసం ప్రత్యేక పరివేక్షణ వుండాలని. ముఖ్యంగా ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలతో పాటు సెమినార్లు, వర్క్‌షాపులు నిరంతరం నిర్వహించాలని. విద్యార్థులు ఫిర్యాదు చేసేందుకు గాను 24గంటల హైల్ప్‌లైన్ నంబర్లను విద్యాసంస్థల యాజమాన్యం అందుబాటులో వుంచాలని. విద్యార్థులు సహ విద్యార్థులపై ఎటువంటి వేధింపులు, దౌర్జన్యాలు, అసభ్య కార్యకలాపాలకు పాల్పడవద్దని. ఎవరైన ర్యాగింగ్‌కు గురైతే తక్షణమే ప్రిన్సిపాల్, యాజమాన్యం లేదా పోలీసులకు సమచారం అందించాలని. ర్యాగింగ్‌కు పాల్పడం ద్వారా విద్యా భవిష్యత్తు నాశనం అవుతుందని ప్రతి ఒక్క విద్యార్థి గుర్తుంచుకోవాలని పోలీస్ కమిషనర్ సూచిస్తూ. ర్యాగింగ్ అనేది విద్యార్థుల భవిష్యత్తును మాత్రమే కాకుండా సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని. కావున విద్యా సంస్థల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పోలీసులు కలిసి పనిచేసిప్పుడే ర్యాగింగ్ సంస్కృతిని పూర్తిగా నిర్మూలిం చగలుతామని పోలీస్ కమిషనర్ మేడమ్ తెలియజేసారు. విద్యార్థిని విద్యార్థిని ఎవరైనా అవహేళన చేసిన అవమానంగా మాట్లాడిన ర్యాగింగ్ చేసిన వెంటనే డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100 సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

## సభను విజయవంతము చేసిన నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు

**శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం సమావేశంను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ సీనియర్ నేత రవీందర్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. సభలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన సూచనలు ప్రతి ఒక్కరు పాటించాలి అన్నారు.ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది అన్నారు.ఇదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో పని చేయాలి అన్నారు. కెసిఆర్ చేసిన అభివృద్ధి తప్పితే కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమి లేదు అన్నారు.శేరిలింగంపల్లిలో మొదటి నుంచి పార్టీ కోసం పని చేసే వారికి రానున్న రోజుల్లో మంచి అవకాశాలు ఉంటాయి అన్నారు. కార్యకర్తలు పార్టీకి బలం అని కేటీఆర్ చెప్పారని, అదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరు పని చేయాలి అన్నారు. సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోని అన్నీ డివిజన్ ల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు అని హర్షము వ్యక్తం చేశారు.శేరిలింగంపల్లిలో బీ ఆర్ ఎస్ పార్టీ బలంగా ఉంది అన్నారు. రానున్న ఎన్నికల్లో బీ ఆర్ ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుంది అని రవీందర్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు





## భార్యపై మారణాయుధంతో దాడి చేసిన భర్త

**తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితిలోకి బాధితురాలు**

**హుటాహుటిన ఆసుపత్రికి తరలించిన స్థానికులు**

**సంఘటన స్థలానికి చేరుకునీ విచారణ నిర్వహించిన ఎస్సై లక్ష్మీ భార్గవి**



కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై ఆగ్రహానికి గురైన భర్త మారణాయుధంతో ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండల పరిధిలోని మాటూరు గ్రామం బీసీ కాలనీలో జరిగింది. శనివారం అర్ధరాత్రి జరిగినట్లుగా తెలుస్తున్న ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిల్లసూర్యనారాయణ ప్రైవేట్ లారీ డ్రైవర్ గా పనిచేస్తూ జీవన సాగిస్తున్నారు. అరకొర ఆర్థిక సమస్యలు కుటుంబ భారంతో భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్ధలు నేపథ్యంలో శనివారం డ్రైవర్ విధులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన భర్త సూర్యనారాయణ(32) భార్య సాయి నాగలక్ష్మి(26) తో చిన్న సమస్యపై ఘర్షణపడ్డారు. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహానికి గురైన సూర్యనారాయణ అందుబాటులో ఉన్న మారణాయుదంగా ఉన్నట్లుగా గుర్తించిన వస్తువుతో భార్యపై దాడికి దిగినట్లు, ఈ దాడిలో నాగలక్ష్మి మెడపై బలమైన ఘాట్లు పడి రక్తస్రావం కావడంతో బాధితురాలు కేకలు వేసుకుంటూ ఇంట్లో నుండి రోడ్డుపైకి వచ్చి కింద పడిపోవడంతో బయటికి వచ్చిన స్థానికులు 108 అంబులెన్స్ సహాయంతో ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. నాగలక్ష్మి మెడపై బలమైన గాయం తో తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సంఘటన జరిగిన సమాచారాన్ని తెలుసుకున్న మధిర రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని విచారణ నిర్వహించారు. స్థానికులతో ఆదివారం ఉదయం మరోసారి పరిశీలన సందర్భంగా విచారణ నిర్వహించిన ఆమె నిందితునిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సూర్యనారాయణ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు ఉండగా ప్రస్తుతం నాగలక్ష్మి గర్భవతిగా ఉన్నట్లు సమాచారం. బాధితురాలు అమాయకురాలు గా అణుకువగా ఉంటుందని, సూర్యనారాయణ ఆమెపై గతంలో కూడా దాడి చేసి కొట్టినట్లు నమోదైన కేసు పోలీస్ రికార్డుల్లో ఉన్నట్లు ఈ సంఘటన అనంతరం గ్రామంలో పలు విధాలుగా చర్చించుకోవడం గమనార్హం.

## అమ్మాయి కోసం గొడవ..! కత్తులు, కొడవళ్ళతో యువకులు హల్చల్..



మహహబూబాబాద్ పట్టణంలో యువకులు కత్తులు, కొడవళ్ళతో హల్చల్ చేశారు. అమ్మాయి కోసం ఇద్దరు యువకుల మధ్య మొదలైన గొడవ కత్తులు, కొడవళ్ళతో దాడికి దిగేవరకు వెళ్ళింది. ఆదివారం ( ఆగస్టు 24 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని బయ్యారం మండలానికి చెందిన ఒక వర్గం యువకులు మహబూబాబాద్ పట్టణానికి చెందిన మరో వర్గం యువకులపై కత్తులతో దాడికి పాల్పడ్డారు.ప్రియురాలి కోసం ఇద్దరు యువకుల మధ్య మొదలైన గొడవ కత్తులతో దాడికి దిగే స్థాయికి వెళ్ళింది. ఇరువర్గాల యువకులు ఒకరిపై ఒకరు కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో స్థానికులు అడ్డుకోవడంతో ఒక వర్గం యువకులు కారులోనే కత్తులు వదిలేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు స్థానికులు. స్థానికుల సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. పరారీలో ఉన్న బ్యాచ్ కోసం గాలిస్తున్నారు పోలీసులు. యువకుల మధ్య ఘర్షణకు కారణమైన అమ్మాయి ఎవరు?, గొడవకు గల కారణాలేంటి వంటి వివరాలపై ఆరా తీస్తున్నారు పోలీసులు.

## రక్తదానం చేయండి ప్రాణదాతలుకండి

**పోచారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బాల్ రెడ్డి**

**ఘట్‌కేసర్ :** బ్రహ్మకుమారి సోషల్ సర్వీసింగ్ యూనివర్సల్ బ్రదర్ హుడ్ డే విశ్వ సౌభ్రాతృత్వ దినోత్సవం సెకండ్ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ హెడ్ దాది ప్రకాష్ మని స్మృతి ద్వితీయ సంవత్సరం సందర్భంగా పోచారం మున్సిపాలిటీ టౌన్షిప్ బ్లాక్ ఏ, బి 10 ఫ్లాట్ లో నిర్వహించారు, లైన్స్ క్లబ్ మరియు ఆదిత్య హాస్పిటల్ బ్లడ్ సెంటర్ వారి సౌజన్యంతో ఈ క్యాంపు నిర్వహించారు, ఈ సందర్భంగా మెట్టు బాల్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేసి మనిషి ఆరోగ్యాన్ని కాపాడిన వాళ్లు అవుతారని, ఈ క్యాంపు ఉదయం 10 గంటలనుండి సాయంత్రం ఏడు గంటలకు నిర్వహించబడుతుందన్నారు, ఇప్పటివరకు దాదాపు వంద మంది పైగా రక్తదానంలో పాల్గొంటారని అనుకుంటున్నామన్నారు, రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాన్ని కాపాడవచ్చని, ఒక వ్యక్తి రక్తాన్ని ఎన్నిసార్లు అయినా దానం చేయొచ్చన్నారు, మీ దాతృత్వం మరొకరి జీవితంలో సరికొత్త ఆశను చిగురింపజేస్తుంది. సాటి మనిషి ప్రాణాలు కాపాడటంలో రక్తదానానికి మించిన దానం లేదు. రక్తదానం చేసి ప్రాణదాతలు కండి అన్నారు,ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డాక్టర్లు డాక్టర్ కమల డాక్టర్ విజయకుమార్ వారి బృందం మరియు ఆదిత్య హాస్పిటల్ బ్లడ్ సెంటర్ మెట్టు బాల్ రెడ్డి దంపతులు ఈ శిబిరంలో పాల్గొన్నా రు, అనంతరం నూతనంగా పదవి భాద్యతలు చేపట్టిన మున్సిపల్ కమీషనర్ ను కలిసి శాలువాతో సన్మానించారు,

## ఉచితంగా మట్టి వినాయకులు పంపిణీ చేసిన మిరియాల ప్రీతం

**టిపిసిసి జనరల్ సెక్రటరీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్,మిరియాల ప్రీతం ఆధ్వర్యంలో నిర్వహణ**



**శేరిలింగంపల్లి :** వినాయక చవితి పర్వదినాన పురస్కరించుకుని మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మిరియాల ప్రీతం ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ ప్రశంసనీయం అని జగదీశ్వర్ గౌడ్ అన్నారు.మిరియాల ప్రీతం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సుమారు 3 వేల మట్టి వినాయకులు ఉచితంగా పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం టిపిసిసి జనరల్ సెక్రటరీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్,రంగారెడ్డి డిసిసి వైస్ ప్రెసిడెంట్ విజయ భాస్కర్, గిరి కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ... మిరియాల ప్రీతం తమ ట్రస్ట్ ద్వారా ప్రతి సంవత్సరం మట్టి వినాయకులు పంపిణీ కార్యక్రమం చాలా అద్భుతంగా నిర్వహిస్తారు.మట్టి వినాయకులు పూజించడం ద్వారా పర్యవరానికి ఎంతో మేలు చేసిన వాళ్ళు అవుతామని భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండడానికి కాలుష్య రహిత సమాజాన్ని ఏర్పాటు చేసే బాధ్యత మనందరికీ ఉందని ఆయన పేర్కొన్నారు

# జీవితంలో సక్సెస్ సాధించాలనే తపన మీకూ ఉందా?

జీవితంలో

విజయం సాధించాలని అందరూ కోరుకుంటారు. కానీ కొందరికే ఇది సాధ్యమవుతుంది. విజయం అంత తేలికగా ఎవరికీ దక్కదు. ఇందుకోసం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవడం, సానుకూల దృక్పథం కలిగి ఉండటం, స్వీయక్రమశిక్షణ, కృషిని పెంపొందించుకోవడం చాలా ముఖ్యం.అదేవిధంగా విజయం కోసం పరితపించేవాళ్లు ప్రతి ఉదయం కొన్ని అలవాట్లను అనుసరించాలి. ఎందుకంటే ఉదయం అలవాట్లు మొత్తం రోజును ప్రభావితం చేస్తాయి. ఉదయం సరైన మార్గంలో ప్రారంభిస్తే మన శక్తిసామర్థ్యాలు, మానసిక స్థితి మెరుగుపడుతాయి. మీరూ జీవితంలో విజయం సాధించాలనుకుంటున్నారా? అయితే మీరూ ఈ అలవాట్లను కొనసాగించండి..




విజయవంతమైన వ్యక్తులు ఎల్లప్పుడూ ఉదయాన్నే నిద్రలేస్తారు. ఇలాంటి వారు సాధారణంగా ఉదయం 4:30 నుంచి 6:00 గంటల మధ్య నిద్రలేచి తమ రోజును ప్రారంభిస్తారు. ఇలా ఉదయాన్నే నిద్రలేవడం వల్ల రోజంతా అప్రమత్తంగా ఉంటారు. జడత్వం అనేదే వీరిలో ఉండదు. విజయవంతమైన వ్యక్తులు తమ ఉదయాలను ప్రశాంతంగా గడుపుతారు. వీరు ప్రతి ఉదయం ధ్యానం, శ్వాస వ్యాయామాలను అభ్యసిస్తారు. తద్వారా వారి మనస్సును కేంద్రీకరించి సానుకూలంగా మార్చుకుంటారు. ఈ అలవాటు వారి మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. రోజంతా దృష్టి కేంద్రీకరించడంలో సహాయపడుతుంది. విజయవంతమైన వ్యక్తులు ఎల్లప్పుడూ చాలా చురుకుగా ఉంటారు. ఎందుకంటే వీరు ఉదయాన్నే నిద్రలేచి యోగా, తేలికపాటి వ్యాయామం వంటి శారీరక శ్రమ చేస్తుంటారు. తద్వారా శరీరాన్ని తాజాగా ఉంచుకోవచ్చు. ఇది రోజంతా చురుకుగా ఉండటానికి సహాయపడుతుంది. విజయవంతమైన వ్యక్తులు ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమే తింటారు. వారు ఉదయం పండ్లు, పెరుగు, ఓట్స్, గింజలు వంటి ఆరోగ్యకరమైన, పోషకమైన ఆహారాన్ని తింటారు. ఇది సరైన పోషకాహారాన్ని అందిస్తుంది. రోజంతా మరింత సమర్థవంతంగా పనిచేయడానికి సహాయపడుతుంది. విజయవంతమైన వ్యక్తులు ఎల్లప్పుడూ ఉదయం పూట తమ రోజంతా లక్ష్యాలను నిర్దేశించుకుంటారు. వారు ముందుగా ఏ పనులు చేయాలో, మరింత ఉన్నతంగా ఎదగడానికి ఏ ప్రణాళికలు వేయాలో లక్ష్యాలను నిర్దేశిస్తారు. మీరు కూడా అదే విధంగా లక్ష్యాలను నిర్దేశించుకోవడం ద్వారా దశలవారీగా విజయ శిఖరాలను అధిరోహించవచ్చు. సానుకూల ఆలోచనలు విజయానికి మార్గం సుగమం చేస్తాయి. విజయవంతమైన వ్యక్తులు ప్రతి ఉదయం తమను తాము ప్రేరేపించుకుంటూ, సానుకూలంగా ఆలోచిస్తూ గడుపుతారు. ఇది వారిని రోజంతా ఉత్సాహంగా ఉంచుతుంది. మీరు కూడా మీ రోజును ఇలా సానుకూలంగా ప్రారంభించవచ్చు. సక్సెస్‌ఫుల్ వ్యక్తులు తమ సమయంలో ఒక్క సెకను కూడా వృధా చేయరు. వీరు తమ సమయాన్ని చక్కగా నిర్వహిస్తారు. సమయం వృధా కాకుండా ఉండటానికి రోజులో ముందుగా ఏ పనులు చేయాలో వారు ముందుగానే నిర్ణయించుకుంటారు. మీరు కూడా ఇదే విధంగా సమయ నిర్వహణ పాఠాన్ని నేర్చుకోవాలి.

# ఈ ఒక్క చిట్కాతో నిగారించే చర్మం మీ సొంతం!



మీరు ఏమి చేసినా, మన చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడానికి మన ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి. ఈ మార్పులు ఖచ్చితంగా మన చర్మంపై ప్రభావాన్ని చూపుతాయి. ప్రజెంట్ డేస్‌లో చాలా మంది ఎదుర్కొనే సాధారణ సమస్య నిస్తేజమైన చర్మం. దీని నుంచి బయటపడి మంచి నిగారించే చర్మాన్ని పొందాలని చాలా మంది అనుకుంటారు. అందుకోసం ఏవేవో ప్రయత్నాలు చేసి విఫలం అయి ఉంటారు. కానీ మన ఇంటి పరిసరాల్లో లభించే సహజమైన పుదీనా, నిమ్మరసంతో మన చర్మాన్ని మెరిసేలా చేసుకోవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఈ రెండింటిని కలిపి రసం తయారు చేసుకుని త్రాగడం వల్ల. కొద్ది రోజుల్లోనే మన చర్మం నిగారింపుగా మారుతుందని చెబుతున్నాయి. పుదీనా, నిమ్మరసం మీ చర్మ ఆరోగ్యాన్ని పెంచడానికి సహాయపడుతాయి. చర్మ సమస్యలకే కాదు.. వేసవి వేడి నుండి ఉపశమనం పొందడానికి కూడా ఈ రసం గొప్ప మార్గం. వీటిలో ఉండే పోషకాలు మీరు కోరుకునే మెరిసే చర్మాన్ని అందించడంలో సహాయపడతాయి. మొటిమలు ఉన్నవారికి పుదీనా చాలా మంచిది. పుదీనా ఆకులు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను, సాలిసిలిక్ ఆమ్లాన్ని కూడా కలిగి ఉంటాయి. కాబట్టి మీ ఆహారంలో పుదీనాను చేర్చుకోవడం ద్వారా, మీ చర్మం బిగుతగా మారడంతో పాలు సహజమైన మెరుపును పొందుతుంది. పుదీనా రసం తాగడమే కాకుండా, మీరు పుదీనాను నేరుగా మీ చర్మానికి మాస్క్ రూపంలో కూడా అప్లై చేయవచ్చు. నిమ్మకాయలో మనకు విటమిన్ సి పుష్కలంగా దొరుకుతుంది. ఇది మీ చర్మ ఆరోగ్యానికి అత్యంత అవసరమైన విటమిన్లలో ఒకటి. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (%చీ×న%) ప్రకారం, నిమ్మకాయలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వాటిలో సిట్రిక్ యాసిడ్ కూడా ఉంటుంది. ఇది చనిపోయిన చర్మ కణాలను తొలగించడంలో సహాయపడుతుంది. బ్లాక్ హెడ్స్, మొటిమల వంటి చర్మ సమస్యలను వదిలించుకోవడానికి నిమ్మరసం చాలా మంచిది. పుదీనా, నిమ్మరసం రసాన్ని మీరు ఇంట్లోనే ఈజీగా తయారు చేసుకోవచ్చు. మీరు ఇంట్లో తయారు చేసుకోగల సులభమైన జ్యూస్‌లలో ఇది కూడా ఒకటి. దీన్ని తయారు చేయడానికి, ముందుగా మీరు పుదీనా ఆకులు, ఉప్పు, నిమ్మరసం, తేనె, సోంపు గింజలను బ్లెండర్‌లో కొద్దిగా నీటితో రుబ్బుకోవాలి. తరువాత ఐస్ క్యూబ్స్, దోసకాయ ముక్కలు, తులసి ఆకులు ఒక గ్లాసులో వేసుకోవాలి. తయారుచేసిన మిశ్రమాన్ని గ్లాసులో పోసి బాగా కలపండి. ఇప్పుడు మీరు ఈ రుచికరమైన రసాన్ని తాగవచ్చు. ఇలా చేయడం ద్వారా కొన్ని రోజుల్లోనే మీ చర్మం నిగారింపుగా మారుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

# బ్యూటీ పార్లర్లకు వెళ్లే మహిళలు జాగ్రత్త..!



ప్రస్తుత రోజుల్లో చాలా మంది అందంగా కనిపించేందుకు ఆరాటపడుతున్నారు. అందంకోసం రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. కొంత మంది తమ జుట్టు, ముఖ సౌందర్యం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సెలూన్, బ్యూటీ పార్లర్లకు వెళతారు. అలా తరచూగా బ్యూటీ పార్లర్లలో షాంపూ చేయించుకునే వారికి ఇదోక హెచ్చరిక..ఇప్పుడు 'బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సిండ్రోమ్' అనే కొత్త సమస్య ప్రజల్ని భయపెడుతోంది. ఇది మీ మెడ, వీపుపై ఒత్తిడి వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య సమస్య. చాలా సెలూన్లలో షేవింగ్ చేసిన తర్వాత, లేదంటే హెయిర్ కలర్ వేయించున్న తరువాత అక్కడే హెయిర్ వాష్ చేయించుకుంటారు. ఇందులో వాషింగ్ కోసం ఉపయోగించే బ్యాక్ వాష్ బేసిన్లపై వాలతాము. ఇది మన మెడలను ఇబ్బందికరమైన కోణంలో కుదిస్తుంది. ఇది మెడ నొప్పి, గాయం, చాలా అరుదైన సందర్భాల్లో ప్రాణాంతక స్ట్రోక్‌లకు దారితీస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సిండ్రోమ్‌ను మొదట 1993లో అమెరికన్ న్యూరాలజిస్ట్ మైఖేల్ విన్ట్రాబ్ గుర్తించారు. ఈ సమస్యతో బాధపడే ముందు బ్యూటీ పార్లర్‌లో జుట్టును షాంపూతో శుభ్రం చేసుకున్న రోగులకు తీవ్రమైన స్ట్రోక్‌కు సంబంధించిన లక్షణాలు కనిపిస్తాయని ఆయన కనుగొన్నారు. స్ట్రోక్ అంటే మెదడుకు రక్త ప్రసరణలో అకస్మాత్తుగా అంతరాయం ఏర్పడటం వల్ల కలిగే మెదడు దాడి. ఇది సాధారణంగా రక్తం గడ్డకట్టడం వల్ల వస్తుంది. ఈ సందర్భంలో, ఆక్సిజన్, గ్లూకోజ్, పోషకాలు లేకపోవడం వల్ల మెదడు కణాలు దెబ్బతింటాయి. బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సిండ్రోమ్‌కు ప్రాథమిక కారణం కస్టమర్ తలకు షాంపూతో శుభ్రం చేస్తున్నప్పుడు వాష్‌బేసిన్ అంచున అధిక ఒత్తిడి అని పరిశోధనలు సూచిస్తున్నాయి. బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సిండ్రోమ్ నివారించడానికి ఏం చేయాలి.? : బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సిండ్రోమ్‌ను నివారించడానికి, బ్యాక్‌వాష్ సింక్‌ను ఉపయోగిస్తున్నప్పుడు మీకు నొప్పి, అసౌకర్యం ఎదురైతే, వెంటనే లేచి మీ మెడకు విశ్రాంతి ఇవ్వండి. లేకపోతే, కొంత వ్యాయామం కోసం మీ మెడను కుడి, ఎడమ వైపుకు తిప్పడానికి ప్రయత్నించండి. మీరు మీ జుట్టును కడుక్కోవాల్సిన అవసరం ఉంటే, ఒత్తిడిని తగ్గించడానికి మీ మెడ కింద ఒక టవల్ పెట్టుకోండి. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది.

# గర్భిణీలలో కాల్షియం లోపిస్తే.. ఆ సమస్యలను ఆహ్వానించినట్టే..

ప్రతీ మహిళ జీవితంలో గర్భం దాల్చడం అనేది ఒక కీలక ఘట్టం. మరో జీవికి జన్మనిస్తున్నాన్న సంతోషం ఓవైపు, ఏదో తెలియని భయం మరోవైపు. మహిళల్లో మానసిక ఇబ్బందులకు దారి తీస్తుంటాయి. అందుకు గర్భిణీలుగా ఉన్న సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని చెబుతుంటారు. ముఖ్యంగా తీసుకునే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. తల్లితో పోటు కడుపులో బిడ్డకు కూడా అవసరమైన పోషకాలు అందేలా ఫుడ్ తీసుకోవాలని సూచిస్తుంటారు. గర్భం దాల్చిన సమయంలో మహిళల శరీరంలో విటమిన్స్ లోపం అస్సలు ఉండకూడదు. ముఖ్యంగా క్యాల్షియం లోపం ఉన్నట్లయితే ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని నిపుణులు చెబుతున్నారు. గర్భధారణ సమయంలో కాల్షియం శరీరంలో కీలక పాత్ర పోషిస్తుందని అంటున్నారు. కాల్షియం ఎముకలు, దంతాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గర్భధారణ సమయంలో శిశువు ఎముకలు, దంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. ఇందుకు కాల్షియం ఎంతో అవసరం. శిశువుకు కాల్షియం తల్లి శరీరం నుంచి లభిస్తుంది. తల్లి శరీరంలో కాల్షియం లోపం ఉంటే పుట్టబోయే బిడ్డపై ప్రభావం పడుతుంది. అంతేకాకుండా గర్భిణీలోనూ ఎముకలు బలహీనంగా మారుతాయి. భవిష్యత్తులో బోలు ఎముకల వ్యాధి వంటి వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. ఇక పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై కూడా కాల్షియం లోపం తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. శిశువు ఎముకలు సరిగ్గా అభివృద్ధి చెందవు. ఇది పుట్టిన తరువాత శిశువులో బలహీనతకు దారితీస్తుంది. అలాగే శిశువు గుండె, కండరాలతో పాటు నరాల అభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. బిడ్డ కడుపులో తగినంత కాల్షియం పొందకపోతే.. అది భవిష్యత్తులో చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. గర్భధారణ సమయంలో స్త్రీలకు రోజుకు 1000 నుంచి 1200 %ఎన్త్ర% కాల్షియం అవసరం ఉంటుంది. ఇది పాలు, పెరుగు, జున్ను, ఆకుకూరలు, నువ్వులు, బాదం వంటి ఆహార పదార్థాల ద్వారా లభిస్తుంది. అయితే నువ్వులు వేడి చేసే అవకాశం కూడా ఉంటుంది. కాల్షియం లోపం ఉంటే వైద్యుడి సూచన మేరకు కాల్సియం సప్లిమెంట్స్‌ను తీసుకోవచ్చు.



# బాడీలో ఈ లక్షణాలు కనిపిస్తే.. కొలెస్ట్రాల్ పెరిగినట్లే..?

కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, మొదటగా కనిపించే లక్షణం కాళ్ళలో నొప్పి లేదా తిమ్మిరి. నడుస్తున్నప్పుడు లేదా విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు కాళ్ళలో బరువు లేదా తిమ్మిరి ద్వారా దీనిని గుర్తించవచ్చు. చేతులు మరియు కాళ్ళలో తిమ్మిరి, జలదరింపు లేదా చల్లగా అనిపించడం కూడా అధిక కొలెస్ట్రాల్ లక్షణాలు. కొంతమందిలో, పాదాల రంగు కూడా నీలం రంగులో కనిపించడం ప్రారంభమవుతుంది.ఛాతీలో నొప్పి లేదా ఒత్తిడి కూడా పెరిగిన కొలెస్ట్రాల్ ప్రధాన లక్షణం. వాస్తవానికి, కొలెస్ట్రాల్ ధమనులలో పేరుకుపోయినప్పుడు, ఛాతీలో మంట లేదా బిగుతుగా అనిపించడం జరుగుతుంది. ఇది గుండెపోటు లేదా కరోనరీ ఆర్టరీ వ్యాధికి సంకేతం కావచ్చు.మెడ, దవడ లేదా భుజంలో నొప్పి కూడా దీనికి సంకేతం కావచ్చు. శరీరంలో రక్త ప్రవాహం తగ్గినప్పుడు, ఈ భాగాలలో అసాధారణ నొప్పి లేదా దృఢత్వం అనుభూతి కలుగుతుంది. దీనిని ప్రజలు తరచుగా కండరాల నొప్పిగా భావించి విస్మరిస్తారు. తల బరువుగా అనిపించడం లేదా తల తిరుగుతున్నట్లు అనిపించడం కూడా కొలెస్ట్రాల్ పెరిగినట్లు సూచిస్తుంది. మెట్లు ఎక్కేటప్పుడు ఊపిరి ఆడకపోవడం లేదా త్వరగా అలసిపోవడం వంటివి కూడా విస్మరించకూడదు.పసుపు రంగు లేదా కళ్ళ చుట్టూ పసుపు వలయాలు ఏర్పడటం కూడా దాని లక్షణాలు కావచ్చు. ఇది శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి క్షీణిస్తోందనడానికి సంకేతం.మీ శరీరంలో ఇలాంటి మార్పులు గమనించినట్లయితే, వెంటనే మీ వైద్యుడిని సంప్రదించండి. సకాలంలో రోగ నిర్ధారణ, చికిత్స ఈ పరిస్థితి తీవ్రంగా మారకుండా నిరోధించవచ్చు. తల బరువుగా అనిపించడం లేదా తల తిరుగుతున్నట్లు అనిపించడం కూడా కొలెస్ట్రాల్ పెరిగినట్లు సూచిస్తుంది. మెట్లు ఎక్కేటప్పుడు ఊపిరి ఆడకపోవడం లేదా త్వరగా అలసిపోవడం వంటివి కూడా విస్మరించకూడదు.

# బిజినెస్

## మొరాయించిన ఎయిర్‌టెల్ సేవలు.. కంపెనీపై యూజర్ల ఆగ్రహం..!

భారతీ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ మరోసారి మొరాయించింది. ఈ సారి బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ సహా పలు కీలక నగరాల్లో ప్రభావం కనిపించింది. ఈ నెల 8న ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో ఎయిర్‌టెల్, జియో నెట్‌వర్క్ నిలిచిపోయిన విషయం తెలిసిందే. దాంతో కాల్స్, ఎస్ఎంఎస్, ఇంటర్‌నెట్ సేవలు స్తంభించాయి. డౌన్‌డెటెక్టర్ నుంచి వచ్చిన డేటా ప్రకారం.. మధ్యాహ్నం 12:15 గంటల ప్రాంతంలో ఫిర్యాదులు వచ్చాయి. 7,100 మందికి పైగా వినియోగదారులు ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ పనిచేయడం లేదని పేర్కొన్నారు. ఎయిర్‌టెల్ కస్టమర్ సపోర్ట్ హ్యాండిల్ ఎయిర్‌టెల్ కేర్స్ 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. 'తాత్కాలిక కనెక్టివిటీ సమస్య'గా పేర్కొంది. సమస్యను గంటలోగా పరిష్కారమవుతుందని పేర్కొంది. యూజర్లు తమ మొబైల్స్‌ను రీ స్టార్ట్ చేయాలని కంపెనీ సూచించింది. ఎయిర్ ట్వీట్‌లో 'ఈ అసౌకర్యానికి మమ్మల్ని క్షమించండి. ఈ సమస్య తాత్కాలిక కనెక్టివిటీ అంతరాయం కారణంగా జరుగుతుంది. దాదాపు ఒక గంటలో పరిష్కారమవుతుంది. మీ మొబైల్‌ను ఒకసారి రీస్టార్ట్ చేయండి' అని పేర్కొంది. నెట్‌వర్క్‌లో అంతరాయంపై సోషల్ మీడియా వేదికగా యూజర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ రోజు బెంగళూరులో ఎయిర్‌టెల్ ఇంటర్‌నెట్ నిలిచిపోయింది. కంపెనీ వినియోగదారులకు ముందుగానే తెలియజేయకూడదా?' అంటూ ఓ యూజర్ ప్రశ్నించాడు. మరొక యూజర్ 'గత 6 గంటలుగా ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ సేవలు నిలిచిపోయాయి. కాల్స్ రావడం లేదు. ఇంటర్నెట్ కూడా స్తంభించింది. కస్టమర్ కేర్ నుంచి కూడా స్పందన లేదు. దీనిపై %ు=ూ×% చర్య తీసుకోవాలి' అంటూ డిమాండ్ చేశాడు.

## అనిల్ అంబానీకి పెరుగుతున్న కష్టాలు..!

# ఫ్రాడ్‌గా ప్రకటించిన బ్యాంక్ ఆఫ్ ఇండియా!

పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి కష్టాలు పెరుగుతున్నాయి. దివాళా తీసిన రియలన్స్ కమ్యూనికేషన్ అకౌంట్లను ఎస్‌బీఐ బ్యాంక్ ఫ్రాడ్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా బ్యాంక్ ఆఫ్ ఇండియా సైతం కంపెనీ అకౌంట్స్ మోసపూరితమని ప్రకటించింది. ఇందులో మాజీ డైరెక్టర్, పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ పేరు సైతం ఈ కేసులో చేర్చింది. రెగ్యులేటరీ ఫైలింగ్స్ ప్రకారం.. బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఈ రుణ ఖాతాను మోసపూరితంగా ప్రకటించింది. 2016లో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపించింది. ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆగస్టు 2016లో రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు మూలధనం, నిర్వహణ వ్యయాన్ని అవసరాలను తీర్చడానికి రూ.700 కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. ఆర్‌కామ్, రిలయన్స్ టెలికామ్, అంబానీ అకౌంట్లను ఫ్రాడ్ అకౌంట్లుగా నిర్ధారించింది. మంజూరు చేసిన రుణాలను ఇతర మార్గాలకు మళ్లించడం, నిబంధనలు పాటించలేదని పేర్కొంది. ఈ కంపెనీతో సంబంధాలు ఉన్న కొంత మందికి నోటీసులు పంపించినట్లు చెప్పింది. ఈ మేరకు ఆగస్టు 22, 2025 రోజున ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో రిలయన్స్ కమ్యూనికేషన్స్ వెల్లడించింది. ఆగస్టు 8వ తేదీన తమకు నోటీసులు అందినట్లు తెలిపింది. నోటీసుల ప్రకారం.. రూ.724.78 కోట్ల రుణాలకు సంబంధించి రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ లోన్ అకౌంట్లు, అనిల్ ధీరూభాయ్ అంబానీ, మంజారి ఆశిష్ కాకెర్‌లను ఫ్రాడ్‌గా పేర్కొంది. 2017, జూన్ 30 నాటికే నిరర్థక ఆస్తులుగా నిర్ణయం తీసుకున్నారని.. ఈ విషయంపై రుణ గ్రహీతలు, గ్యారెంటీ ఇచ్చిన వారికి సమాచారం అందిస్తూ వచ్చామని.. అయినప్పటికీ ఆ విషయాన్ని వారు పట్టించుకోలేదని పేర్కొంది. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది జూన్‌లో ఎస్‌బీఐ సైతం అకౌంట్లను మోసపూరితమని ప్రకటించిన విషయం తెలిసిందే. రుణాల నిబంధనలు ఉల్లంఘించడం ద్వారా బ్యాంకు నిధులను దుర్వినియోగం చేసినట్లుగా ఆరోపణలు వచ్చాయి. ఎస్‌బీఐ ఫిర్యాదు మేరకు సీబీఐ శనివారం రిలయన్స్ కమ్యూనికేషన్, అంబానీ నివాసానికి సంబంధించిన ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించింది. ఆసియాలోనే ధనవంతుడైన ముకేశ్ అంబానీ తమ్ముడైన అనిల్ అంబానీపై ఎస్‌బీఐని మోసం చేశారన్న ఫిర్యాదు అందిందని పేర్కొంది. అనిల్ అంబానీ ప్రతినిధి వివరణ ఆరోపణలను ఖండించారు. ఎస్‌బీఐ దాఖలు చేసిన ఫిర్యాదు పది సంవత్సరాల కంటే పాత విషయాలకు సంబంధించిందని.. ఆ సమయంలో అంబానీ కంపెనీకి నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారని.. కంపెనీ రోజువారీ నిర్వహణలో ఎలాంటి పాత్రలేదని పేర్కొన్నారు. అయితే, రిలయన్స్ కమ్యూనికేషన్స్ కంపెనీకి ఎస్‌బీఐ రూ. 2,227.64 కోట్లు రుణాలు ఇచ్చింది. 2016 ఆగస్టు 26 నుంచి వడ్డీ, ఖర్చులు అదనం కాగా.. రూ.786.52 కోట్ల బ్యాంక్ గ్యారెంటీ సైతం ఉన్నది. ఈ క్రమంలో ఆ కంపెనీని, ప్రమోటర్ అనిల్ అంబానీ అకౌంట్లను ఫ్రాడ్‌గా ఎస్‌బీఐ ప్రకటించింది.




# ఆన్‌లైన్ గేమింగ్ నుంచి ఆర్థిక సేవల వైపు.. డ్రీమ్11 కొత్త బిజినెస్

దేశంలో ఆన్‌లైన్ మనీ ఆధారిత గేమింగ్‌పై నిషేధం పడింది. దీంతో అనేక గేమింగ్ సంస్థలు కొత్త మార్గాలను వెతుకుతున్నాయి. ఈ క్రమంలోనే డ్రీమ్11 ఇప్పుడు కొత్త బిజినెస్ ప్రారంభించేందుకు సిద్ధమైంది. చాలా మందికి డ్రీమ్11 ఫాంటసీ స్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్ గురించి తెలిసే ఉంటుంది. ఇప్పుడు ఈ సంస్థ కొత్త రంగంలోకి అడుగుపెడుతోంది. ఎందుకంటే ఆన్‌లైన్ గేమింగ్‌పై ప్రభుత్వం నిషేధం విధించిన తర్వాత, డ్రీమ్11 మాతృ సంస్థ డ్రీమ్ స్పోర్ట్స్ ఇప్పుడు ఆర్థిక సేవల రంగంలోకి ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో డ్రీమ్ మనీ పేరుతో కొత్త యాప్‌తో వచ్చేస్తోంది.

**కొత్త ప్రయాణం**

డ్రీమ్ 11 స్పోర్ట్స్ భారతదేశంలో మనీ ఆధారిత ఆన్‌లైన్ గేమ్‌లలో కీలకంగా ఉండేది. కానీ, ప్రభుత్వం డబ్బు ఆధారిత ఆన్‌లైన్ గేమ్‌లపై నిషేధం విధించడంతో, వాళ్లు ఆ గేమ్‌లను మూసివేయాల్సి వచ్చింది. అయినా, డ్రీమ్ స్పోర్ట్స్ అక్కడితో ఆగిపోకుండా కొత్త బిజినెస్ చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ యాప్ గత కొన్ని నెలలుగా పైలట్ ప్రాజెక్ట్‌గా నడుస్తోంది. ఇంకా అధికారికంగా లాంచ్ కాలేదు. గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఈ యాప్‌లో చిన్న మొత్తం రూ.10 నుంచి బంగారం కొనుగోలు చేయొచ్చు. రూ.1,000 నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్ సేవలు కూడా అందుబాటులో ఉంటాయి. అంటే, ఇది ఒక సరికొత్త ఆర్థిక సేవల ప్లాట్‌ఫామ్‌గా రూపొందుతోందని చెప్పవచ్చు.

**డ్రీమ్ సూట్ ఫైనాన్స్**

డ్రీమ్ మనీ యాప్‌ని డ్రీమ్ స్పోర్ట్స్‌లో ఒక భాగమైన డ్రీమ్‌సూట్ అనే యూనిట్ అభివృద్ధి చేస్తోంది. డ్రీమ్‌సూట్ వెబ్‌సైట్‌లో వాళ్లు చెప్పిన ప్రకారం, త్వరలోనే సజావుగా ఆర్థిక సేవలు అందించే ప్లాట్‌ఫామ్‌ని లాంచ్ చేయబోతున్నారు. అంటే, డ్రీమ్11 ఇప్పుడు గేమింగ్ నుంచి ఫైనాన్షియల్ సర్వీసెస్ వైపు మళ్లుతోందని స్పష్టమవుతోంది. ఈ కొత్త వెంచర్ ద్వారా డ్రీమ్ స్పోర్ట్స్ సామాన్యులకు సులువైన ఆర్థిక సేవలను అందించాలని చూస్తోంది. బంగారం కొనుగోలు, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు వంటి సేవలతో యూజర్లకు స్మార్ట్ నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పించాలని భావిస్తోంది.

**ఇంకా ఏం చేస్తోంది?**

డ్రీమ్ స్పోర్ట్స్ కేవలం డ్రీమ్11 గేమింగ్ ప్లాట్‌ఫామ్‌కే పరిమితం కాదు. వాళ్లు ఇప్పటికే ఎన్నో రంగాల్లో తమ వ్యాపారాన్ని విస్తరించింది. వాటిలో స్పోర్ట్స్ ఎక్స్‌పీరియన్స్, ట్రావెల్ ప్లాట్‌ఫామ్, స్పోర్ట్స్ ఈవెంట్ టికెటింగ్, వ్యాపార సేవలు, గేమ్ డెవలప్‌మెంట్ యూనిట్ ఉన్నాయి. దీంతోపాటు లాభాపేక్ష రహిత సంస్థ, సామాజిక సేవల కోసం కూడా పనిచేస్తోంది. ఈ విధంగా డ్రీమ్ స్పోర్ట్స్ ఒక్క గేమింగ్‌కే కాకుండా, వివిధ రంగాల్లో తమ వ్యాపారాన్ని విస్తరిస్తోంది. ఆన్‌లైన్ గేమింగ్ నిషేధం డ్రీమ్ స్పోర్ట్స్‌కి ఒక పెద్ద షాక్ ఇచ్చినా, మరో వ్యాపారం పేరుతో కస్టమర్లకు సేవలను అందించేందుకు సిద్ధమవుతోంది.



# స్పోర్ట్స్

## ప్రభావం చూపని బౌలర్లు..

# టీమిండియాపై ఆస్ట్రేలియా ఘన విజయం

బ్రిస్బేన్ వేదికగా భారత ఏ మహిళల జట్టుతో జరిగిన ఏకైక అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఏ మహిళల జట్టు 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌ల్లో ఇరు జట్లు సమాంతరంగా నిలిచినా, రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా పైచేయి సాధించి, గెలుపు సొంతం చేసుకుంది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 299 పరుగులకు ఆలౌట్ కాగా.. ఆస్ట్రేలియా 305 పరుగులు చేసింది. 6 పరుగులు వెనుకపడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ 286 పరుగులకు ఆలౌటై, ఆసీస్ ముందు 281 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఛేదనలో బ్యాటర్లంతా తలో చేయడంతో ఆసీస్ 85.3 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయతీరాలకు చేరింది. రేచల్ ట్రెనామన్ (64), మ్యాడీ డ్రేక్ (68), అనిక లియారాయ్డ్ (72) అర్ధ సెంచరీలతో సత్తా చాటగా.. కెప్టెన్ తహిల విల్సన్ (46) ఓ మోస్తరు స్కోర్ చేసింది. నికోల్ ఫాల్టుమ్ (16 నాటౌట్), ఎల్లా హేవర్డ్ (4) ఆసీస్‌కు విన్నింగ్స్ రన్స్ అందించారు. 281 పరుగుల లక్ష్యాన్ని డిఫెండ్ చేసుకోవడంలో భారత బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. కెప్టెన్ రాధా యాదవ్ 8 మంది బౌలర్లు మార్చిమార్చి ప్రయోగించినా ఎలాంటి సానుకూల ఫలితం రాలేదు. సైమా ఠాకోర్ 2, జోషిత, తనుశ్రీ తలో వికెట్ తీశారు. అంతకుముందు యామీ ఎడ్గర్ (19-6-57-5) ఐదు వికెట్ల ప్రదర్శనతో, ప్రెస్ట్‌విడ్జ్ (13.4-2-47-3) మూడు వికెట్ల ప్రదర్శనతో చెలరేగడంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 286 పరుగులకే పరిమితమైంది. రాఘ్వి బిస్త్ (86) రెండో ఇన్నింగ్స్‌లోనూ భారత్‌ను ఆదుకుంది. షఫాలీ వర్మ (52) అర్ధ సెంచరీతో రాణించింది. తేజల్ (39), తనుశ్రీ (25), టైటాస్ సాధు (22 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేశారు.



**శతక్కొట్టిన జింజర్**

లోయర్ ఆర్డర్ బ్యాటర్ సియన్నా జింజర్ (103) సెంచరీతో రాణించడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ స్కోర్‌కు ధీటుగా బదులిచ్చింది. జింజర్‌కు నికోల్ ఫాల్టుమ్ (54), తహిల విల్సన్ (49) సహకరించారు. భారత బౌలర్లలో సైమా ఠాకోర్ 3, రాధా యాదవ్, మిన్ను మణి తలో 2 వికెట్లు పడగొట్టారు.

**ఆదుకున్న రాఘ్వి**

తొలి ఇన్నింగ్స్‌లో రాఘ్వి బిస్త్ (93), జోషిత (51) ఆదుకోవడంతో భారత్ 299 పరుగులు చేయగలిగింది. ఆసీస్ బౌలర్లలో బ్రౌన్, ప్రెస్ట్‌విడ్జ్ తలో 3 వికెట్లు తీశారు కాగా, భారత ఏ మహిళల జట్టు మల్టీ ఫార్మాట్ సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించింది. ఈ సిరీస్‌లో తొలుత టీ20 సిరీస్ జరగగా.. ఆసీస్ 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. అనంతరం భారత్ వన్డే సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది. తాజాగా ఏకైక అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో గెలిచి ఆసీస్ సిరీస్‌ను చేజిక్కించుకుంది.

## అఫ్గానిస్తాన్ జట్టు ప్రకటన.. కెప్టెన్‌గా రషీద్ ఖాన్

ఆసియాకప్-2025 కోసం 17 మంది సభ్యులతో కూడిన జట్టును అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు ఆదివారం ప్రకటించింది. ఈ జట్టుకు స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ నాయకత్వం వహించనున్నాడు. సెప్టెంబర్ 9న అబుదాబిలో జరిగే టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో హాంకాంగ్‌తో అఫ్గానిస్తాన్ తలపడనుంది. ఈ టోర్నీ ఆరంభానికి ముందు అఫ్గాన్ జట్టు.. యూఏఈ, పాకిస్తాన్‌తో ట్రై-సిరీస్ ఆడనుంది. ఆసియాకప్ సన్నాహకాల్లో భాగంగా ఈ ముక్కోణపు సిరీస్‌ను ప్లాన్ చేశారు. ఇంతకముందే ఆగస్టు 5న ఆసియాకప్ కోసం అఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు 22 మంది సభ్యుల ప్రాథమిక జట్టును ప్రకటించింది. ఇప్పుడు అందులో నుంచి 17 మంది పేర్లను ఏసీబీ ఖరారు చేసింది. రషీద్ ఖాన్ డిప్యూటీగా వికెట్ కీపర్ బ్యాటర్ రహ్మానుల్లా గుర్బాజ్ వ్యవహరించనున్నాడు. ఆసియాకప్ ఎంపికైన జట్టులో చాలా మంది ఆటగాళ్లు ట్రై-సిరీస్‌లో పాల్గొంటారని ఏసీబీ ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా ట్రై-సిరీస్ ఆగస్టు 29న ప్రారంభమై, సెప్టెంబర్ 7న ముగియనుంది.

**ఆసియాకప్-2025కు అఫ్గాన్ జట్టు ఇదే**

రషీద్ ఖాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్, దర్విష్ రసూలీ, సెదిఖుల్లా అటల్, అజ్మతుల్లా ఒమర్జాయ్, కరీం జనత్, మహ్మద్ నబీ, గుల్బాదిన్ నాయబ్, షరాఫుద్దీన్ అష్రఫ్, మహ్మద్ ఇషాక్, ముజీబ్ ఉర్ రహమాన్, అల్లాహ్ గజన్ఫార్. నూర్ అహ్మద్, ఫారిక్ అహ్మద్




మాలిక్, నవీన్-ఉల్-హక్, ఫజల్హాక్ ఫరూకీ

రిజర్వ్ ఆటగాళ్లు: వఫివుల్లా తారఖాల్, నంగ్యాల్ ఖరోటే, అబ్దుల్లా అహ్మద్‌జాయ్

**ఆసియాకప్‌లో అఫ్గాన్ షెడ్యూల్**

అఫ్గానిస్తాన్ వర్సెస్ హాంకాంగ్- సెప్టెంబర్ 9 షేక్ జాయెద్ స్టేడియం, అబుదాబి
అఫ్గానిస్తాన్ వర్సెస్ బంగ్లాదేశ్ -సెప్టెంబర్ 16 షేక్ జాయెద్ స్టేడియం, అబుదాబి
అఫ్గానిస్తాన్ వర్సెస్ శ్రీలంక -సెప్టెంబర్ 18 షేక్ జాయెద్ స్టేడియం, అబుదాబి

## కుప్పకూలిన సౌతాఫ్రికా.. చరిత్రలో రెండో అతి భారీ విజయం సాధించిన ఆస్ట్రేలియా


ఆస్ట్రేలియా జట్టు తమ వన్డే క్రికెట్ చరిత్రలో రెండో అతి భారీ విజయం సాధించింది. ఇవాళ (ఆగస్ట్ 24) సౌతాఫ్రికాతో జరిగిన నామమాత్రపు వన్డేలో 276 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. పరుగుల పరంగా ఆసీస్‌కు అతి భారీ విజయం నెదర్లాండ్స్‌పై (2023 వన్డే వరల్డ్‌కప్‌లో 309 పరుగుల తేడాతో) దక్కింది. యాదృచ్ఛికంగా ఈ మ్యాచ్‌లో ఆసీస్ చేసిన స్కోర్ కూడా వారి వన్డే క్రికెట్ చరిత్రలో రెండో అతి భారీ స్కోర్‌గా నిలిచింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 431 పరుగులు చేసింది. వన్డేల్లో ఆసీస్ తమ అతి భారీ స్కోర్‌ను కూడా సౌతాఫ్రికాపైనే చేసింది. 2006లో జోహనెస్‌బర్గ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 4 వికెట్ల నష్టానికి 434 పరుగులు చేసింది. సౌతాఫ్రికా విషయానికొస్తే.. ఆ జట్టుకు పరుగుల పరంగా వన్డేల్లో ఇదే అతి భారీ పరాజయంగా నిలిచింది. దీనికి ముందు 2023 వరల్డ్‌కప్‌లో భారత్ చేతిలో ఎదురైన 243 పరుగుల పరాజయం వారికి వన్డేల్లో అతి భారీ పరాజయంగా ఉండింది. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 432 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తూ 24.5 ఓవర్లలో 155 పరుగులకే కుప్పకూలింది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ కూపర్ కన్నోలీ (5/22) అద్భుత ప్రదర్శనతో చెలరేగి సౌతాఫ్రికా పతనాన్ని శాశించాడు. మ్యాచ్ పూర్తి వివరాల్లోకి వెళితే.. 3 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన చివరి వన్డేలో ఆసీస్ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసింది. ట్రవిస్ హెడ్ (142), మిచెల్ మార్ష్ (100), గ్రీన్ (118 నాటౌట్) సెంచరీలతో కదంతొక్కడంతో నిర్ణీత 50 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 431 పరుగులు చేసింది. ఆసీస్ ఇ?న్నింగ్స్‌లో అలెక్స్ క్యారీ (50 నాటౌట్) అర్ధ సెంచరీతో రాణించాడు. అనంతరం? కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన సౌతాఫ్రికా.. కూపర్ కన్నోలీ (6-0-22-5), జేవియర్ బార్ట్‌లెట్ (6-0-45-2), సీన్ అబాట్ (4-0-27-2), ఆడమ్ జంపా (4.5-1-31-1) ధాటికి 155 పరుగులకే ఆలౌటైంది. సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌లో డెవాల్డ్ బ్రెవిస్ (49) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ గెలుపుతో ఆసీస్ ఇదివరకే కోల్పోయిన సిరీస్‌లో సౌతాఫ్రికా ఆధిక్యాన్ని 1-2కు తగ్గించింది. తొలి రెండు వన్డేల్లో సౌతాఫ్రికా గెలుపొందిన విషయం తెలిసిందే. కాగా, వన్డే సిరీస్‌కు ముందు ఇరు జట్ల మధ్య జరిగిన 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఆసీస్ 1-2 తేడాతో కైవసం చేసుకుంది.



# 'మహావతార్ నరసింహ' బ్లాక్‌బస్టర్ ట్రైలర్ చూశారా?

'మహావతార్ నరసింహ' సినిమా విడుదలై నెల కావస్తుంది. అయినప్పటికీ బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తుంది. ఇప్పటికే అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన ఇండియన్ యానిమేషన్ మూవీగా రికార్డ్ క్రియేట్ చేసింది. ఇప్పటి వరకు ఏకంగా రూ. 280 కోట్లకు పైగానే కలెక్షన్స్ రాబట్టింది. మూవీ భారీ విజయం అందుకోవడంతో తాజాగా మేకర్స్ కొత్త ట్రైలర్‌ను విడుదల చేశారు. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో హెూంబలే ఫిల్మ్స్ సమర్పణలో శిల్పా ధవాన్, కుశల్ దేశాయ్, చైతన్య దేశాయ్ సంయుక్తంగా 'మహావతార్ నరసింహ' యానిమేటెడ్ చిత్రాన్ని తెరకెక్కించారు. జులై 25న విడుదలైన ఈ చిత్రం మొదటి రోజు నుంచి అద్భుతమైన స్పందన రావడంతో ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్ నిండిపోయాయి. ఇప్పటికి కూడా కొన్ని చోట్ల విజయవంతంగా రన్ అవుతుంది.






## విశాల్ 35వ సినిమా 'మకుటం' టీజర్ రిలీజ్

ఇటీవల మదగదరాజ అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చి హిట్ అందుకున్న నటుడు విశాల్ మరో కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆయన కెరీర్‌లో 35వ చిత్రంగా రాబోతున్న ఈ చిత్రానికి 'మకుటం' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆదివారం ఒక ఆసక్తికరమైన టీజర్‌ను విడుదల చేసింది. ఈ సినిమాకు రవి అరసు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో విశాల్‌ను ఒక శక్తివంతమైన పాత్రలో చూపించారు. యాక్షన్ సన్నివేశాలు, గ్రాఫిక్స్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ చిత్రంలో విశాల్ సరసన దుషారా విజయన్ హీరోయిన్‌గా నటిస్తుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్ గుడ్ ఫిల్మ్స్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. వారి బ్యానర్‌లో ఇది 99వ చిత్రం.

## సరికొత్త అందాలతో మెరిసిన ఖుషి కపూర్



## యంగ్ హీరోయిన్ ప్రేమలో 'అర్జున్ దాస్' !

కోలీవుడ్ నటుడు అర్జున్ దాస్ ప్రేమలో పడ్డాడు. ఈమేరకు తమిళ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఖైదీ సినిమాలో విలన్‌గా నటించిన అర్జున్ దాస్ తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా దగ్గరయ్యాడు. ప్రస్తుతం ఓజీ సినిమాలో ఆయన కీలక పాత్రలో కనిపించనున్నారు. అయితే, ఒక యంగ్ హీరోయిన్‌తో అర్జున్ దాస్ ప్రేమలో ఉన్నారని నెట్టింట వైరల్ అవుతుంది. 2017లో వచ్చిన 'ఆక్సిజన్' సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన అర్జున్ దాస్.. మాస్టర్, విక్రమ్ చిత్రాలతో పాపులారిటీ తెచ్చుకున్నారు. అయితే, యంగ్ హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మితో ప్రేమలో ఉన్నట్లు కోలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. వారిద్దరూ కలిసి ఒక వెబ్ సిరీస్ కోసం పనిచేస్తుండగా ఈ ప్రచారం జరుగుతుంది. కానీ, అర్జున్ దాస్ ఖండించారు. ఆపై ఐశ్వర్య లక్ష్మి కూడా తామిద్దరం మంచి స్నేహితులమంటూ వివరణ ఇచ్చారు. అయినప్పటికీ ప్రచారం మాత్రం ఆగడం లేదు. కొందరు మాత్రం నిప్పు లేనిదే పొగ రాదంటూనే వారి ప్రేమ నిజమేనంటూ చెప్పుకొస్తున్నారు. సరైన సమయం చూసి ప్రేమ గురించి అందరికీ తెలుపుతారంటూ పేర్కొంటున్నారు. బ్యాంకు ఉద్యోగిగా, రేడియో జాకీగా అర్జున్ దాస్ పనిచేయగా.. ఐశ్వర్య లక్ష్మి వైద్య విద్య పూర్తి చేశారు. ఐశ్వర్య లక్ష్మి తెలుగులో సత్యదేవ్‌తో గాడ్సే మూవీలో నటించారు. ప్రస్తుతం 'సంబరాల ఏటి గట్టు'లో సాయిధరమ్ తేజ్‌తో నటిస్తున్నారు. మట్టి కుస్తీ, కింగ్ ఆఫ్ కొత్త,పొన్నియిన్ సెల్వన్,థగ్ లైఫ్ వంటి భారీ చిత్రాల్లో ఆమె మెప్పించారు. కేరళలోని తిరువనంతపురంలో జన్మించిన ఈ బ్యూటీ తమిళ ఇండస్ట్రీలో చాలా సినిమాలు చేశారు.





Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com